ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 03.10.2026 | సంపుటి :13 సంచిక : 74 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv
JANAMSAKSHI

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లోని మహాత్ముడి స్మారకం వద్ద నివాళులు అర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ఖర్గే, రాహుల్

# జాతిపితకు వందనం

**రాజ్‌ఘాట్‌లోని మహాత్ముడి స్మారకం వద్ద నివాళులు అర్పించిన రాష్ట్రపతి ముర్ము,ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి, ఖర్గే,రాహుల్**

- శాంతి, అహింస మరింత అవసరం
- మహాత్మా గాంధీ జీవితం, ఆదర్శాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం
- 'ఎక్స్' వేదికగా సందేశాన్ని పంచుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్ హౌస్ లోని బాపూ ఘాట్ లో నివాళులు అర్పించిన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,అజరుద్దీన్ ,పొన్నం ప్రభాకర్,ఎంపీ వేం నరేందర్ రెడ్డి ,ప్రభుత్వ సలహాదారు వి హనుమంత రావు,ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్,రామచంద్ర నాయక్ , ఎంఎల్ ఏ లు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు
- హైదరాబాద్ ( జనంసాక్షి)

న్యూఢిల్లీ(జనంసాక్షి):గాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్ముడి స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాపూజీ సేవలను, ఆయన అనుసరించిన శాంతి, అహింసా మార్గాలను ప్రధాని గుర్తుచేసుకున్నారు. ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు, ప్రముఖులు రాజ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ గాంధీ జయంతి వేడుకలు, స్వచ్ఛ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి.మరోవైపు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. దిల్లీలోని విజయ్ ఘాట్‌ను సందర్శించి అంజలి ఘటించారు. దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలను, ఆయన నాయకత్వ పటిమను గుర్తుచేసుకున్నారు. జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, మోదీ సహా పలువురు ప్రముఖులు నివాళలర్పించారు. ఉదయం రాజ్‌ఘాట్‌కు చేరుకున్న వారు గాంధీజీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం విజయ్‌ఘాట్‌ను సందర్శించి లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌లో నిర్వహించిన సర్వధర్మ ప్రార్థనలోనూ ప్రముఖులు పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటించారు.గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్' వేదికగా సందేశాన్ని పంచుకున్నారు. మహాత్మా గాంధీ జీవితం, ఆదర్శాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధాల నేపథ్యంలో గాంధీ శాంతి, అహింస సందేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడిందని పేర్కొన్నారు.

## జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే..

**సీఈసీ పదవి నుంచి తప్పుకునే వరకు ఆందోళనలు కొనసాగుతాయి**

- జంతర్‌మంతర్ వద్ద నిరసనలు.. తలెత్తిన ఉద్రిక్తత
- ఆప్ నేతలు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్ , యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టు



న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టారు. 'సేవ్ డెమోక్రసీ' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమానికి దిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. అక్కడికి మిగతా 2లో..



## సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలి

- పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పించాలి
- ముంబయిలో సీజేపీ ఆందోళనలో పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

ముంబయి(జనంసాక్షి): ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ కాక్రోచ్ జనతా పార్టీ ముంబయిలో ఆందోళన చేపట్టింది. శివాజీ పార్క్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించిన్పటికీ.. భారీ సంఖ్యలో యువత హాజయ్యారు. నిరసన జరిగే ప్రాంతానికి దగ్గర్లోని దాదర్ రైల్వేస్టేషన్, సెంట్రల్ ముంబయి ప్రాంతాల్లో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది మోహరించినప్పటికీ.. పెద్దఎత్తున నిరసనకారులు శివాజీ పార్క్‌కు చేరుకున్నారు. 'జ్ఞానేశ్ బ్రో, జస్ట్ రిజైన్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ వంటి విద్యార్థి సంఘాల ప్రతినిధులతో పాటు సీనియర్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, గాయకుడు విశాల్ దద్లానీ, గాంధీ మునిమనువడు, సామాజిక మిగతా 2లో..



## మెట్రో, ఆర్టీసీ.. రెండింటికీ ఒకటే పాస్..

**కామన్ పాస్ ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి**

**ఒక్క రోజుకు రూ. 400.. నెలవారీ రూ.8,500**

హైదరాబాద్(జనంసాక్షి): మెట్రో , ఆర్టీసీ కామన్ పాస్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రయాణికులకు సౌకర్యవంతమైన, నిరాటంకమైన ప్రజారవాణా అనుసంధానం కల్పించడమే లక్ష్యంగా ఆర్టీసీ, మెట్రో కలిసి కామన్ పాస్‌ను ప్రవేశపెట్టాయి. రోజువారీ, నెలవారీ పాస్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజువారీ ఉమ్మడి పాస్ రూ.400గా నిర్ణయించారు. (మెట్రో ఛార్జ్ రూ.300, ఆర్టీసీ ఛార్జ్ రూ.100) నెలవారీ పాస్ రూ.8,500 (మెట్రో ఛార్జ్ రూ.7,000, ఆర్టీసీ ఛార్జ్ రూ.1,500)గా ధరను ఖరారు చేశారు. మొదటిసారి కొనుగోలు చేసేటప్పుడు కార్డు కోసం రూ.100 వసూలు చేస్తారు. కార్డును తిరిగి ఇచ్చినప్పుడు రూ.100 మిగతా 2లో..

## 44 ఏళ్ల కల.. నెరవేరిన వేళ..



**మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణం**

**చైనాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 1-0 తేడాతో విజయం**

**బాక్సింగ్‌లో పర్వీన్ హుడాకు స్వర్ణం**

టోక్యో(జనంసాక్షి):ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు స్వర్ణ పతకం గెలుచుకుంది. చైనాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 1-0 తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున లాల్‌రెమ్‌సియామి గోల్ చేసింది. ఈ విజయంతో భారత మహిళల హాకీ జట్టు 44 ఏళ్ల పసిడి కరవు తీర్చింది. ఈ విభాగంలో టీమిండియా చివరిగా.. స్వదేశంలో 1982 ఆసియా క్రీడల్లో స్వర్ణం నెగ్గింది. ఈ విజయంతో ఈ టోర్నీలో భారత్ స్వర్ణాల సంఖ్య 16కు చేరింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో మొత్తంగా 76 పతకాలు ఉన్నాయి. ఈ విజయం ద్వారా 2028 ఒలింపిక్స్‌కు భారత మహిళా హాకీ బృందం అర్హత సాధించింది.

**బాక్సింగ్‌లో మరో స్వర్ణం..**

ఈసారి పర్వీన్ హుడా వంతు ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు మరో స్వర్ణం వరించింది. మహిళల 65 కేజీల విభాగంలో పర్వీన్ హుడా అద్భుత ప్రదర్శనతో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఫైనల్‌లో చైనీస్ తైపీకి చెందిన నీన్ చిన్ చెన్‌ను 3-2 తేడాతో ఓడించింది. దీంతో ఆసియా క్రీడల బాక్సింగ్‌లో స్వర్ణ పతకం నెగ్గిన మూడో బాక్సర్‌గా నిలిచింది. మేరీకోమ్, లవ్లీనా తర్వాత పర్వీన్ దక్కించుకుంది.ప్రస్తుతం ఆసియా క్రీడల్లో బాక్సింగ్‌లో ఇది ఐదో పతకం. ఇందులో రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలు ఉన్నాయి. మొత్తం భారత్ 73 పతకాలతో మిగతా 2లో..

## రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్లు

**డిసెంబర్ 9న ప్రారంభం: సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. దీనిలో భారంగా రూ. 9 కోట్ల విరాళాన్ని అందజేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్లను డిసెంబరు 9న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నవంబర్ 30 నాటికి కిచెన్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ నాగర్‌కర్నూల్‌లో కిచెన్ కోసం రూ.5.17 కోట్ల చెక్కు ఇచ్చింది. వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కిచెన్ కోసం చైన్ ల్యాబ్స్ రూ.4 కోట్ల చెక్కును అందించింది. జున్నార్ సోలార్ సిస్టమ్స్ సీఎండీ శేఖర్‌రెడ్డి, సీఈవో అనిల్‌బాబు, చైన్ ల్యాబ్స్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ మిగతా 2లో..





## నగరంలో ఆటో ఛార్జీలు భారీగా పెంపు

- కనీస ఛార్జీ 1.6 కి.మీ వరకు రూ.30
- తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.14గా నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన రవాణాశాఖ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఆటో ఛార్జీలు పెంచుతూ రవాణాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటో కనీస ఛార్జీ 1.6 కి.మీ వరకు రూ.30, కనీస ఛార్జీతర్వాత ప్రతి కిలోమీటరుకురూ.14గా నిర్ణయించారు. మిగతా 2లో..

## 'సర్'తో ఓటు కోల్పోయిన వారికి భారీ ఊరట




**ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన అర్హులైన ఓటర్ల కోసం ప్రత్యేక డ్రైవ్**

**ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు • ఈసీ కీలక నిర్ణయం**



న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే (సర్)తో పెద్దఎత్తున ఓట్లు గల్లంత య్యాయంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అటు విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ ఈసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన అర్హులైన ఓటర్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. వీరితో పాటు కొత్త ఓటర్ల నమోదు కూడా చేపట్టనుంది. ఈ మేరకు సర్ ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ ముగిసింది. ఈ ప్రక్రియ సమయంలో ఏ వ్యక్తి పేరు అయినా జాబితా నుంచి తొలగిపోయినా.. లేదంటే యువ ఓటర్లు తమ ఓటుహక్కు పొందాలన్నా.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా తమ పేర్లను ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇలాంటి ఓటర్ల నమోదు కోసం ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులు తక్షణమే ప్రత్యేక డ్రైవ్ చేపడతారు" అని ఈసీ తమ మీడియా ప్రకటనలో వెల్లడించింది. ఫారమ్-6 ఉపయోగించి అర్హత కలిగిన ఓటర్లు తమ పేర్లను ఎన్నికల జాబితాలో నమోదు చేసుకునేందుకు దర ఖాస్తు చేసుకోవచ్చని మిగతా 2లో..

## సాహస పైలట్‌కు మోదీ అభినందనలు

**భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఫోన్‌లో పరామర్శించిన ప్రధాని నరేంద్రమోదీ**



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో పరామర్శించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న మచ్చర్‌తో మోదీ వీడియో కాల్‌లో మాట్లాడారు. మిగతా 2లో..

## కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలు దేశానికి గర్వకారణం

2 లో..

**కెప్టెన్ తెగువకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రశంసలు**

## మా జోలికొస్తే ఊరుకోం



**మా భూభాగలపై దాడి చేస్తే చివరకు అణ్వాయుధాలూ ప్రయోగిస్తాం.. నాటోకు పుతిన్ హెచ్చరిక**

మాస్కో(జనంసాక్షి):ఐరోపా దేశాలపై దాడి చేసే ఉద్దేశం తమకు లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టంచేశారు. ఉక్రెయిన్ విషయంలో ఉద్రిక్తతలను పెంచొద్దని ఆయా దేశాలను కోరారు. మాస్కోలోని వాల్డాయ్ ఫోరంలో మాట్లాడుతూ.. "ఏ ఐరోపా దేశంపైనా దాడి చేసే ప్రణాళికలు రష్యాకు లేవు. వాటితో శాంతియుత సంబంధాలు కొనసాగించాలనుకుంటున్నాం. అయితే, కలినిన్‌గ్రాడ్ సహా ఇతర రష్యా భూభాగంపై ఐరోపా దేశాలు ప్రత్యక్ష దాడి చేస్తే మాత్రం ఊరుకునేది లేదు. అదే జరిగితే మా వద్ద ఉన్న అన్ని ఆయుధాలతో పాటు అణ్వాయుధాలనూ ప్రయోగిస్తాం" అని నాటో దేశాలను పుతిన్ హెచ్చరించారు. అదే సమయంలో తమపై ఉక్రెయిన్ జరిపే మిగతా 2లో..

**ఆర్మీ ఆయుధాల చోరీ వ్యవహారం..**

## సంచలన విషయాలు వెలుగులోకి..

2 లో..

**విచారణలో మల్లేశ్ నుంచి కీలకసమాచారం రాబట్టిన పోలీసులు**

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
03.10.2026

## జాతిపితకు వందనం

దేశ ప్రజల తరఫున గాంధీకి గౌరవపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. సహానుభూతి, సమ్మిళిత విధానాలకు ప్రాధాన్యతనిస్తూ 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్యం అందరి సంక్షేమాన్ని కోరుకునే గాంధీ 'సర్వోదయ' స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చెప్పారు. నైతిక ప్రవర్తన, క్రియాశీల భాగస్వామ్యంతో శక్తివంతమైన, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి నిబద్ధతను పునరుద్ఘాటించాలని పిలుపునిచ్చారు.

## 'సర్'తో ఓటు కోల్పోయిన వారికి భారీ ఊరట

ఈసీ తెలిపింది. ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించినట్లు పేర్కొంది. సర్‌కు ముందున్న ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను సరిపోల్చాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఎవరి పేర్లను తొలగించారన్న లిస్ట్ సిద్ధం చేసి.. అందులో అర్హత కలిగిన ఓటర్లు ఎవరైనా ఉన్నారో లేదో గుర్తించాలని తెలిపింది. వారి చేత ఫారమ్-6ను పూర్తి చేయించాలని ఈసీ ఆదేశించినట్లు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. సర్ ప్రక్రియతో దాదాపు 13 కోట్ల మంది పేర్లను ఓటరు ముసాయిదా జాబితా నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఈసీ ఓట్లను తొలగిస్తోందని విపక్షాలు మండిపడ్డాయి. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది.

## మహారాష్ట్ర ఘోర రోడ్డు ప్రమాదం

### ఏడుగురు మృతి

**మహారాష్ట్ర ధర్మాంగాన్ వద్ద సమృద్ధి జాతీయ రహదారిపై వ్యాన్‌ను ఢీకొట్టిన ట్రక్కు**

ముంబై(జనంసాక్షి):మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం ధమన్‌గావ్ సమీపంలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ వ్యానును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఏడుగురు యువకులు మరణించారు. మరో 19 మందికి తీవ్రగాయాలయ్యాయి. దసరాకు అమ్మవారి విగ్రహం తెచ్చేందుకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గతరాత్రి వేగంగా దూసుకెళ్తున్న లారీ అదుపుతప్పి వ్యాన్‌ను బలంగా ఢీకొట్టినట్లు పోలీసులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అతివేగమే దుర్ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం షెగాన్ నుంచి దుర్గాదేవి విగ్రహాన్ని తీసుకొని వార్ధాకు కొంత మంది యువకులు వెళు న్నారు. సుమారు రాత్రి ఒంటి గంటకు వారి వాహనాన్ని ఏ లారీ ఢీకొట్టింది. దీనితో అక్కడికక్కడే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. స్పందించిన స్థానికులు, రైల్వే పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని గ్రామీణ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం వార్ధా మెడికల్ కాలేజీకి తరలించారు. పో ధమన్?గావ్? మేయర్ అర్చన రోథే ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ నికేతన్ కదం చెప్పారు.

## ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణం గుండె జబ్బే..

### ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి

**న్యూయార్క్(జనంసాక్షి):**ప్రపంచ సగటు ఆయుర్దాయం కరోనా మహమ్మారి కంటే ముందు కాలానికి చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. కానీ, మంచి ఆరోగ్యంతో గడిపే పరిస్థితి మాత్రం నెమ్మదిగా మెరుగవుతోందని తెలిపింది. కరోనాకు ముందు 2019లో 73.4 ఏళ్లుగా ఉన్న ఆయుర్దాయం... 2023లో 73.3 ఏళ్లకు చేరుకుందని గ్లోబల్ హెల్త్ ఎస్టిమేట్స్ వార్షిక నివేదికలో డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. మరోవైపు, ప్రపంచంలో సంభవిస్తున్న అత్యధిక మరణాలకు గుండె సంబంధిత వ్యాధి కారణమని వెల్లడించింది.

నివేదికలో ముఖ్యాంశాలివే..

యావత్ ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారితో సగటు ఆయుర్దాయం 2021లో 71.5 ఏళ్లకు తగ్గిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అది కోలుకొని కొవిడ్ ముందు స్థాయికి చేరుకుంది.కొవిడ్ తర్వాత డిమెన్షియా (మతిమరుపుతో కూడిన చిత్త వైకల్యం) మరణాలు మూడు రెట్లు పెరిగాయి. ఆందోళన, కుంగుబాటు సంబంధిత ఆరోగ్య కారణాలతో వాటిల్లే నష్టం కూడా విపరీతంగా పెరిగినట్లు తాజా నివేదిక పేర్కొంది.2023లో ప్రపంచవ్యాప్తంగా 6.1 కోట్ల మంది ప్రాణాలు కోల్పోగా.. 3.3 కోట్ల మంది కేవలం 10 ప్రధాన ఆరోగ్య సమస్యల వల్లే చనిపోయారు. వీటిలో అసాంక్రమిక వ్యాధులతో చనిపోయేవారి సంఖ్య గణనీయంగా ఉంది.ప్రపంచంలో అత్యధిక మరణాలకు ప్రధాన కారణం ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ (ఎఊఆ). గుండెకు రక్తప్రసరణ తగ్గే ఈ సమస్యతో 16శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2000లో దీనివల్ల 30 లక్షల మంది చనిపోగా.. 2023 నాటికి 95 లక్షలకు పెరగడం ఆందోళన కలిగించే విషయం. స్ట్రోక్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ)లు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. స్ట్రోక్‌తో 11శాతం (68లక్షలు), సీఓపీడీతో ఆరు శాతం(36లక్షలు) మంది చనిపోతున్నారు.శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, అల్జీమర్ సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, శ్వాసకోశ సంబంధిత క్యాన్సర్లు, అధిక రక్తపోటు, మూత్ర పిండాలు, డయేరియా సంబంధిత వ్యాధులు అత్యధిక మరణాలకు కారణమవుతున్న జాబితాలో ఉన్నాయి.

# జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే..



చేరుకున్న ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ సహా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు.నిరసనల నేపథ్యంలో పోలీసులు జంతర్ మంతర్‌ను మూసివేశారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. సమీపంలోని 11 మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు సీఈసీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నేడు ముంబయిలో నిరసనలు చేపట్టనుంది. ఈ కార్యక్రమానికి కూడా పోలీసులు అనుమతి నిరాకరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలని.. పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా అక్రమంగా ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారంటూ సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన సీఈసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జంతర్ మంతర్ వద్ద యూత్ కాంగ్రెస్, ఆప్ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. దీనితో అనుమతి లేకుండా నిరసనలు చేస్తున్నారంటూ దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే సంజీవ్ ఝూలను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జంతర్ మంతర్ వద్దకు వెళ్లకుండా ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌ను నార్త్ అవెన్యూ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ, తనను, ఝూను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆప్ నేత భరద్వాజ్? ఎక్స్? వేదికగా ఓ పోస్టు పెట్టారు. తమను అరెస్టు చేసినప్పటికీ, ఆందోళనలు కొనసాగించేందుకు, జంతం మంతర్ వద్దకు చేరుకోవాలని ఆప్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఆయన కోరారు. తమ నిరసనలకు అనుమతి లేదని పోలీసులు చెప్పారని, అయితే ప్రజాస్వామ్యంలో తన నిరసనలు చేయడానికి అనుమతి అవసరమా అని ఆయన ప్రశ్నించారు."సుమారు వారం రోజుల క్రితమే తాము జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి కోరుతూ పోలీసులకు లేఖ ఇచ్చాం. అయినప్పటికీ వారు అనుమతి ఇవ్వలేదు. అందుకే మా ఆందోళనలను వ్యక్తం చేయడానికి, మా ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటున్నాం" అని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. జంతర్ మంతర్ సమీపంలోని పలు మెట్రో స్టేషన్లను మూసివేశారని, అందువల్ల ప్రజలు సమీపంలో తెరచి ఉన్న మెట్రో స్టేషన్లలో ప్రయాణించాలని, వీలైతే నిరసన ప్రదేశానికి నడిచి వెళ్లాలని ఆయన కోరారు. ఆప్, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ముందే ప్రకటించిన నేపథ్యంలో, శుక్రవారం పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టం చేశారు.

## సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలి..

కార్యకర్త తుషార్ గాంధీ సహా పలువురు ప్రముఖులు ఈ ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నీట్‌కు వ్యతిరేకంగా దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన రెండు నెలల వ్యవధిలోనే మరోసారి ఆందోళనకు దిగాల్సిన పరిస్థితులు మోదీ హయాంలో నెలకొన్నాయని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. ధైర్యం ఉంటే నిరసనకారులను జైల్లో పెట్టండి అంటూ మహారాష్ట్ర సర్కారుకు సవాలు విసిరారు. మరోవైపు, శివసేన యూబీటీ, మహారాష్ట్ర నవనిర్మాణ సేన సీజేపీ ఆందోళనకు మద్దతు ప్రకటిం చాయి. శాంతిభద్రతల కోణంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు న్నామని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో మధ్యాహ్నం 4 గంటలకు నిరసన చేపడతామని సీజేపీ ముందుగానే హెచ్చరించింది. పోలీసుల నుంచి అనుమతి లభించకపోయినప్పటికీ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత తరలివ చ్చింది. నిరసన నేపథ్యంలో శివాజీ పార్క్ పరిసరాల్లో భారీగా పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరిం చారు. సమీపంలోని దాదర్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయి నప్పటికీ పెద్ద సంఖ్యలోనే యువత శివాజీ పార్క్ వద్ద నిరసన ప్రాంతానికి చేరుకుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ త్రివర్ణ పతాకాలతో పాటు వివిధ ప్లకార్డులను ప్రదర్శించారు.

**సర్‌పై సీజేపీ ఆరోపణలు**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. 2025 ఓటర్ల జాబితాను మార్చకుండా నిలిపివేయాలని కోరుతోంది. ఇటీవల ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి- సర్ ప్రక్రియు సంబంధించి కొన్ని నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఈ నివేదికల ఆధారంగానే పలు ప్రతిపక్ష పార్టీలతో పాటుగా సీజేపీ కూడా సీఈసీ రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తోంది. అయితే మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండించింది. సర్ ప్రక్రియ సహా ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నీ ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ ఏకగ్రీవంగానే తీసుకున్నవని స్పష్టం చేసింది.సీజేపీ చేపట్టిన నిరసనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఎన్నికల సంఘం కమిషనర్లు ఇప్పటికే అన్ని అనుమానాలకు వివరణ ఇచ్చారని, ప్రతిపక్షాలు నకిలీ కథనాలు వ్యాప్తి చేస్తున్నాయని, దీనిని ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. మరోవైపు మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత ఆశిష్ షెలార్ కూడా సీజేపీ నిరసనలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ఆందోళనలను రాజ్యాంగ విరుద్ధ చర్యగా అభివ ర్ణించారు. సర్ ప్రక్రియపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే న్యాయపరంగా, రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కోవాలని, వీధుల్లోకి వచ్చి అరాచకం సృష్టించడం సరికాదన్నారు.

## 44 ఏళ్ల కల.. నెరవేరిన వేళ..

ఆరో స్థానంలో ఉంది.హరియాణాలోని రుర్కిలో పర్వీన్ 2000 ఏప్రిల్ 15న జన్మించింది. పదకొండేళ్లకే బాక్సింగ్ కెరీర్‌ను మొదలు పెట్టింది. 2019లో సౌత్ ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత 2022 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, ఆసియా ఛాంపియన్‌షిప్‌లోనూ బంగారు పతకం నెగ్గింది. ఇప్పుడు ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సొంతం చేసుకుని సత్తా చాటింది.

## నగరంలో ఆటో ఛార్జీలు భారీగా పెంపు

రాత్రి 11గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్న రశాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునే వెసులుబా టు కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 3 నెలల్లోపు ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని రవాణాశాఖ స్పష్టం చేసింది.

## మెట్రో, ఆర్టీసీ.. రెండింటికీ ఒకటే పాస్

వాపసు చేస్తారు. ఒకే పాస్‌తో ఓఆర్‌ఆర్ లోపల నడిచే అన్ని రకాల ఆర్టీసీ సిటీబస్సుల్లో (పుష్పక్‌కు మినహా), మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు.

మీ టికెట్ యాప్‌తో.. రూ.600కే వారంపాటు..

సిటీ బస్సుల్లో ప్రయాణికులకు చిల్లర, టికెట్ల ఇబ్బందులు లేకుండా మీ టికెట్‌యాప్ ద్వారా ఓపెన్ టికెటింగ్ విధానాన్ని నేడు మంత్రి ప్రారంభించనున్నారు. ఇందులో ప్రయాణికులే నేరుగా టికెట్ బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత.. యాప్‌లోనే డిజిటల్ విధానంలో సులభంగా చెల్లింపు చేసి టికెట్ తీసుకోవచ్చు. మీ టికెట్‌యాప్‌లో ప్రత్యేకంగా డిజిటల్ వీక్లీ బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించారు. రూ.600 చెల్లించి వారం పాటూ అన్ని బస్సుల్లో అపరిమిత ప్రయాణం చేయవచ్చు. రోజువారీ, నెలవారీ పాసులు కూడా అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ తెలిపింది.

## మా జోలికొస్తే ఊరుకోం

దాడులకు ఐరోపా దేశాలు మద్దతిచ్చినా.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.నాటో సభ్య దేశాలైన పోలాండ్, లిథువేనియా మధ్య ఉన్న కలినిన్‌గ్రాడ్.. రష్యాకు వ్యూహాత్మకంగా కీలకమని పుతిన్ పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధించడానికి కూటమి ప్రయత్నిస్తే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అది ప్రపంచ దేశాలకే ప్రమాదమన్నారు. సైనికపరంగా నాటో రష్యాకంటే రెండింతలు పెద్దదని పుతిన్ గుర్తు చేశారు. ఫ్రాన్స్, బ్రిటన్‌ల వద్ద ఉన్న అణు సామర్థ్యాలపై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. అయినప్పటికీ ఈ పోటీలో తామే ఆధిక్యత సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. నల్ల సముద్ర ప్రాంతంలోని ఉక్రెయిన్ లక్ష్యాలపై దాడులను నిలిపివేసే ప్రసక్తే లేదని పుతిన్ స్పష్టం చేశారు. మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ జరిపిన దాడుల వల్ల తమ జీడీపీలో సుమారు 1శాతం నష్టం వాటిల్లిందన్నారు. నాటో విస్తరణ, ఐరోపా దేశాల జోక్యం వల్లే ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతోందన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్లు

బుగత సంతోష్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సెంట్రలైజ్డ్ కిచెన్లన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం తెలిపారు. విద్యార్థులు కిచెన్లను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, ఇది శాశ్వతంగా కొనసాగే కార్యక్రమం అయినందువల్ల అధికారులు అత్యంత జాగ్రత్త వహించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నమోదు చేయాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సాహస పైలట్‌కు మోదీ అభినందనలు

ఆయన అరోగ్య పరిస్థితి గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాక్‌పిట్‌లో తనకు ఎదురైన విపత్కర పరిస్థితి గురించి మోదీకి కెప్టెన్ స్మిత్ వివరించారు. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో మీరు చూపించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. మీరు కోలుకోవాలని యావత్ భారతావని ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు.. ఇతరులను రక్షించడం కోసం తమ సొంత ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం గర్వంగా చెప్పగలదు" అని స్మిత్‌తో మాట్లాడుతూ మోదీ ఆయనను ప్రశంసించారు. మోదీ నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. "మీరు నాకు అత్యంత ఆరాధ్యమైన వ్యక్తి. మీ నుంచి కాల్ రావడం చాలా ప్రత్యేకంగా, గర్వంగా ఉంది. ఇది నేను కలలో కూడా ఊహించని క్షణం. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు నేను హనుమాన్ చాలీసాను పఠిస్తాను. కాక్‌పిట్‌లో ఘర్షణ సమయంలోనూ దాన్నే జపించా. ఆ సమయంలో నేను గాయపడినా దాని గురించి ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి.. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని అర్థం చేసుకున్నా" అని ప్రధానికి తెలిపారు. అంతకుముందు స్మిత్ కుటుంబసభ్యులతో మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం స్మిత్ యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అక్కడి భారత దౌత్యకార్యాలయం వెల్లడించింది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో ఈ దాడి ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కెప్టెన్ స్మిత్‌పై కో-పైలట్ దాడి చేసి ఆయనను తీవ్రంగా గాయపర్చారు. కత్తిపోట్లతో శరీరం నుంచి రక్తం ధారగా కారుతున్నా.. విమానం కూలకుండా చూసి ఎంతోమంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడగలిగారు స్మిత్. దీంతో ఆయనపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన హీరో అని, 9/11 లాంటి మారణహోమాన్ని నివారించారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కొనియాడారు.

## కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలు దేశానికి గర్వకారణం

**కెప్టెన్ తెగువకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రశంసలు**

హైదరాబాద్(జనంసాక్షి):ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభినందించారు. ఆయన మాట్లాడుతూ.....విమానం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న క్షణాల్లోనూ కెప్టెన్ అప్రమత్తత, సమయస్ఫూర్తితో వ్యవహరించారని గవర్నర్ పేర్కొన్నారు. కేవలం 30 సెకన్ల ఆలస్యమైనా పరిస్థితి మరింత విషమంగా మారేదన్నారు. అసాధ్యమనుకున్న పరిస్థితిని తన ధైర్యంతో సాధ్యంగా మార్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారని ప్రశంసించారు.కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన తెగువ, మానవతా దృక్పథం భారతదేశానికి గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తూ.. కెప్టెన్ సంపూర్ణ ఆరోగ్యంతో మరింత కాలం సేవలందించాలని ఆకాంక్షించారు.

**ఆర్మీ ఆయుధాల చోరీ వ్యవహారం..**

# సంచలన విషయాలు వెలుగులోకి..

హైదరాబాద్(జనంసాక్షి): బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితుడు ఉప్పుతోళ్ల మల్లేశ్‌ను పోలీసులు పది రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించగా కీలక సమాచారం లభ్యమైంది. మల్లేశ్.. 2009లో భారత ఆర్మీలో చేరిన సమయంలోనే ఆయుధాలు, మందుగుండు సామగ్రిపై శిక్షణ పొందినట్లు పోలీసులు చెబుతున్నారు. ఏ కంటోన్మెంట్‌లో విధులు నిర్వహించినా ఆయుధాగారం బాధ్యతలు చూసినట్లు సమాచారం. అయితే విధుల్లో నిర్లక్ష్యం కారణంగా పలుమార్లు ఉన్నతాధికారుల నుంచి క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్నట్లు విచారణలో వెల్లడైంది. 16 ఏళ్ల ఆర్మీ సర్వీస్ పూర్తయిన తర్వాత మరో మూడేళ్ల సర్వీస్‌కు అవకాశం ఉన్నప్పటికీ.. తీసుకోకపోవడంతో మల్లేశ్‌లో అసంతృప్తి పెరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. 2022లో కోల్‌కతా బ్యారక్‌పూర్ కంటోన్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో.. యూనిట్ సమీపంలోని చెరకు రసం దుకాణదారుడు బీర్బల్ షాతో మల్లేష్‌శ్‌కు పరిచయం ఏర్పడింది. బీర్బల్ షా.. దేశంలో అక్రమంగా తుపాకులు సేకరించి విక్రయించే అవల్ దెయ్ అలియాస్ ఓబీని.. మల్లేశ్‌కు పరిచయం చేశాడు. ఓబీ స్మగ్లరా? కాదా? తెలుసుకునేందుకు రూ.10 వేలకు ఓ తుపాకీని మల్లేశ్ కొనుగోలు చేశాడు. దాంతో అమాయకులను బెదిరించి దారి దోపిడీ చేయాలని ప్రయత్నించినట్లు సమాచారం. కోల్‌కతాలో అది సాధ్యం కాకపోవడంతో తుపాకీని ఉపయోగించకుండా స్వగ్రామంలో దాచినట్లు విచారణలో వెల్లడైంది.

**పలుమార్లు రెక్కీ నిర్వహించి మరీ.. చోరీ**

కొంతకాలం సస్పెన్షన్‌లో ఉన్న మల్లేశ్.. 2023లో మళ్లీ బ్యారక్‌పూర్‌లో విధుల్లో చేరాడు. ఆ తర్వాత 2025 జూన్‌లో బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌కు బదిలీ అయ్యాడు. భార్య, పిల్లలతో కలిసి యాప్రాల్‌లో అద్దె ఇంట్లో నివసించాడు. ఇదే సమయంలో నాగర్‌కర్నూల్‌లో తనకు ఉన్న ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తాయన్న అంచనాతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు సమాచారం. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ ప్రాంతంలో సుమారు రూ.8 లక్షల విలువైన ప్లాట్ కొనుగోలు చేశాడు. ఇంటి నిర్మాణం, ప్లాట్ కొనుగోలుతో ఆర్థిక ఒత్తిడి పెరగడంతో.. దాన్నుంచి బయటపడేందుకు ఆర్మీ ఆయుధాల చోరీకి పథకం వేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే తన చిన్ననాటి స్నేహితులైన నిరంజన్, మల్లికార్జున్‌తో కలిసి తొలుత చోరీకి ప్లాన్ చేశాడు. బ్యాంకులు, బంగారు దుకాణాల్లో దొంగతనాలకు సంబంధించిన వెబ్‌సిరీస్‌లు, వీడియోలు చూసి.. వాటిని స్నేహితులకు పంపినట్లు విచారణలో వెల్లడైంది. వాటి ప్రేరణతో ఆర్మీ ఆయుధాలు దొంగిలించాలనే ఆలోచనకు వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. 2025లోనే ప్లాన్ చేసినా నిరంజన్, మల్లికార్జున్ అంగీకరించకపోవడంతో వ్యూహం మార్చుకున్నాడు. 2026 జూలైలో మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో పలుమార్లు రెక్కీ నిర్వహించి.. అక్కడ పనిచేస్తున్న శేషు, తన బ్యాచ్‌మేట్ ప్రవీణ్ సహకారం తీసుకున్నాడు.

హెడ్‌క్వార్టర్ కోట్‌లో భద్రపరిచిన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని చోరీ చేసేందుకు మల్లేశ్ తరచూ శేషును సంప్రదించేవాడు. అక్కడే పనిచేస్తున్న వినోద్‌ను కూడా చోరీకి సహకరించాలని కోరాడు. ఇందుకు ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద శేషు ద్వారా వినోద్‌కు రూ.లక్ష ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో వినోద్ చోరీకి అంగీకరించినట్లు సమాచారం. ప్రణాళిక ప్రకారం చోరీకి వారం రోజుల ముందే సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశాడు. చోరీ జరిగిన రోజు కెమెరాలపై మల్లేశ్ ఫోమ్ చల్లాడు. మల్లేశ్‌కు సహకరించేందుకు ప్రవీణ్, శేషులు విద్యుత్ దీపాలను ఆర్పివేశారు. సుమారు గంటన్నరపాటు మల్లేశ్ ఆయుధాలు తరలిస్తున్న సమయంలో అక్కడున్న ఇతర జవాన్లను శేషు, ప్రవీణ్ డైవర్ట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. మొదట ద్విచక్రవాహనంపై ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని తరలించి.. అనంతరం కారులో వాటిని నాగర్‌కర్నూల్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి దాచినట్లు మల్లేశ్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. మద్రాస్ రెజిమెంట్ 16వ బెటాలియన్‌కు చెందిన ప్రవీణ్, 20వ బెటాలియన్‌కు చెందిన శేషు, వినోద్.. ఆయుధాల చోరీలో తనకు పూర్తి సహకారం అందించినట్లు మల్లేశ్ విచారణలో అంగీకరించినట్లు సమాచారం.

ఆ ఇద్దరూ ఎక్కడ?

చోరీ తర్వాత మల్లేశ్.. కోల్‌కతాలోని బీర్బల్ షాను సంప్రదించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. బీర్బల్ షా ద్వారా అవల్ దెయ్ అలియాస్ ఓబీకి చోరీ చేసిన ఆయుధాలు సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. నాలుగు ఏకే-47లకు రూ.5 లక్షలు, పిస్టళ్లకు రూ.3 లక్షలు ఇవ్వాలని బీర్బల్ షా కోరినట్లు తెలుస్తోంది. అయితే చోరీ చేసిన మొత్తం ఆయుధాల్లో ఎన్ని విక్రయించారు.. ఎవరికి చేరాయి అన్నదానిపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. కాగా, ఈ కేసులో బీర్బల్ షా, అవల్ దెయ్ కోసం పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బీర్బల్ షా బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు వచ్చి అక్కడ నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా బీర్బల్ షా, ఓబీకి అక్ర మ ఆయుధాల నెట్‌వర్క్ ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. వారిద్దరూ పట్టుబడితే.. ఈ ఆయుధాల చోరీ వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

# చట్టం, రాజ్యాంగ ఉల్లంఘనలపై జవాబుదారీతనం ఉండాలి

- **ఈసీఐ-నెట్ పోర్టల్ వ్యవహారంలో ఈసీ 'అబద్ధాలు' చెప్పింది**
- **సెప్టెంబర్ 26 ప్రకటన మరిన్ని సందేహాలు రేకెత్తించింది: కాంగ్రెస్**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈసీఐ-నెట్ పోర్టల్ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం అబద్ధాలు చెబుతోందని, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఉల్లంఘనలకు ఈసీ బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. పారదర్శకత, విశ్వసనీయత పెంచుతామంటూ 2026 జనవరి 22న ఆర్భాటంగా ప్రారంభించిన ఈసీఐ- నెట్ పోర్టల్ చట్టబద్ధతపై కాంగ్రెస్ సందేహాలు వ్యక్తం చేసింది. ఈ పోర్టల్ రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఉందో లేదో ధ్రువీకరించేందుకు ఓ కమిటీ వేస్తామని సెప్టెంబర్ 26న ఈసీ ప్రకటించడంపై కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లోని ఓ పోస్టులో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం 2026 జనవరి 22న ఈసీఐ-నెట్‌ను ప్రారంభించింది. ఎన్నికల సంబంధిత సమాచారం, సేవలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే దీని ఉద్దేశమని ఈసీ తెలిపింది. రాజ్యాంగం, ప్రజా ప్రాతినిధ్య చట్టాలు 1950, 1951, ఓటర్ల నమోదు నిబంధనలు 1960, ఎన్నికల ప్రవర్తనా నియమాలు 1961కి అనుగుణంగా ఈసీఐ-నెట్‌ను అభివృద్ధి చేసినట్లు ఈసీ తన ప్రారంభ ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ వాదనలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈసీఐ-నెట్‌లో ఓటర్ల జాబితా వ్యవస్థకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల ప్రాప్యతను పరిమితం చేయడం ద్వారా గోవా, బంగాల్ వంటి రాష్ట్రాల్లో ఈఆర్‌ఓల నిర్ణయాలను పక్కన పెట్టే పరిస్థితి ఏర్పడిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఈఆర్‌ఓలకు చట్టబద్ధమైన అధికారాలు ఉన్నాయని ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఓటర్ల నమోదు నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ అధికారాలకు విరుద్ధంగా ఈసీ ఐ-నెట్ వ్యవస్థ పనిచేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.

తన కుమారుడి ప్రవర్తనను నియంత్రించనంత మాత్రాన మామను గృహ హింస చట్టం కింద బాధ్యుడిని చేయలేమని దిల్లీ హైకోర్టు పేర్కొంది. తన మామపై చేసిన గృహ హింస ఆరోపణల విషయంలో విచారణను కొనసాగించలేమంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

# సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ

- 2016 అక్టోబర్ 11న సాకారమైన సిద్దిపేట జిల్లా
- పదేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని వర్గాల సహకారంతో వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు
- ఈనెల 4న సిద్దిపేట లో సన్నాహక సమావేశం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా అనే నినాదాన్ని నిజం చేసిన సందర్భం అజరామరం.. చిరస్మరణీయం. దశాబ్దాల కాలంగా సిద్దిపేట ప్రజల ఆకాంక్షగా ఉన్న జిల్లా కేంద్రం ఏర్పాటై ఈనెల 11వ తేదీతో పది సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. తెలంగాణ తెచ్చిన కెసిఆర్ దశబ్దాలుగా నినాదాలుగా ఉన్న సిద్దిపేట జిల్లా ను ముఖ్యమంత్రిగా కెసిఆర్ చేతులమీదుగా 2016 అక్టోబర్ 11 నాడు ప్రారంభం చేసుకున్నాము అని, ఈ 2026 అక్టోబర్ 11 నాటికీ పదేళ్లు అవుతున్న సందర్బంగా సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ ఘనంగా నిర్వహించేల ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అందుకు ఈ సందర్బంగా 4వ తేదీన సిద్దిపేటలో జిల్లా పండుగ కార్యక్రమం పై సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 11 సభ నిర్వహిస్తూ అంతకు ముందు వారం రోజుల పాటు అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తూ పలు విధాలుగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారం రోజులు పాటు కార్యక్రమాలు రూపొందించేల సన్నాహక సమావేశం దిశానిర్దేశం ఉంటుందన్నారు. సిద్దిపేట జిల్లా పండుగ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్న

# నలుగురు నిందితులు అరెస్ట్

- స్వాధీనం చేసుకున్న ఏటూరు నాగారం పోలీసులు



**ఏటూరు నాగారం, అక్టోబర్ 02 (జనం సాక్షి) :** ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి 1100, గ్రామ్స్ మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జగదీశ్, రాంచరణ్ తేజ్, ఆకుల వంశీలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో జగదీష్, వంశీల వద్ద నుండి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసినట్లు, అలాగే వంశీ మాదకద్రవ్యాలను మరోవ్యక్తి వద్ద నుండి కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. మాదకద్రవ్యాల అసలు మూలం మరియు సరఫరా గొలుసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను సీజ్ చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. మాదకద్రవ్యాల అక్రమయు రవాణా, విక్రయం, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- ఎస్సై సురేష్‌కు తీవ్ర గాయాలు

**వేలేరు/కాజీపేట, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై నిలిపి ఉంచిన లారీని వేలేరు పోలీస్‌స్టేషన్ ఎస్సై సురేష్ ప్రయాణిస్తున్న క్రెటా కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్సై సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి పోలీసులకు, అత్యవసర సేవల సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది కారులో చిక్కుకున్న ఎస్సై సురేష్‌ను బయటకు తీసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారు వేగంగా లారీని ఢీకొనడంతో ముందు భాగం పూర్తిగా ధ్వంసమైనట్లు సమాచారం. ప్రమాద తీవ్రతను బట్టి కారు ముందు భాగం నుజ్జునుజ్జయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కొద్దిసేపు ఓఆర్ఆర్‌పై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

#### ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. లారీ రహదారిపై ఏ పరిస్థితుల్లో నిలిపి ఉంచారు? కారు ఏ వేగంతో ప్రయాణిస్తోంది? డ్రైవర్‌కు ఎదురుగా ఉన్న లారీ కనిపించలేదా? తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

### ఒకటి కాదు, రెండు కాదు...

# 168 సార్లు రక్తదానం



**తాండూరు ఆక్టోబర్ 2(జనంసాక్షి) :** ఒకసారి రక్తదానం చేయడమే గొప్ప విషయం అనుకునే ఈ రోజుల్లో, ఏకంగా 168 సార్లు రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టిన ఘనత డాక్టర్ సంపత్ కుమార్ కి దక్కుతుంది. వృత్తిరీత్యా డాక్టర్ గా ఎంతో మంది ప్రాణాలను కాపాడుతూనే, తన సొంత రక్తాన్ని దానం చేస్తూ మరెంతో మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్న సంపత్ కుమార్ నిజంగా దేవుడితో సమానమని పలువురు కొనియాడుతున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ మాజీ ప్రధాని లాల బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అనుబంధ విభాగమైన ఆర్యవైశ్య యువజన సంఘం లైన్స్ క్లబ్ మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా డాక్టర్ సంపత్ కుమార్ ముందుకొచ్చారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ డాక్టర్ సంపత్ కుమార్ సేవ, త్యాగం, మానవత్వం నేటి యువతకు స్ఫూర్తి దాయకం. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆయన నిరూపించారు. 168 సార్లు రక్తదానం చేయడం అంటే మాటలు చాలవు. ఇది ఒక రికార్డు మాత్రమే కాదు, ఒక తపస్సు అని అన్నారు. ఆయన ఇలాగే మరెన్నో సేవలు అందించాలని, ఆ భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నామని స్థానికు లు, యువకులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# 2028లో బీసీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ఆత్మకూర్, అక్టోబర్ 2 (జనం సాక్షి):** 2028లో బీసీ ప్రభుత్వ ఏర్పాటు మా లక్ష్యం అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు, బీసీ రాజ్యాధికార లక్ష్యంగా చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర 16వ రోజు వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణానికి చేరుకుంది, ఆత్మకూర్ గాంధీ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో తీన్మార్ మల్లన్న ప్రసంగిస్తూ భూములు సామాజిక ఆర్థిక పరిస్థితులు ప్రభుత్వ బడ్జెట్ వ్యయాం జనాభా లెక్కలు రాజకీయ ప్రతినిత్యం పై పనులు గణాంకాలను వెల్లడించారు, రెడ్లు వెలమల అధిపత్యం దూకుడు కారణంగానే బీసీలు భూమి సంపద రాజకీయ అధికారంలో తమకు రావలసిన వాటను కోల్పోయారని అన్నారు, తెలంగాణలో బీసీల భూములు ఎవరి చేతుల్లోకి వెళ్లాయి? బీసీలు కోసం ఎంత ఖర్చు చేశారు,,? రాజకీయ అధికారంలో బీసీల వాటా ఎంత,,? అంటూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, తెలంగాణలో బీసీల సామాజిక ఆర్థిక పరిస్థితిపై లెక్కలు వెల్లడించిన మల్లన్న రాష్ట్రంలో 53% మంది బీసీలు కూలీలుగా మారారని పేర్కొన్నారు, 80 శాతం మంది బీసీల వార్షిక ఆదాయం ఒక్క లక్ష లోపే ఉందన్నారు, 57% మంది బీసీ పిల్లలు ఇంటర్ పూర్తి కాగానే చదువు ఆపేసి పనిలోకి వెళ్తున్నారని బీసీలలో 50 శాతం కంటే ఎక్కువ మంది పేదరికంలో ఉన్నారని తెలిపారు నివేదికల ప్రకారం బీసీలలో 86% వెనుకబాటు తనం నమోదయిందని అన్నారు, దొరల చేతుల్లోకి వెళ్ళిన భూములను తిరిగి సాధించాలి, బీసీలకు రావాల్సిన బడ్జెట్ బీసీలకు ఖర్చు కావాలి, జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రతినిత్యం రావాలి, మన ఓట్లు మనం వేసుకొని మన రాజ్యాన్ని మనమే ఏలుకోవాలి రాజ్యాధికారమే మా అంతిమ లక్ష్యమని పిలుపునిచ్చారు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలు ఏకమై తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ గుర్తు అయిన కత్తెర ద్వారా తమ భూములు హక్కులు రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శి పూజారి స్వామి, యూత్ అధ్యక్షులు రవి, పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు జయపాల్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎండి గౌస్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, వీరభద్ర ఇన్చార్జి వర్మ, బిసి రాష్ట్ర పూజిత, బీసీ నాయకులు సత్యనారాయణ జిల్లా నాయకులు మహేందర్ పటేల్, భూమేష్ ,పటేల్ మహేష్, కరుణాకర్ ,విష్ణు బీసీ సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు,

# విద్యుత్ రంగానికి మహర్దశ

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల, అక్టోబర్ 2 (జనంసాక్షి): నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జడ్చర్లలో జడ్చర్ల, మిడ్జిల్ మండలాల రైతులకు 100 ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన పంపిణీ చేశారు. అలాగే జడ్చర్ల సబ్ డివిజన్, సెక్షన్ మరియు మిడ్జిల్ సెక్షన్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నవాబ్‌పేట్ మండలానికి 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైందని, జడ్చర్ల మున్సిపాలిటీకి మరో 132 కేవీ సబ్‌స్టేషన్ ప్రతిపాదనలు పంపామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నియోజకవర్గానికి 35 సబ్‌స్టేషన్లు రాగా, తాను ఎమ్మెల్యే అయ్యాక 23 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించానని తెలిపారు. రాబోయే 35 ఏళ్ల అవసరాలకు సరిపడా విద్యుత్ వసతులను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే విద్యుత్ మంత్రిగా ఉన్నా సబ్‌స్టేషన్లు తేలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి రూ.34.70 కోట్లు వెచ్చించిందని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందిస్తామని స్పష్టం చేశారు.

# బాల్య వివాహం

- భర్తతో పాటు తల్లిదండ్రుల అరెస్ట్

**బయ్యారం అక్టోబర్ 2 (జనంసాక్షి) :** బాల్యవివాహానికి పాల్పడిన ఒక కుటుంబం పై పోలీసులు కొరడా జులిపించారు. ఈ సంఘటనకు పాల్పడిన యువకుడితో పాటు, మైనర్ వివాహనికి సహకరించిన అతని తల్లిదండ్రులను బయ్యారం పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపించారు. బయ్యారం మండల పరిధిలో ఓ మైనర్ బాలికను ఓ యువకుడు వివాహం చేసుకోవడంతో పాటు, ఆమె గర్భం దాల్చినట్లు గుర్తించిన ఐసి డి ఎస్ సూపర్ వైజర్ బయ్యారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. ఆమె పిర్యాదు మేరకు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనిపై గార్ల-బయ్యారం సీఐ లోడిగ రవీందర్ ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. వారి దర్యాప్తులో నిందితుల పాత్ర నిర్ధారణ కావడంతో యువకుడితో పాటు అతని తల్లిదండ్రుల ఇరువురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు బాలుడు మైనర్ అయినందున జువెనైల్ హోమ్ వరంగల్ కు తల్లిదండ్రులను జిల్లా కారాగారానికి పంపించారు.

# విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం

- రైతులు విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా



**భిక్కనూరు అక్టోబర్ 02 (జనం సాక్షి):-** భిక్కనూరు మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు కోతలు విధించడం వల్ల వ్యవసాయ మోటార్లు పనిచేయడం లేదని దీంతో సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండడంతో రైతులు ఆగ్రహించి విద్యుత్ సబ్బేషన్ ముట్టడించారు. రైతులు విద్యుత్ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలకు నీరు అందలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ సౌత్ ఏఈ సంకీర్తన్ కు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఈ సంకీర్తన్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే విద్యుత్ కోతల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

# ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 2 (జనంసాక్షి) :** క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రై సిటీస్ హాఫ్ మారథాన్-2026, ఎడిషన్-2 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూఅక్టోబర్ 17 న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ నుంచి మారథాన్ ప్రారంభం కానుందని, ఇందులో 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, ఉదయం 5.30కి, 10 కిలోమీటర్లు ఉదయం 6.15కి, 5 కిలోమీటర్ల రన్ 7.30 కి ఫన్ రన్ పేరిట నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్ పై అవగాహన పెంపొందించడం తో పాటు వరంగల్ ట్రై సిటీస్ లో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మారథాన్ ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరుస వడ్ల బాలాజీ, సందీప్ రెడ్డి, బోడ జీవన్, రోషన్, బండి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం వైపు అడుగులు వేస్తే విజయం తథ్యం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- జాతీయ స్థాయిలో 'మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026' విజేత ప్రీతి ముండేకు ఘన సన్మానం



**మావల అక్టోబర్ 03( జనం సాక్షి):** జిల్లాలోని మారుమూల ప్రాంతంలోని ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి, జాతీయ స్థాయిలో 'మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026' కిరీటాన్ని కైవసం చేసుకున్న ప్రీతి ముండే విజయం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మిస్ ఎర్త్ వాటర్ ఇండియా 2026' ప్రీతి ముండేతో పాటు ఆమె తల్లిదండ్రులు ఉమ-ప్రకాశ్ లను అతిథులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా యువతులు ప్రీతిని రోల్ మోడల్‌గా తీసుకుని వారు ఎంచుకున్న రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అందంతో పాటు ఆరోగ్యం సైతం చాలా ముఖ్యమని, తమ ప్రస్తుత స్థితి గురించి ఆలోచించకుండా లక్ష్యం వైపు ముందుకు సాగితే విజయం ఖచ్చితంగా సాధ్యమవుతుందని సూచించారు. కుటుంబం నుంచే గొప్ప విజయగాధలు బయలుదేరుతాయని ఆయన తెలిపారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ, ఇంద్రవెల్లి మండలం హిరాపూర్ గ్రామానికి చెందిన ప్రీతి ముండే జాతీయ స్థాయి వేదికపై జిల్లా పేరును నిలబెట్టారని కొనియాడారు. చదువుతో పాటు సంస్కృతి, పురాణాలు, ఇతిహాసాలపై ఆమెకు ఉన్న విస్తృత అవగాహనే విజయాలకు బాటలు వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, హీరాపూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ అధ్యాపకుడు గజెల్లి మోహన్‌కు డాక్టరేట్



**బెల్లంపల్లి, అక్టోబర్ 2, (జనంసాక్షి) :** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలన శాస్త్రం సబ్జెక్టులో కాంట్రాక్టర్ లెక్చరర్ గా పనిచేస్తున్న గజెల్లి మోహన్ పిహెచ్డి పూర్తిచేసి డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. రాజస్థాన్లోని సన్రైస్ యూనివర్సిటీలో కొన్ని సంవత్సరాల క్రితం మోహన్ పిహెచ్డి సీటులో జాయిన్ అయ్యారు. ఆ విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ యోగేంద్ర కుమార్ పర్యవేక్షణలో పరిపాలన, నైతికత పరిపాలన నిర్ణయీకరణలో నైతికత పాత్ర పరిశీలన అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించగా పలువురు ప్రొఫెసర్లు డాక్టరేట్ ప్రదానానికి సూచన చేశారు. దీంతో గురువారం రాజస్థాన్లోని సన్రైస్ యూనివర్సిటీలో ఎక్స్టర్నల్ ఎక్స్పర్ట్ డాక్టర్ గీతా యాదవ్ ఆధ్వర్యంలో ఓపెన్ వైవా నిర్వహించారు. మోహన్ వెల్లడించిన పరిశోధన అంశాలు సంతృప్తికరంగా ఉండడంతో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని బాబు క్యాంప్ బస్తీకి చెందిన గజెల్లి బుచ్చమ్మ - రామయ్య (సింగరేణి రిటైర్డ్) దంపతులకు జన్మించిన మోహన్ బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హై స్కూల్, ఇంటర్మీడియట్ చదివారు. డిగ్రీని వరంగల్ ఎల్బీ కళాశాలలో చదివారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ నిర్మల్ పీజీ సెంటర్లో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదివి యూనివర్సిటీ సెకండ్ ర్యాంకు తో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. ఇలా ఉన్నత విద్యను ఉన్నతంగా చదివిన ఆయనకు ఆయా సందర్భాలలో దక్కిన ప్రశంసలు ఎన్నో. ఆయన కుటుంబంలో భార్య పిల్లలు కూడా విద్యా, ఉద్యోగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. భార్య విజయలక్ష్మి బెల్లంపల్లిలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్. పిల్లలు వంశీకృష్ణ ఎమ్మెస్ (యూఎస్ఏ). మణికంఠ గ్రాడ్యుకేషన్ కంప్లీటెడ్. బెల్లంపల్లిలోని మంజీర జూనియర్ కళాశాలలో, ప్రగతి జూనియర్ కళాశాలలో, భారతి జూనియర్ కళాశాలలో గజెల్లి మోహన్ లెక్చరర్గా విధులు నిర్వహించారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ గా 2001 నుంచి నేటి వరకు 25 సంవత్సరాలుగా అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో కళాశాల పరంగా ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. నిర్వర్తిస్తున్నారు.

#### - సామాజిక సేవలోనూ ముందు..

డిగ్రీ చదువుతున్నప్పటి నుండి సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో మోహన్ అనేక సంక్షేమ కార్యక్రమాల్లో, సామాజిక సేవలో పాల్గొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను "బెస్ట్ యువజన అవార్డు", "బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు", "రాష్ట్ర గవర్నర్ యాప్త అవార్డు", "బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డ్", "బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు" లతో పాటు జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో అనేక సంస్థలచే అనేక అవార్డులను పొందారు. జన విజ్ఞాన వేదిక, లోక్సత్తా, తెలంగాణ విద్యావంతుల వేదిక మొదలైన సంఘాలలో సేవలు అందించారు. ఎన్నికల నిఘా వేదిక, సంఘమిత్ర యూత్ క్లబ్, జ్ఞానమిత్ర గ్రంథాలయం మొదలైన వాటిలోనూ భాగస్వామ్యమయ్యారు. గజెల్లి మోహన్ కు అత్యున్నత డిగ్రీ పిహెచ్డి డాక్టరేట్ రావడం పై అభినందనలు వెల్లువెత్తాయి. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తో పాటు కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది. విద్యార్థినీ, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, వివిధ సేవా సంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా గజెల్లి మోహన్ మాట్లాడుతూ, పిహెచ్డి పట్టా సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. డాక్టరేట్ పొందడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# విశ్వాసం కోల్పోయాక సీఈసీ కొనసాగడమెందుకు..?

సంపాదకీయం

ఎన్నికల సంఘానికి ఉన్న అసలు అధికారం చట్టం ఇచ్చింది కాదు, ప్రజలు ఇచ్చే విశ్వాసం. ఆ విశ్వాసం కదిలినప్పుడు సంస్థ చేపట్టే ప్రతి నిర్ణయం అనుమానపు నీడలో పడుతుంది. ఇప్పుడు జరుగుతున్నది అదే. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌరసంఘాలు ఒకే గొంతుతో ప్రశ్నలు సంధిస్తున్నాయి. రాజధానిలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో వందలాది మంది అదుపులోకి తీసుకోబడ్డారు. ఇది ఏ ఒక్క పక్షం చేస్తున్న రాజకీయ రచ్చ కాదు, విస్తృతంగా పెరుగుతున్న అపనమ్మకానికి సూచిక.

ఈ ప్రశ్నలకు ఎన్నికల సంఘం ఇచ్చిన సమాధానం "అంతా చట్టప్రకారమే జరిగింది" అన్నదే. కానీ ప్రజాస్వామ్యంలో ఇది సరిపోదు. ఒక ఓటరు పేరు ఎందుకు తొలగించబడిందో, ఏ ప్రక్రియలో, ఎవరి పర్యవేక్షణలో తొలగించబడిందో, అభ్యంతరం చెప్పే అవకాశం ఎంతవరకు ఉందో స్పష్టంగా చెప్పలేని వ్యవస్థ నుంచి ప్రజలు నమ్మకాన్ని ఎలా ఆశించగలరు? న్యాయం జరగడమే కాదు, జరిగినట్టు కనిపించాలి. ఎన్నికల సంఘానికి ఇది రెట్టింపుగా వర్తిస్తుంది.

సాఫ్ట్‌వేర్ సమీక్ష కమిటీని ఏర్పాటు చేయడం, అభ్యంతరాల పరిష్కార విధానాన్ని మారుస్తామని ప్రకటించడం స్వాగతించదగినవే. కానీ అవి ఆలస్యంగా, నిరసనల ఒత్తిడి తర్వాత వచ్చిన చర్యలుగా కనిపిస్తున్నాయి. నిజంగా తప్పు జరగలేదని నమ్మకం ఉంటే, సంస్థ తనకు తానుగా ఎందుకు ముందుకు రాలేదు? అనుమానాలు పుట్టినప్పుడే పూర్తి వివరాలను బహిరంగపరిచి ఉంటే ఈ సంక్షోభం ఇంతవరకు వచ్చేది కాదు.

ఇక్కడ ప్రధాన ఎన్నికల కమిషనర్ బాధ్యత ప్రత్యేకంగా నిలుస్తుంది. సంస్థకు నాయకత్వం వహించేవారు కేవలం నిర్ణయాలు తీసుకునేవారు కాదు, ఆ సంస్థ నైతిక ముఖచిత్రం కూడా. ఆ ముఖచిత్రంపైనే ప్రశ్నలు నిలిచినప్పుడు, పదవిలో కొనసాగడం విచారణ విశ్వసనీయతను, సంస్థ ప్రతిష్ఠను రెండింటినీ దెబ్బతీస్తుంది. జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి తప్పుకుంటే, స్వతంత్ర విచారణకు అడ్డులేని మార్గం ఏర్పడుతుంది, ఎన్నికల సంఘంపై నమ్మకం పునర్నిర్మాణం మొదలవుతుంది. పదవి వ్యక్తి కోసం కాదు, వ్యవస్థ కోసం ఉన్నది.

ప్రజాస్వామ్యంలో చివరి మాట ప్రజలదే. ఆ ప్రజలే అనుమానిస్తున్నప్పుడు, సంస్థ ప్రయోజనం కోసం పక్కకు తప్పుకోవడమే గౌరవప్రదమైన మార్గం. అలా చేయకపోతే, రేపటి ఎన్నికల ఫలితాలను కూడా ప్రజలు అనుమానంగా చూసే ప్రమాదం ఉంది. అది భారత ప్రజాస్వామ్యానికి ఎవరూ కోరుకోని పరిణామం.

# ఎన్నికల సంఘం విశ్వసనీయత కోల్పోయిందా?




"హ్యాస్ ది ఎలక్షన్ కమిషన్ లాస్ట్ ఆల్ ఇట్స్ క్రెడిబిలిటీ?" – సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ లేవనెత్తిన ఈ ప్రశ్నను కేవలం ఒక వ్యాఖ్యగా కొట్టిపారేయడం కష్టం. ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ఇంత విస్తృతమైన చర్చ ఎందుకు మొదలైందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్నది రాజకీయ ప్రక్రియలో సహజం. కానీ ఎన్నికలను నిర్వహించే రాజ్యాంగ సంస్థ నిర్ణయాలపైనే ప్రజలకు అనుమానాలు కలిగితే, అది ఒక పార్టీకి సంబంధించిన సమస్య కాదు; ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన సమస్య.

అక్టోబర్ 2, మహాత్మా గాంధీ జయంతి రోజున ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పరిణామాలు ఈ ఆందోళనకు మరో కోణాన్ని చూపించాయి. ఎన్నికల సంఘం, ముఖ్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరును ప్రశ్నిస్తూ విద్యార్థులు, యువజన సంఘాలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు నిరసనకు ప్రయత్నించారు. పోలీసుల అనుమతి లేకపోవడంతో ఢిల్లీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిరసనకారులను అడ్డుకున్నారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం సుమారు 700 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సుల్లో తరలించారు. శాంతియుత నిరసనకు చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. ప్రజా భద్రత, ట్రాఫిక్, ఇతరుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. కానీ నిరసన హక్కును పరిపాలనా ఆంక్షలతో ఎంతవరకు పరిమితం చేయవచ్చన్న ప్రశ్న మాత్రం తప్పదు. గాంధీ జయంతి రోజున ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నలు లేవనెత్తుతున్న యువతను నిర్బంధించడం, వారి స్వరాన్ని నియంత్రించడానికి పోలీసు బలగాలను విస్తృతంగా వినియోగించడం వంటి దృశ్యాలు సహజంగానే ప్రజాస్వామ్యానికి సంబంధించిన అసౌకర్యకరమైన ప్రశ్నలను ముందుకు తెస్తాయి.

ముంబైలో పరిస్థితి కొంత భిన్నం. శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. 2013 బాంబే హైకోర్టు ఆదేశం, మహారాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, సైలెన్స్ జోన్, ట్రాఫిక్, ఆసుపత్రులకు రాకపోకల సమస్యలను పోలీసులు కారణాలుగా పేర్కొన్నారు. అయినప్పటికీ నిర్వాహకులు నిరసన కొనసాగించారు; చివరకు వేలాది మంది అక్కడకు చేరుకున్నారు. అందువల్ల ముంబై ఘటనను ఢిల్లీలో జరిగిన నిర్బంధాలతో పూర్తిగా సమానంగా చూడలేం. కానీ రెండు చోట్లా ఒకే ప్రశ్న మాత్రం నిలిచింది: ప్రజల అసంతృప్తిని నిరోధించడం ద్వారా ఎన్నికల సంఘంపై ఏర్పడిన అనుమానాలను తొలగించగలమా?

ఈ ప్రశ్నకు నేపథ్యం ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్టు రితికా చోప్రా చేసిన దర్యాప్తు కథనం. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల వ్యవధిలో కనీసం 14 సందర్భాల్లో నిర్ణయాలు, ప్రక్రియలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ పరిశోధన వెల్లడించింది. ఫారం–6 మార్పులు, ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు–పునరుద్ధరణ, ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణ వంటి అంశాలు అందులో ఉన్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడినట్టు కూడా నివేదిక పేర్కొంది.

ఎన్నికల సంఘం మాత్రం ఆ అభ్యంతరాలను తిరస్కరించలేదు; అవి నిర్ణయ ప్రక్రియలో భాగమైన భిన్నాభిప్రాయాలని పేర్కొంటూ, గత ఏడాది నిర్ణయాలన్నీ ఏకగ్రీవమని తెలిపింది. కానీ ఆ సమాధానం కీలక ప్రశ్నలకు పూర్తిగా సమాధానం ఇవ్వలేదని అదే పత్రికలోని తదుపరి నివేదిక పేర్కొంది. ముఖ్యంగా ఫారం–6లో మార్పులు ఎవరు చేశారు, కొన్ని నిర్ణయాలు ఎందుకు పూర్తి కమిషన్ ముందుకు రాలేదు వంటి ప్రశ్నలు మిగిలిపోయాయి.

ఇదే కారణంగా మాజీ న్యాయమూర్తులు, మాజీ ఎన్నికల అధికారులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, సంపాదకులు, సామాజిక కార్యకర్తలు, విపక్ష నాయకుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోనే యోగేంద్ర యాదవ్, శశి థరూర్ వంటి రచయితలు ఎన్నికల సంఘం చర్యలు సంస్థాగత విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని వాదించారు. ఇవి వారి అభిప్రాయాలు; వాటిని తుది వాస్తవ నిర్ధారణగా చూడలేం. కానీ ఒక రాజ్యాంగ సంస్థపై ఇంత విస్తృతమైన ప్రజా, రాజకీయ, మేధో చర్చ మొదలవడం మాత్రం విస్మరించలేని వాస్తవం.

అందుకే సమస్య జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగతంగా సరైనవారా, తప్పువారా అన్నది మాత్రమే కాదు. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఎలా తీసుకుంటోంది? అంతర్గత భిన్నాభిప్రాయాలు ఎలా పరిష్కరించబడుతున్నాయి? ఓటర్ల పేర్ల తొలగింపునకు సరైన కారణాలు, అప్పీల్ అవకాశాలు ఉన్నాయా? ఓటర్ల డేటాబేస్ భద్రత, ప్రాప్యతపై స్వతంత్ర పర్యవేక్షణ ఉందా? ఈ ప్రశ్నలకు పత్రాలతో కూడిన పారదర్శక సమాధానాలే అవసరం.

ప్రజాస్వామ్యంలో నిరసనను అణచివేయడం ద్వారా ప్రశ్నను మౌనం చేయవచ్చు; కానీ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేం. ఎన్నికల సంఘం విశ్వసనీయతను పోలీసు బందోబస్తు కాపాడలేదు; దానిని కాపాడేది పారదర్శకత, నిష్పక్షపాత నిర్ణయాలు, సంస్థాగత సమిష్టితనం, ప్రజలకు జవాబుదారీతనం. ఎన్నికలను నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగ బాధ్యత. కానీ ఆ ఎన్నికలపై ప్రజలకు నమ్మకం కలిగించడం దాని అంతకంటే గొప్ప బాధ్యత. ఆ నమ్మకమే ఇప్పుడు అసలు పరీక్షను ఎదుర్కొంటోంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

ఓటమెరుగని యుద్ధానికి..
అమ్మను కదా..
అంతరంగంలో
అరణ్యాలు
దగ్ధమవుతున్నా..
సవాలక్ష సంక్షోభాలు
కాటేద్దామని
మాటేస్తున్నా..

ఓటమెరుగని
యుద్ధానికి
నన్ను నేను సదా
సంసిద్ధం
చేసుకుంటూనే
ఉంటానిలా...

-డా.ఇక్బాల్ పాషా
9440775732

## ఆకాశంలో ప్రాణాలతో చెలగాటం, ఒక భారతీయ పైలట్ ధైర్యగాథ

దుబాయ్ నుండి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం FZ1073లో సెప్టెంబర్ 30న జరిగింది సినిమా కథ కాదు, 174 ప్రాణాలతో ఆడిన ప్రాణాంతక ఆట. ఒమన్కు చెందిన కో–పైలట్ కాక్పిట్లోనే కెప్టెన్ పై కత్తితో దాడి చేసి, విమానాన్ని కూల్చేయాలని ప్రయత్నించాడు. బోయింగ్ 737 MAX 8 విమానం రెండు నిమిషాల్లో 14 వేల నుండి 17 వేల అడుగుల వరకు నిట్టనిలువుగా పడిపోయింది

ఆ క్షణంలో అందరి ప్రాణాలు నిలిపింది ఒక భారతీయుడు, కెప్టెన్ స్మిత్ మచ్చర్. తీవ్రంగా గాయపడి, రక్తం కారుతున్నా స్మిత్ లొంగలేదు. దాడిని ఎదుర్కొంటూనే కాక్పిట్ డోర్ రిలీజ్ చేశాడు. దీంతో సిబ్బంది, ప్రయాణికులు లోపలికి దూసుకొచ్చి ఆ దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు ఆఫ్–డ్యూటీ ఫ్లైదుబాయ్ పైలట్లు కాక్పిట్లోకి వచ్చి విమానాన్ని నిలబెట్టి, సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు

ప్రస్తుతం కెప్టెన్ స్మిత్ అబుదాబిలో చికిత్స పొందుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వందల ప్రాణాలను కాపాడిన ధైర్యశాలి అని కొనియాడారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా 9/11 తరహా విషాదాన్ని ఆపిన హీరో అని ప్రశంసించారు. యూఏఈ అటార్నీ జనరల్ దీన్ని ఉగ్ర కుట్రగా అనుమానిస్తూ విచారణ చేపట్టారు. ఫ్లైదుబాయ్ ఇజ్రాయెల్కు విమానాలను తాత్కాలికంగా నిలిపివేసింది

ఈ ఘటన విమానయాన రంగంలో ఇన్సైడర్ థ్రెట్ అనే కొత్త భయాన్ని ఆవిష్కరించింది. ఏడాదికోసారి మెడికల్ చెకప్ సరిపోదు, ఇకపై AI ఆధారిత ప్రవర్తన పర్యవేక్షణ, నిరంతర మానసిక మూల్యాంకనం తప్పనిసరి కానుంది. కాక్పిట్లో ఇద్దరు ఉండాలనే నియమం ఉన్నా, ఆ ఇద్దరిలో ఒకరే ముప్పుగా మారితే? అందుకే ముగ్గురు సిబ్బంది లేదా భద్రతా శిక్షణ పొందిన క్యాబిన్ క్రూ కాక్పిట్లో ఉంచే ఆలోచన వస్తోంది. పైలట్ల మధ్య విభజన తెర, కాక్పిట్లోకి పదునైన వస్తువుల నిషేధం, అనుమానాస్పద ఇన్పుట్ వస్తే పైలట్ను లాక్ చేసే బయోమెట్రిక్ నియంత్రణలు, విమానం అదుపు తప్పితే గ్రౌండ్ నుండే ఆటో పైలట్ ను నియంత్రించి దింపే రిమోట్ సాంకేతికత వేగవంతం కానున్నాయి

ఒక భారతీయ పైలట్ చూపిన తెగువ ప్రపంచానికి భారత విలువలను చాటింది. అదే సమయంలో, కాక్పిట్ లోపలి శత్రువు నుండి కాపాడే వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని హెచ్చరించింది

- కొలను వెంకటేశ్వర రెడ్డి

# విప్లవ సింహం నల్లనరసింహం

*అది కుందేలు వేట కుక్కల్ని తరిమిన నేల కష్టజీవులు కందిరీగలై దొరలను శంకరగిరి మాన్యాలను పట్టించిన వీర భూమి*
*బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదే సుమతి అన్న మాటల్ని నిజం చేసిన నేల*
*అది తెలంగాణ సాయుధ రైతాంగ సమరానికి అంకురార్పణ చేసిన అమర భూమి*




ఉద్యమాగ్నితో మండిన ఆ కడవెండి అగ్ని గుండంలో నుంచి వెలువడిన విస్ఫు లింగమే నల్లా నరసింహులు. సహనం నుంచే సాహసం పుడుతుందన్నట్లు ఆనాడు జనగామ తాలూకాలో విసునూరు రామచంద్రారెడ్డి ఆగడాలను అడ్డుకొని పోరాటం చేసిన గెరిల్లా యోధుడు. ఆయన పేరు చెప్పితే దొరల గుండెల్లో హడల్. స్పైడర్ మాన్ గా ఎప్పుడు ఎక్కడ ఎలా విరుచుకుపడతాడో భూస్వాములకు తెలియని పరిస్థితి. ఆయన పేర్వారం జగన్నాథం గారు అన్నట్లు విప్లవ సింహం నల్ల నరసింహం. పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తి చేసినట్లు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళనాయకుడిగా వ్యవహరించి 13 ఏళ్ల పాటు అటు అజ్ఞాతంలోనూ ఇటు కారాగారంలోనూ శిక్షను అనుభవించిన యోధుడు త్యాగధనుడు నల్ల నరసింహులు. ఆయన తేదీ 2.10.1926 న నాటి జనగామ తాలూకాలోని కడవెండి గ్రామంలో ఒక మామూలు పద్మశాలి కుటుంబంలో జన్మించాడు. తండ్రి చేనేత వృత్తి ద్వారా బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధిని పొందేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. కనీస అవసరాలు తీరడం కూడా కష్టమైంది. ఈ నేపథ్యంలో ఆ ఊర్లోనే గడిలో విసునూరు రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ దొరసాని గ్రామంలో పెత్తనం చేసేది. వ్యవహారాలన్నీ ఆమె కను సన్నల్లోనే జరిగేవి. ఆమె దా ష్టికాన్నిచూసి ప్రజలు కొరివి దయ్యంగా పిలుచుకునేవారు. వరంగల్లు బట్టల వ్యాపారులు దొరసానికి ఫిర్యాదు చేసి ఉన్న కొద్దిపాటి బంగారం వెండితో పాటు బర్రెను అమ్మించి 600 రూపాయలను తీసుకున్నది. మిగతా రెండు వందలకు అప్పు పత్రం రాయించుకుంది. ఇలా గ్రామంలో సబ్బండ వర్ణాలు వారిని ఆమె దోపిడీకి గురి చేసేది. గ్రామం అంతా ఆమెకు వెట్టి చేయవలసిందే. ఎవరైనా ఆమెను దొరసాని అన్నా, అమ్మ అని పిలిచినా ఊరుకునేది కాదు. అమ్మ అంటే మీ అయ్య పెళ్ళాన్న? అని మందలించేదట. ప్రతి వారితో ఆమె అయ్యా అని పిలిపించుకునేది. దీనిని బట్టి ఆ మన నైజాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆనాటి భూస్వామ్య వ్యవస్థలో దొరతనం అనేది ఎలా ఉండేదో మచ్చుకు ఒక ఉదాహరణ. ఒకనాడు కడారు రామచంద్రరావు అనే దొర ఊళ్లో నడుచుకుంటూ వెళుతుంటే ఒక సన్న కారు రైతు తన ఇంటి ముందు అరుగుపై కూర్చుని లేవలేదట. దాంతో తెల్లవారేసరికి ఊళ్లో ప్రజల ఇంటి ముందున్న అరుగులన్నీ కూలగొట్టించాడట ఇది ఆనాటి పరిస్థితి. విసునూరు రామ చంద్రారెడ్డి 1942లో గ్రామంలో గడి నిర్మించుకోదలచి తన అధికార పరిధిలోని గ్రామాల ప్రజలను పీడించి వేలాది రూపాయలు వసూలు చేసి భవనాన్ని నిర్మించుకున్నాడు ఈ ఇంటి నిర్మాణానికై రోజుకొక ఊరి ప్రజలు వచ్చి వెట్టి చేసేవారు ఆనాడు ఆయన కట్టిన భవనం ఈనాడు తెలంగాణలో ఉన్న పటిష్ట భవనాలలో ఒకటి అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో 1944లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభకు వెళ్లి వచ్చిన నల్ల నరసింహులు అతని అనుచరులు ఆ సభ ఇచ్చిన చైతన్యంతో అక్కడినుండి తెచ్చిన సాహిత్యాన్ని స్థానిక ప్రజలకు వినిపించి అందులో సభ్యులుగా చేరితే దొరకు వెట్టి చేయవలసిన అవసరం లేదని ఉద్బోధించారు. ఆ ప్రబోధం ప్రజలకు నచ్చి అది క్రమంగా కడవెండి పరిసర గ్రామాలకు వ్యాపించి ఎక్కడికక్కడ ఆంధ్ర మహాసభ శాఖలు ఏర్పడ్డాయి. చిట్యాల ఐలమ్మ తన ఇంటిని ఆంధ్ర మహాసభ కార్యాలయంగా ఏర్పాటు చేసుకొని జెండా ఎగురవేసింది. 1941లో షేక్ బందగి హత్య, ఆ తరువాత దొడ్డి కొమరయ్య మరణం తర్వాత జరిగిన ఐలమ్మ భూ పోరాటం వెరసి దొర అధికార పీఠానికి సెగ తగిలింది. గ్రామాలలో భూస్వాములకు దొరలకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలను సమీకరిస్తూ ఉద్యమాగ్నిని రగిలించిన నల్ల నరసింహులను మొదట సూర్యాపేటలో అరెస్టు చేసి ధర్మాపురం పోలీస్ క్యాంపుకు తరలించి చిత్రహింసల పాలు చేశారు. సామాన్య ప్రజానీకంలో నల్ల నర్సింహులుకున్న పలుకుబడిని చూచి ఆనాటి అధికారులు ఆశ్చర్యపోయేవారు ఆపరేషన్ పోలోకు నాయకత్వం వహించిన జే.ఎన్. చౌదరి నల్లగొండలో ఖైదీలతో మాట్లాడుతున్న సందర్భంలో అప్పటి జిల్లా ఎస్పీ నరసింహులును ఆయనకు పరిచయం చేస్తూ "తెలంగాణ టైగర్"అని అభివర్ణించారు. నల్ల నరసింహులు తన ఆత్మ కథలో అజ్ఞాతవాసంలోని ఆనాటి పరిస్థితులను గురించి రాస్తూ"వరి అన్నం తినటం ఎరగం. జొన్న గింజలను బండపై పోసి మరో రాయితో వాటిని రాకి రవ్వ చేసి కాగే నీళ్లలో ఉడకబెట్టి తాగే వారం. అందులో ఉప్పు కారం లేదు. సప్పిడి అంబలితో అది ఒక్కపూట తింటూ ఎలా బ్రతకగలిగామో తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుందని"వివరించారు. నల్ల నరసింహులు అంతకు మునుపు మహబూబ్ నగర్ జిల్లా జైలు నుంచి, ఆ తరువాత హైకోర్టు నుంచి తప్పించుకున్న కేసులోనూ, భూస్వాములచే మోపబడిన ఇతర కేసుల్లోనూ న్యాయస్థానాలు విచారించి ఆయనతోపాటు మరికొంతమందికి ఉరిశిక్షను ఖాయం చేశారు. తేదీ 5.3.1955 న ఆయనను వడ్ల కొండ లో అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారులపై ఉరిశిక్షను అమలు చేయరాదని అంతర్జాతీయ స్థాయిలో నిరసనలు సాగాయి. 1950 జనవరిలో ఉరి తీయడానికి కొద్ది గంటల ముందే వారి ఉరిశిక్షను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. అంతేకాకుండా కమ్యూనిస్టు నాయకులైన పుచ్చలపల్లి సుందరయ్య గారు తర్వాతి కాలంలో అనేకసార్లు వీరి విడుదలకు ప్రయత్నం చేశారు ఈ లోగా అనారోగ్యం బారిన పడిన సుందరయ్య తనను పరామర్శించడానికి వచ్చిన ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డితో సాయిధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న అందరూ విడుదలయ్యారు కానీ నల్ల నరసింహులు గోపయ్యలు మాత్రమే అన్యాయంగా సంవత్సరాలకొద్దీ జైలు శిక్షను అనుభవిస్తున్నారని వారిని విడిచి పెట్టాలని కోరాడు. దానితో తేదీ 26.1.1959 న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆయన విడుదలయ్యాడు. ఈ కేసులో డేనియల్ లతీఫ్, గణేశులు బాగా వాదించారు. జైలు నుంచి విడుదలైన నల్ల నరసింహులు ప్రభృతులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బొంబాయి లాంటి నగరాల్లో వాళ్లకు సన్మానం చేశారు. ఈ పోరాటంలో నల్ల నరసింహులు తనతో పాటు పాల్గొన్న ముకుంద రెడ్డి, కాసాని నారాయణ, ఏసి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దొడ్డి మల్లయ్య, మచ్చ రామయ్య, మాచర్ల కొండయ్య, జీడి సోమ నరసయ్య మొదలైన వీరులందరును తలుచుకున్నారు. ఆనాటి కమ్యూనిస్టు పెద్దలైన రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, సుందరయ్య, డి.వి సుబ్బారావు, కే.ఎల్. మహేంద్ర, సి.యాదగిరిరావు మొదలైన వారితో చర్చలు జరిపారు. నల్ల నరసింహులు భార్య నల్ల వజ్రమ్మ గర్భవతిగా ఉంటూ పోరాటంలో పాల్గొంటూ భర్తతోపాటు అడవుల్లో రహస్య జీవితాన్ని గడిపింది. ఒక వీరుడు మరణిస్తే వేల కొలది ప్రభవింతురు అన్న కవి సోమ సుందర్ మాటలను నిజం చేసిన యోధుడు త్యాగధనుడు నల్ల నరసింహులు జీవన పర్యంతం ప్రజా జీవితంలోనే గడిపి తేదీ 5.10.1993 న అస్తమించారు. జనగామ జిల్లా ప్రజల వీరోచిత పోరాటాన్ని గూర్చి ఇప్పటికే దేవులపల్లి వెంకటేశ్వరరావు , నల్ల నరసింహులు రాసిన తెలంగాణ సాయుధ పోరాటం నా అనుభవాలు ఇక్కడ ప్రజల చైతన్యాన్ని అక్షరీకరించాయి. కాగా తాజాగా మామిండ్ల రమేష్ రాజా రాసిన ఐలమ్మ జీవిత చరిత్ర, జిలుకర వెంకన్న రచించిన దర్యానాయక్ జీవిత చరిత్ర ఇక్కడి ప్రజల పోరాట చైతన్యాన్ని చాటుతాయి. ఈ నేపథ్యంలో పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళ తప్ప అనే కమ్యూనిస్టులు కలిసి పోతే కదిలిపోయేదేమీ లేదు ప్రజల కష్టాలు కన్నీళ్లు తప్ప అన్న వాస్తవాన్ని గుర్తిస్తారని ఆశిస్తూ కమ్యూనిస్టు యోధుడు నల్ల నరసింహులు శతజయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# పాలస్తీనా







పసిపిల్లల న్యాయంకోసం ఐక్యరాజ్యసమితిలో నినదించిన భారతీయ న్యాయ మూర్తి జస్టిస్ ఎస్. మురళీధర్ గాజా బాలల విషాదాన్ని ప్రపంచం ముందుంచిన ఐక్యరాజ్యసమితి దర్యాప్తు కమిషన్ పసిపిల్లల చేతుల్లో పుస్తకాలు ఉండాలి. వారి పెదవులపై నవ్వులు ఉండాలి. ఆటస్థలాల్లో వారి కేరింతలు వినిపించాలి. తల్లి ఒడిలో భద్రంగా నిద్రపోతూ, రేపటి ప్రపంచం గురించి కలలు కనాలి. కానీ యుద్ధం ఆ బాల్యాన్ని శిథిలాల మధ్య సమాధి చేసినప్పుడు ప్రపంచ మనస్సాక్షి మౌనంగా ఉండగలదా?

గాజాలోని పాలస్తీనా పిల్లల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కమిషన్ 2026 జూన్ 18న విడుదల చేసిన నివేదిక ఈ ప్రశ్నను మరింత తీవ్రంగా ముందుకు తెచ్చింది. కమిషన్ నివేదిక ప్రకారం, 2023 అక్టోబర్ 7 నుంచి 2026 మార్చి 31 వరకు కనీసం 20,179 మంది పాలస్తీనా పిల్లలు మరణించగా, 44,143 మంది పిల్లలు గాయపడ్డారు. పిల్లలపై జరిగిన శారీరక, మానసిక హాని, విద్యా వ్యవస్థకు జరిగిన నష్టం, వైద్య సదుపాయాలపై ప్రభావం, కుటుంబాల విచ్ఛిన్నం వంటి అంశాలను కూడా కమిషన్ పరిశీలించింది.

ఇవి కేవలం గణాంకాలు కావు. ప్రతి సంఖ్య వెనుక ఒక పసి ముఖం ఉంది. ఒక తల్లి కన్నీరు ఉంది. ఒక తండ్రి వేదన ఉంది. ఒక కుటుంబం కోల్పోయిన భవిష్యత్తు ఉంది.

"పసిపిల్ల చేసిన నేరమేమిటి?"
ఒక చిన్నారి ఏడుపుకు మతం ఉండదు.
ఒక తల్లి కన్నీటికి జాతి ఉండదు.
ఒక పసిప్రాణానికి సరిహద్దులు ఉండవు.

పిల్లల చేతుల్లో పెన్సిళ్లు ఉండాలి–ఆయుధాలు కాదు. పాఠశాల గంటలు మోగాలి–బాంబుల శబ్దాలు కాదు. ఆటస్థలాలు ఉండాలి–యుద్ధభూములు కాదు.

అందుకే గాజా శిథిలాల మధ్య నుంచి మానవత్వం ప్రపంచాన్ని ప్రశ్నిస్తోంది:
"పసిపిల్ల చేసిన నేరమేమిటి?"

అంతర్జాతీయ వేదికపై భారతీయ న్యాయవేత్త

ఈ దర్యాప్తు కమిషన్‌కు భారతీయ న్యాయవేత్త, మాజీ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి, మాజీ ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసన్ మురళీధర్ అధ్యక్షత వహిస్తున్నారు.

2025 నవంబర్ 27న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి అధ్యక్షుడు ఆయనను ఫ్లోరెన్స్ ముంబా, క్రిస్ సిడోటీలతో కలిసి ముగ్గురు సభ్యుల కమిషన్‌లో నియమించారు. జస్టిస్ మురళీధర్‌ను ఆ కమిషన్‌కు చైర్‌గా నియమించారు.

2026 జూన్‌లో కమిషన్ విడుదల చేసిన పిల్లలపై నివేదికకు "ఽష్ట్రవ వంంవఅవెవ శీట ఎష్ట్రఅశ్రీఽష్ట్రశీశీఽ ష్ట్రుం ఎవవఅ ఽవర్‌తీశీఎవఽ" అనే శీర్షిక పెట్టింది. అంటే–"బాల్యం యొక్క సారమే ధ్వంసమైంది" అనే భావం. కమిషన్ వేలాది ఓపెన్–సోర్స్ సమాచారాన్ని సేకరించి ధృవీకరించడంతో పాటు బాధితులు, సాక్షులతో ఇంటర్వ్యూలు, సమూహ చర్చలు నిర్వహించినట్లు నివేదిక పేర్కొంది. పిల్లల స్వంత అనుభవాలను కూడా సాధ్యమైనంతవరకు నమోదు చేసినట్లు తెలిపింది.

న్యాయం కోసం నిలిచిన స్వరం

2026 జూన్ 23న కమిషన్ తాజా నివేదికను విడుదల చేస్తూ జస్టిస్ మురళీధర్ మాట్లాడుతూ, పాలస్తీనా పిల్లలపై తీవ్రమైన శారీరక, మానసిక నష్టం, అనాథత్వం, నిర్బంధం, స్థానభ్రంశం, ఆకలి, ఆరోగ్య–విద్యా వ్యవస్థల విధ్వంసం వంటి పరిణామాలను ప్రస్తావించారు. పిల్లలపై జరిగిన హింస వారి బాల్యాన్ని మాత్రమే కాదు, వారి భవిష్యత్తును కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోందని కమిషన్ పేర్కొంది.

ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి: న్యాయం అంటే ద్వేషం కాదు.
న్యాయం అంటే ఒక జాతిని ద్వేషించడం కాదు.
న్యాయం అంటే ఒక మతాన్ని నిందించడం కాదు.
న్యాయం అంటే బాధితుడు ఎవరో చూడకుండా, అతని ప్రాణానికి విలువ ఇవ్వడం.

ఏ దేశానికి చెందిన బాలుడైనా, ఏ మతానికి చెందిన బాలికైనా, ఏ జాతికి చెందిన కుటుంబమైనా– "నీ ప్రాణం విలువైనదే"
అని చెప్పగలగడమే నిజమైన మానవత్వం.
యుద్ధం ముగిసినా గాయాలు మిగులుతాయి
బాంబుల శబ్దం ఆగిపోవచ్చు.
తుపాకులు మౌనమవ్వవచ్చు.
కానీ తల్లిని కోల్పోయిన చిన్నారి గుండెలోని ఖాళీ వెంటనే నిండదు.
తండ్రిని కోల్పోయిన బాలుడి జ్ఞాపకాలు చెరిగిపోవు.
పాఠశాలను కోల్పోయిన బాల్యం ఒక్కరోజులో తిరిగి రాదు.

అందుకే పిల్లల రక్షణ అనేది కేవలం యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన చర్య కాదు. వారి విద్య, వైద్యం, మానసిక ఆరోగ్యం, కుటుంబ భద్రత, భవిష్యత్తు–ఇవన్నీ రక్షించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది.

ప్రపంచ మనస్సాక్షికి ఒక ప్రశ్న

చరిత్ర బాంబుల సంఖ్యను మాత్రమే గుర్తుపెట్టుకోదు.
చరిత్ర ఒక తల్లి కన్నీటిని కూడా గుర్తుంచుకుంటుంది.
చరిత్ర శిథిలాలను మాత్రమే చూడదు.
ఆ శిథిలాల మధ్య బొమ్మను వెతుక్కుంటున్న చిన్నారిని కూడా గుర్తుంచుకుంటుంది.
పసిపిల్లల సమాధులపై ఏ విజయ పతాకం శాశ్వతంగా ఎగరదు.
తల్లుల కన్నీళ్లపై ఏ రాజకీయ నినాదం శాశ్వతంగా నిలవదు.
చివరికి చరిత్ర అడిగే ప్రశ్న ఒక్కటే– "మానవత్వం ఎక్కడ నిలిచింది?"
ఆ ప్రశ్నకు మన సమాధానం స్పష్టంగా ఉండాలి:
మానవత్వం పక్షాన.
న్యాయం పక్షాన.
పిల్లల భద్రత పక్షాన.
శాంతి పక్షాన.
మతం కాదు – మానవత్వం.
ద్వేషం కాదు – న్యాయం.
యుద్ధం కాదు – శాంతి.

పసిపిల్లల కన్నీరు ఆగే వరకు, బాధితులకు న్యాయం అందే వరకు, ప్రపంచంలోని ప్రతి బాలుడికి భద్రమైన భవిష్యత్తు లభించే వరకు– మానవత్వం కోసం గొంతెత్తే స్వరాలు ఆగకూడదు.

గాజా బాలల విషాదాన్ని అంతర్జాతీయ వేదికపై సాక్ష్యాలు, దర్యాప్తు, న్యాయపరమైన పరిశీలనలతో ముందుకు తెచ్చిన కమిషన్‌కు, దానికి అధ్యక్షత వహిస్తున్న భారతీయ న్యాయవేత్త జస్టిస్ ఎస్. మురళీధర్‌కు– లాఖోన్ సలాం!

ఉమర్ ఫారూఖ్ ఖాన్
కవి రచయిత సామాజిక సేవకుడు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ షహీద్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు

## జిల్లా జైలులో ఘనంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం

- గాంధీ చిత్రపటానికి నివాళులు




**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 02 (జనం సాక్షి) :** గాంధీ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్, డిస్ట్రిక్ట్ జడ్జి ప్రేమలత ముఖ్యఅతిథిగా, జిల్లా ఎస్పీ డి. జానకి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఖైదీలు మార్పు తెచ్చుకోవాలి

జిల్లా జడ్జి ప్రేమలత మాట్లాడుతూ ఖైదీలు చేసిన తప్పులను పునరావృతం చేయకుండా జైలు జీవితాన్ని మార్పు కోసం అవకాశంగా భావించాలని సూచించారు. క్రమశిక్షణతో జీవిస్తూ బయటకు వెళ్లిన తర్వాత గౌరవప్రదమైన జీవితం కొనసాగించేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలని, అవసరమైన న్యాయ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

### జైలు శిక్ష జీవితానికి ముగింపు కాదు

ఎస్పీ జానకి మాట్లాడుతూ గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జైలు శిక్ష జీవితానికి ముగింపు కాదని, తమలో మార్పు తెచ్చుకుని భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దుకోవాలని ఖైదీలకు సూచించారు. జైలు సిబ్బంది ఖైదీల మానసిక, సామాజిక పునరావాసానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కాళిదాస్, డిల్సా చైర్‌పర్సన్ ఇందిరా, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప సమస్యల పరిష్కారానికి ఎంపీకి వినతిపత్రం



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గశీ రాజీవ్ గృహకల్ప ప్రజల 17 లక్షల పెండింగ్ విద్యుత్ బిల్లు, అలాగే న నీటి సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప అసోసియేషన్ సభ్యులు కలిసి మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను కలసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ త్వరలోనే రాజీవ్ గృహకల్ప సముదాయంలో పర్యటించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి రాజీవ్ గృహకల్ప అసోసియేషన్ అధ్యక్షులు అంజయ్య ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, ఉపాధ్యక్షులు వైకుంఠం ఏడుకొండలు రాజు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- 16వ రోజుకు చేరిన అల్వాల్ జేఏసీ రిలే నిరాహార దీక్షలు




**అల్వాల్, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అల్వాల్ జేఏసీ డిమాండ్ చేసింది. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 16వ రోజుకు చేరాయి. మాజీ కార్పొరేటర్ సబితా కిషోర్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనిల్ కిషోర్‌గౌడ్, మెదక్ జిల్లా జేఏసీ చైర్మన్ యాదగిరి దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలను ప్రారంభించారు. కేకే కమిటీ సిఫార్సులను, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాలయాపన లేకుండా అమలు చేయాలని నాయకులు కోరారు. సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పటోళ్ల సురేందర్‌రెడ్డి, భాస్కర్, మల్లేష్, సంగమేశ్వర్, నగేష్, దేవయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మురళి ప్రకాష్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా మహిళల నిరసన



**అల్వాల్, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** మచ్చబొల్లారం శ్మశానవాటికను చెత్త డంప్‌యార్డ్‌గా మార్చొద్దని డిమాండ్ చేస్తూ స్థానిక మహిళలు శుక్రవారం నిరసన చేపట్టారు. గాంధీ జయంతి సందర్భంగా శ్మశానవాటికలో చెత్తాచెదారం పేరుకుపోవడాన్ని నిరసిస్తూ చెత్త తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు డంప్‌యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులను అక్కడి నుంచి పంపించారు. శ్మశానవాటిక పరిసరాల పరిశుభ్రతకు అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యం

- ఎంపీ డీకే అరుణ, జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న ఆశా వర్క ర్లు, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ ఆయాలు, ఆర్‌పీలు, మహిళా సంఘా ల ప్రతినిధుల సేవలు అభి నందనీయమని పాలమూ రు పార్లమెంట్ సభ్యురాలు,తమిళ నాడు రాష్ట్ర బీజేపీ సహ ఇంచార్జి డీ కే అరుణ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్స రాల ప్రజా సేవా –ప్రజల సేవ ద్వారా దేశ సేవా సేవా సంకల్ప అభియాన్ కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ గార్డెన్స్ లో అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, ఆర్పిల కు సన్మాన కార్యక్ర మం ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యం, పోషకాహారం, టీకాలు, పారిశుధ్యంపై అవగాహన కల్పించడంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషి స్తున్నారని తెలిపారు. గర్భిణి ఆరోగ్యంగా ఉంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం గా ఉంటుందని, చిన్నారు లకు బాల్య దశ నుంచే పోషకాహారం, ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించ డంతో పాటు ప్రాథమిక విద్య, ఆటల ద్వారా అభ్యసనకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తున్న సిబ్బంది సేవలను అభినం దించారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను పాఠశాల లకు పంపించి నాణ్యమైన విద్య అందించేలా తల్లిదం డ్రుల్లో అవగాహన పెరగడం సమాజంలో వచ్చిన సాను కూల మార్పుకు నిదర్శనమ న్నారు. మహాత్మాగాంధీ కల లుగన్న గ్రామ స్వరాజ్య సాధనలో పారిశుధ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రజలు, అధికారు లు, ప్రజాప్రతినిధులు సమ న్వయంతో పనిచేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపా రు. మహిళా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక అవగాహన కల్పిస్తూ, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ఆర్‌పీలు, సంబంధిత సిబ్బంది చేస్తు న్న కృషిని అభినందించా రు. ప్రతి మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధించి, ఆత్మవిశ్వాసంతో కుటుంబా న్ని ఉన్నత స్థితికి తీసుకె ళ్లేలాప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజ నాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థా యిలో అవగాహన కల్పిం చాలని సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తమ వేతనాలు, ఇతర సమస్యలను కార్య క్రమంలో ప్రస్తావించగా, వారి సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి రోజున అంగన్ వాడీ టీచర్లు, ఆశా కార్య కర్తలు, ఆర్పిలను సన్మా నించడం జరుగుతుందని ఆమె తెలిపారు. గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ అరుణ పేర్కొన్నారు. 'వికసిత్ భారత్––2047' లక్ష్య సాధనలో ప్రతి ఒక్క రూ భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల సంక్షే మం, పట్టణాభివృద్ధి తది తర రంగాల్లో సమష్టిగా కృషి చేయాలని ఎంపీ కోరారు.

### గ్రామీణాభివృద్ధిలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తల పాత్ర కీలకం

గాంధీ జయంతి సందర్భం గా అంగన్‌వాడీ కార్యక ర్తలు, ఆశా కార్యకర్తలు తదితర మహిళా క్షేత్ర స్థాయి సిబ్బందిని సన్మాన కార్యక్రమానికి హాజరైన ఎంపీ డీకే అరుణ మున్సిపల్ చైర్ పర్సన్



కొండా శ్వేతా సత్య యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్త లకు ముందుగా కలెక్టర్ ప్రియాంక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకా రం కావాలంటే గ్రామాల అభివృద్ధి అత్యంత కీలకమని అన్నారు. అనంతరం ప్రజలకు నిరంతరం సేవలం దిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆర్‌పీలు, మహిళా సంఘాల ప్రతి నిధులను జిల్లా కలెక్టర్ ప్రియాంక తో కలిసి ఎంపీ డీకేఅరుణ ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్,జిల్లా మాజీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు,జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్,డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, డిప్యూటీ డీ ఎం అండ్ హెచ్ ఓ సిద్ధప్ప, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు విమల, బీజేపీ ఓ బీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘు రామయ్య గౌడ్, బిజెపి పట్టణ అద్యక్షుడు పోషల వినోద్ ,మండల అధ్యక్షులు జ్యోతి,కౌన్సిలర్ లు, బీజేపీ రాష్ట్ర, జిల్లా పార్టీల ముఖ్య బాధ్యులు,నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల రక్షణకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి




**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ పిలుపునిచ్చారు. ఐజేయూ పిలుపు మేరకు మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై శుక్రవారం వనపర్తి గాంధీచౌక్‌లో జిల్లా అధ్యక్షుడు డి. మాధవరావు ఆధ్వర్యంలో, జిల్లా కార్యదర్శి బి. రాజు అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో సమగ్ర అధికారాలతో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం నుంచి రాత్రి వరకు జర్నలిస్టులు పనిచేస్తున్నారని, విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

### జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాలి

జిల్లా అధ్యక్షుడు డి. మాధవరావు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని, జర్నలిస్టులు ఎలాంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని ప్రభుత్వాలు కల్పించాలని కోరారు.

### జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కార్యదర్శి బి. రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక జాతీయ భద్రతా చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి, వనపర్తి ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆంజనేయులు సాగర్, కార్యదర్శి నరసింహ రాజు, జిల్లా యూనియన్ నాయకులు బాలస్వామి, రాములు, మన్యం, నాకొండ యాదవ్, విజయ్, పికిలి రాము, రవికాంత్, కమల్ రెహ్మాన్, నసిరుద్దీన్, వహీద్, పరశురాముడు, బాలరాజు, ధనుష్, పట్టణ అధ్యక్షుడు తైలం అరుణ్ రాజ్, కార్యదర్శి అంజి, వివిధ మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలవర్ధన్, కృష్ణయ్య, బాలరాజు, శివప్రసాద్, హరీష్, ఖాజా మైనుద్దీన్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన సుమారు 200 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు నగదు రహిత ఆరోగ్యకార్డుల కోసం ఆందోళన



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం వర్తింపజేస్తున్న హెల్త్ కార్డుల తరహాలో జర్నలిస్టులందరికి హెల్త్ కార్డులను మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్నాని మారుతీ సాగర్‌లు తెలిపారు. వారు ఇచ్చిన నిరసన పిలుపులో భాగంగా శుక్రవారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్ నగర్ గాంధీ విగ్రహం వద్ద పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని మేడ్చల్ జిల్లా కమిటీ లాంఛనగా ప్రారంభించింది. ఈ పోస్ట్ కార్డుల ఉద్యమం 8 తేదీ వరకు వారం రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నాయకులు షాపూర్ నగర్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి, వినతి పత్రం అందజేశారు. ఆ తర్వాత స్థానిక ప్రధాన పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వద్ద పోస్ట్ కార్డుల ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు సభ్యులు రంగు వెంకటేష్ గౌడ్, టీ యూ డబ్ల్యు జే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ హెల్త్ కార్డును వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శివాజీ, జిల్లా నాయకుడు రవి కిరణ్, కుత్బుల్లాపూర్ టియుడబ్ల్యుజే హెచ్–143 అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, కోశాధికారి ఎర్రోళ్ల బాబు, (టెంజు) అధ్యక్షుడు ఎర్రోళ్ల కృష్ణ, కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షులు బాన్సువాడ వెంకటేష్, జుట్టు సాయిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్‌తో కరెంట్ బిల్లుల భారం దూరం

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.
- నియోజకవర్గంలో 42 కోట్లతో విద్యుత్ పనులు




**మల్కాజిగిరి, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సైనిక్‌పురి డివిజన్ పరిధిలోని మౌలాలి విద్యుత్ సబ్‌స్టేషన్ 'సేవాసేతు అభియాన్ – ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'పై వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నెలకు గరిష్ఠంగా 360 యూనిట్ల వరకు లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు. 3 కిలోవాట్ల వరకు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఎలాంటి షూరిటీ లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నారని, అర్హులైన వినియోగదారులు జాతీయ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి 42 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా 72 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, 150 విద్యుత్ స్తంభాలు, మూడు కొత్త ఉపకేంద్రాలు, బంచ్ కేబుల్స్ ఏర్పాటుతో పాటు 23 కిలోమీటర్ల మేర సింగిల్ ఫేజ్‌ను త్రీఫేజ్‌గా మార్చే పనులు వేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకన్న, డీఈ అన్వర్ పాషా, టెక్నికల్ డీఈ శ్రీనివాస్, ఏడీఈలు రాజశేఖర్, బాబయ్య, ఏఈలు వెంకట్‌రెడ్డి, లక్ష్మి, బాలరాజు, విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకన్న, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, స్థానిక నాయకులు జేపీసీ వెంకన్న, అమీనుద్దీన్, ప్రభాకర్ గౌడ్, చిన్న యాదవ్, సంతోష్ గుప్తా, వివిధ సోలార్ సంస్థల ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# 'మీటికెట్' మొబైల్ యాప్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రజా రవాణాను ఆధునికీకరించే దిశగా ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్, 'మీటికెట్' మొబైల్ యాప్,డిజిటల్ వీక్లీ బస్ పాస్‌లను ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ప్రజాభవ న్‌లో శుక్రవారం ప్రారంభించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. కామన్ పాస్‌తో ఓఆర్ఆర్ పరిధిలోని టీజీఎస్ ఆర్టీసీ సిటీ బస్సులు పుష్పక్ మినహా, మెట్రోలో ప్రయాణించవచ్చు. రోజువారీ పాస్ ధర రూ.400, మెట్రో రూ.300, ఆర్టీసీ రూ.100, నెల వారీ పాస్ రూ.8,500, మెట్రో రూ.7,000, ఆర్టీసీ రూ.1,500 గా నిర్ణయించారు. కార్డు డిపాజిట్ రూ. 100. 'మీటికెట్' ద్వారా బస్ టికెట్లు, రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌లను డిజిటల్‌గా పొందవ చ్చు. వీక్లీ బస్ పాస్ ధర రూ.600గా నిర్ణయించా రు. కామన్ పాస్‌ను ప్రజలకు చేరువ చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రుల కోసం వన్‌డే పాస్‌లు కొనుగోలు చేశారు. శనివారం ఉద యం 10 గంటలకు బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి మెట్రోలో, అనంతరం ఆర్టీసీ బస్సులో మంత్రులతో కలిసి ప్రయాణించనున్నారు. 12 ఏళ్ల తర్వాత ఆటో చార్జీల సవరణ 2014లో అమల్లోకి వచ్చిన చార్జీలను ప్రభుత్వం సవరించింది. తొలి 1.6 కిలో మీటర్లకు రూ.30, ఆపై ప్రతి కిలోమీటర్‌కు రూ.14, నిరీక్షణకు నిమిషానికి 75 పైసలు, అర్హత కలిగిన సామానుకు రూ.0.50 చార్జీగా నిర్ణయించారు. 100 కిలోల వరకు సామాను అనుమతించారు. రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు సాధా రణ చార్జీకి 1.5 రెట్లు వసూలు చేయనున్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీకి ప్రస్తుతం నెలకు రూ.300 కోట్లు ఇస్తున్నామని, మరో రూ.50 కోట్లు కలిపి రూ.350 కోట్లు విడుదల చేసి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎంను కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకాన్ని ప్రస్తావిస్తూ ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. హైదరాబాద్ అభివృద్ధికి రూ.52 వేల కోట్ల పనులు కొనసాగుతున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. హెచ్ఎండిఎ పరిధిలో రూ.35 వేల కోట్ల పనులు చేపట్టామని, మెట్రో ఫేజ్–2లో భాగంగా 122 కి.మీ. విస్తరణకు సుమారు రూ.38 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఓల్డ్ సిటీ, ఎయిర్‌పోర్టు, పటాన్‌చెరు, హయత్‌నగర్‌కు మెట్రో కనెక్టివిటీ కల్పించనున్నారు. 362 కి.మీ. ట్రిపుల్‌ఆర్ తో ఓఆర్ఆర్ ను అనుసంధానించేం దుకు 21 రేడియల్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, 10 రోడ్లకు అలైన్‌మెంట్ అనుమతులు ఇచ్చి, రెండింటి పనులు ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన, కాలుష్య నియం త్రణకు చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే 550 ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు



అందుబాటులోకి వచ్చాయని, మరో 2,200 బస్సులు తీసుకురాను న్నట్లు చెప్పారు. డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు రెట్రోఫిట్టింగ్‌కు రూ.200 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు.

# డిపిఆర్ఓ తీరు మార్చుకోకపోతే ఉద్యమం ఉధృతం

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో పౌర సంబంధాల శాఖ అధికారి (డిపిఆర్ఓ) వ్యవహరిస్తున్న తీరుపై టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసే విషయంలో అనవసర కొర్రీలు పెడుతూ అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు. నిబంధనల ప్రకారం అర్హతలు కలిగిన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పి. విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన అధికారులు వాటికి విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు.



### మారుమూల జర్నలిస్టులకు అన్యాయం చేయొద్దు

జిల్లాలోని మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా, న్యాయబద్ధంగా అక్రిడిటేషన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హతలను పరిశీలించే ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అధికారులు వ్యక్తిగత నిర్ణయాలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని సూచించారు. జర్నలిస్టుల విషయంలో అనవసర జాప్యం, కొర్రీలు, వివక్షకు తావివ్వకుండా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### జర్నలిస్టుల హక్కులను కాలరాయొద్దు

ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల స్వేచ్ఛ, హక్కులను కాలరాసే అధికారం ఏ ఒక్క అధికారికి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ తాలూకా అధ్యక్షులు సందు యాదగిరి, టౌన్ అధ్యక్షులు బొడ్డుపల్లి మల్లేష్, కొల్లాపూర్ తాలూకా అధ్యక్షులు రాజుగౌడ్, కల్వకుర్తి అధ్యక్షులు కాస్తూరి శ్రీనివాసులు, అచ్చంపేట అధ్యక్షులు సాయిబాబాతో పాటు అన్ని నియోజకవర్గాల, జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదవాలి

### ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**ధరూర్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ధరూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గద్వాల ప్రాంతంలో డిగ్రీ, పీజీ, మెడికల్, నర్సింగ్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో కె.టి.దొడ్డి మండలంలో యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభం కానుందని వెల్లడించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, కళాశాలకు, గద్వాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ డి.ఆర్. విజయ్, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ హుసేనప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి

**నారాయణపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా డిమాండ్ చేశారు. శుక్రవారం బిజ్వార్, పులిమామిడి, ఎర్గట్‌పల్లి మూడు పొలిమెర్ల పంట పొలాలు కలిసే ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన విజ్ఞప్తి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్.నర్సింహా మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. ఎకరాకు రూ. 25,000 నష్టపరిహారం అందజేయాలని, పత్తి క్వింటాలుకు రూ. 10,000 ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక కరువు ప్యాకేజీని ప్రకటించి ఆపదలో ఉన్న రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేయాలని కోరారు. ఈ నిరసన దీక్షా కార్యక్రమంలో రైతులు తాయప్ప, రమేష్, సప్పటి చిన్న నర్సింహా, విద్యావంతులు దోరోళ్ళ కృష్ణయ్య, వి. శివకుమార్ తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

# మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

**నారాయణఖేడ్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు తెలంగాణ తొలి అమరవీరుడు, కురుమ ముద్దుబిడ్డ దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని నారాయణఖేడ్ కురుమ సంఘం డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌పై శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఆక్సిజన్ పార్కులో కురుమ విద్యావంతుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కురుమ సంఘం నాయకులు, విద్యావంతులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కురుమ సంఘం అధ్యక్షుడు లొండే నర్సింలు మాట్లాడుతూ.. 1946లో నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జనగామ జిల్లా కడివెండి గడ్డపై తుపాకీ తూటాలకు ఎదురొడ్డి దొడ్డి కొమురయ్య అమరుడయ్యారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన తొలి అమరవీరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ దొడ్డి కొమురయ్యకు తగిన స్థాయిలో గౌరవం దక్కలేదని అన్నారు. ప్రస్తుతం మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ జరుగుతున్న నేపథ్యంలో దానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టడం ద్వారా ఆయన త్యాగాన్ని ప్రపంచానికి చాటే అవకాశం ఉందన్నారు. ఈ డిమాండ్ ఏ ఒక్క కులానికి సంబంధించినది కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని నర్సింలు పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అన్ని పార్టీల నాయకులను కలిసి మద్దతు కూడగడతామని తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింలు, డాక్టర్ ఓం ప్రకాష్ మల్గొండ, సర్పంచులు సుభాష్ చంద్రబోస్, నగేష్, మండలాల అధ్యక్షులు నావనాథ్, కాసినాథ్, మల్లేష్, జైపాల్, శ్రవణ్, భీమన్న, ఉపసర్పంచ్ నర్సింలుతో పాటు కురుమ సంఘం నాయకులు, విద్యావంతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పాత్రికేయుల డిమాండ్ల పరిష్కరించాలి



**మెదక్ టౌన్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** పాత్రికేయుల సమస్యలను పరిష్కరించి, వారి హక్కులు, భద్రతకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐజేయూ పిలుపు మేరకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో 'డిమాండ్స్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓ యూనుస్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎ. శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని 'పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం'గా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల మేరకు ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించి, క్యాష్‌లెస్ వైద్య చికిత్స సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీ.జి. శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు శ్రీనివాస్ మిన్పూర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బొందుగుల నాగరాజు, ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, గౌరవ అధ్యక్షుడు ఫారూక్ హుస్సేన్, శ్రీధర్, హరినాథ్, కామాటి కృష్ణతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై దృష్టి సారించండి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** కంది మండలంలోని గ్రామాలలో పారిశుధ్యం పై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 2027--28 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, పర్యావరణ పరిరక్షణ, జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. గ్రామంలో మురుగునీరు రోడ్లు, కాలువల్లోకి చేరకుండా ప్రతి ఇంటికీ వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించాలని గ్రామసభలో తీర్మానించారు. అలాగే ఇంటింటి నుంచి సేకరించే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి అందించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. ఘన, ద్రవ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీ–జీ రామ్ జీ పథకం కింద గ్రామానికి అవసరమైన 33 అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేశారు. పథకం నిబంధనలు, అర్హత, సాంకేతిక సాధ్యత ఆధారంగా పనులు చేపట్టేందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం పంచాయతీ అధికారి మల్లారెడ్డి మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం కీలకమన్నారు. గ్రామ పారిశుధ్యం, చెత్త విభజన, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ రేఖ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో పి. శ్రీనివాస్, ఎస్సై విజయ్ కుమార్, ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏపీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శి సుధీర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమం కోసం సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమం కోసం సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు, దాడులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి. డిమాండ్ చేశారు.

గాంధీ జయంతి, జాతీయ జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 60 మంది జర్నలిస్టులు హాజరైనారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి మాట్లాడుతూ.... ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు, దాడులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జోగిపేట యాదగిరి, వెంకటరెడ్డి, జిల్లా కోశాధికారి అన్వర్, ఉపాధ్యక్షులు ఆడెం మల్లేశం, శ్రీనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు విల్సన్, ఉలవల రాజు, అంజయ్య, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, సుమన్, నీలి శ్రీకాంత్ , చిన్న, మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్ తదితరులు పాల్గొన్నారు.




## ఎల్‌నీనోను ఎదుర్కొనేలా ఉపాధి పనులు ఉండాలి

**శివ్వంపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ఎల్‌నీనో ప్రభావంతో ప్రస్తుతం వాతావరణం లో నెలకొన్న కరువును సమర్థవంతంగా ఎదుర్కోనే విధంగా వీబీజీ రాంజీ ఉపాధి పనులు చేపట్టాలని సర్పంచ్ అయ్యగారి యాదగిరి పేర్కొన్నారు. శివంపేట మండలం శభాష్ పల్లి గ్రామంలో సర్పంచ్ అయ్యగారి యాదగిరి అధ్యక్షతన శుక్రవారం వీ బీ జీ రాంజీ ఉపాధి పనులపై శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల సరైన పంటలు, ప్రజలకు ఉపాధి అవకాశాలు లేక గ్రామాలలో కరువు చాయలు నెలకొన్నాయని, ఎల్ నీ నో ప్రభావం నుంచి తప్పించుకోవడానికి వీబీజీ రాంజీ పనులను ప్రజలందరికీ ఉపయోగపడేలా నిర్వహించాలని గ్రామసభలో తీర్మానించారు. ఇందులో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 125 రోజుల పని దినాలు కల్పించాలని, అదే మాదిరిగా భూగర్భ జలాల పెంపుకు బోర్ వెల్స్ రీఛార్జ్ చేయడం, ముందుకు వచ్చే రైతుల పొలాలలో పాంపొండ్ల నిర్మాణం, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మాణం, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని గ్రామ సభలో సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత ఉప సర్పంచ్ అయ్యగారి ప్రశాంత్ వి బి జి రాంజీ టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 2 (జనం సాక్షి) :** పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం అన్నారు. పథకం ప్రచారానికై సేవా సేతు అభియాన్ పేరుతో గద్వాల విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వద్ద మూడు రోజులపాటు నిర్వహించు శిబిరాన్ని శుక్రవారం రెడ్కో, విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీకి సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది అన్నారు. వినియోగదారులు తమ ఇంటి పైకప్పులపైనే ఈ ఫలకాలను ఏర్పాటు చేసుకొని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చన్నారు. ఆసక్తి గలవారు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని, హెల్ప్ డెస్క్ 040 48526869 నెంబర్ లోను మాట్లాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ రవిప్రసాద్, ఏడిఈ రమేష్ బాబు, అకౌంట్స్ అధికారులు రాజు, మదన్, తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం సమరశంఖం

- సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా జర్నలిస్టుల విజ్ఞప్తి

**మెదక్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలని, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టియూడబ్ల్యూజే–హెచ్143) ఆధ్వర్యంలో మెదక్‌లో పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభమైంది. జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, గతంలో అమలైన జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని పునరుద్ధరించి, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంఘం జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి, మెదక్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి సంగమేశ్వర్‌లు డిమాండ్ చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తమ ప్రధాన డిమాండ్లను పోస్ట్‌కార్డులపై రాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యతగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కోరారు. టియూడబ్ల్యూజే (హెచ్143) మెదక్ జిల్లా కన్వీనర్ పబ్బతి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో జర్నలిస్టుల కోసం ఈజేహెచ్ఎస్ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో మెదక్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు బీవీకే రాజు, శ్రీనివాస్, గిరి, యాదగిరి, రాఘవులు, ఆంజనేయులు, కార్తీక్, వంశీ, ఉషయ్య, రాద్వ లక్ష్మణ్, శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# లేండిగూడ ఘాట్ రోడ్డు.. ఇది రోడ్డు కాదు.. నరకానికి దారి!

- మంజూరై ఆరు నెలలు గడిచినా పట్టించుకోని అధికారులు
- సరిహద్దు గ్రామాలకు శాపంగా మారిన అద్వాన రహదారి

**కెరమెరి, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ఫోటో చూడండి... ఇది రోడ్డా? క్వారీ గుట్టా? అర్థం కావట్లేదు కదా. ఇదే కెరమెరి మండలంలోని కెలికే నుంచి లేండిగూడ వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి. తారు పొర పూర్తిగా కరిగిపోయి కంకర, బండరాళ్లు బయటకు వచ్చి వికృతంగా తయారైంది. ఈ రోడ్డుపై ఒక ఆటో నెమ్మదిగా వెళుతున్న దృశ్యం ఇక్కడి ప్రజలు ప్రతిరోజూ ఎంత నరకయాతన అనుభవిస్తున్నారో కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇది ఏదో ఓ మారుమూల గ్రామానికి వెళ్లే రోడ్డు కాదు. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు కలిపే అత్యంత కీలకమైన రహదారి. కెరమెరి మీదుగా మహారాష్ట్రలోని రాజురా, చంద్రపూర్, జీవీతీ ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ దారే సులువైన మార్గం. అంతేకాదు, రెండు రాష్ట్రాల మధ్య వివాదంలో ఉన్న లేండిగూడ, భోళాపటార్, గౌరీ, నారాయణగూడ, ఎస్సాపూర్, పద్మావతి, అంతాపూర్, ఇంద్రానగర్ వంటి 10కి పైగా గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. వేలాది మంది గిరిజనులు, గిరిజనేతరులు, రైతులు, విద్యార్థులు నిత్యం ఈ రోడ్డు మీదనే ప్రయాణం చేయాలి.



### వర్షం వస్తే గ్రామాలకు రాకపోకలకు అడ్డంకి

అసలు సమస్య ఘాట్ ప్రారంభంలోనే ఉంది. అక్కడ ఉన్న కల్వర్టు వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయి ధ్వంసమైంది. పెద్ద పెద్ద బండరాళ్లు రోడ్డు మధ్యలోనే ఉండిపోయాయి. వర్షం వస్తే చాలు... వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలకు అడ్డంకిగా మారుతోంది. "ఎవరికైనా జ్వరం వచ్చినా, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా నాలుగు కిలోమీటర్లు నరకయాతన అనుభవించాల్సిందే. ఆటోలు, అంబులెన్సులు రావడానికి కూడా భయపడుతున్నాయి" అని సరిహద్దు గ్రామాల ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. పిల్లలు బడికి వెళ్లాలన్నా, రైతులు పంటను మార్కెట్ కు తీసుకెళ్లాలన్నా ఇదే దుర్భర పరిస్థితి. ఈ రోడ్డు దుస్థితిపై గ్రామస్తులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారుల్లో చలనం లేదు. కెలికే నుంచి ఎస్సాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఏకంగా ఆరు నెలలు గడుస్తోంది. టెండర్లు పూర్తి కాకపోవడంతో ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డు రోజురోజుకు మరింత కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెండు వాహనాలు ఎదురెదురు వస్తే పక్కకు తప్పుకోవడానికి కూడా స్థలం లేని పరిస్థితి. వెంటనే ఘాట్ వద్ద ధ్వంసమైన కల్వర్టు స్థానంలో కొత్త హై లెవెల్ కల్వర్టును నిర్మించాలి. ఆరు నెలల క్రితం మంజూరైన కెలికే – ఎస్సాపూర్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. సరిహద్దు గ్రామాల ప్రజల బాధలు చూసైనా జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

### నరకంగా ప్రయాణం : ఉత్తం, గౌరీ గ్రామస్తుడు



గౌరీ నుంచి నిత్యం కెరమెరి మండలానికి పనుల నిమిత్తం వెళ్తూ ఉంటాం. కెలికే నుంచి లేండిగూడ ఘాట్ ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తుంది. వాహనం అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. రహదారిపై ప్రయాణించడం అంటే నరకంగా ఉంది. అధికారులు స్పందించి మంజూరైన రహదారి పనులు మొదలుపెట్టాలి.

## వృద్ధురాలు భూమిని ఆక్రమించిన కాంగ్రెస్ లీడర్

- తమని చంపుతానని బెదిరిస్తున్న పోలేపల్లి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



**శాయంపేట, అక్టోబర్ 2( జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కర్రు లక్ష్మి మా భూమిని పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి అను వ్యక్తి కబ్జా చేశాడని, తమని చంపుతానని బెదిరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. శాయంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్రు లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం మేము 40 సంవత్సరాల క్రితం సర్వేనెంబర్ 111,112, 113లో ఉన్న భూమిని కొనుగోలు చేశాము. మూడు సర్వే నెంబర్లలో కలిపి 8 ఎకరాల 17 గుంటల భూమి ఉంటుందని తెలిపారు. 2007లో నా భర్త మరణానంతరం నా కుమారుని పేరుపై మేము కొన్న భూమి ,మా సొంత భూమిని కలిపి 11 ఎకరాల 20 గుంటల భూమిని పట్టా చేయించాం అనితెలిపారు. 2009 సంవత్సరంలో నా కుమారుడు తన అక్క అయిన పిన్నింటి కవితకు 111 సర్వే నెంబర్లలో మూడెకరాల 24 గంటల భూమిని112 సర్వే నెంబర్లలో ఒక ఎకరం 16 గుంటల భూమిని పట్టా చేసినాడు. పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి అను వ్యక్తి 2007 సంవత్సరంలో మాభూమి సర్వే నెంబర్ 113 లోని మూడెకరాల 17 గుంటల భూమిని దొంగతనంగా పట్టా చేసుకున్నాడు. ఈ విషయం మాకు తెలిసి వెంటనే అధికారుల దగ్గరికి వెళ్లి, లాయర్ ద్వారా కోర్టుకు వెళ్లి పట్ట భూమిని రద్దు చేయించినాము మా భూమిని తిరిగి పొందాము. మా భూమి కింద సర్వే నెంబర్ 110 లో ఊర చెరువు శికం కలదు ఇట్టి భూమిని సాగు చేసుకుంటూ దాంట్లో కోళ్ల ఫారం, బర్రెల ఫారం అక్రమంగా నిర్మించుకున్నాడు. అదేవిధంగా సర్వేనెంబర్ 111లో తన ఆక్రమించిన భూమిని దొంగతనంగా పట్టా చేయాలని ఆర్డీవో ఎమ్మార్వో కి వాట్సప్ వీడియో ద్వారా బెదిరింపు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తు న్నారు. ఎమ్మెల్యే నాకు చాలా దగ్గర అని బెదిరింపులు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. సర్వేనెంబర్ 111లో ఉన్న భూమి సివిల్ కోర్టు విచారణలో ఉంది కానీ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి అక్రమంగా మా భూమిలో రోడ్డు వేసినాడు అని బాధితుల ఆరోపిస్తున్నారు. అడగడానికి వెళ్లిన తన అల్లుడు పిన్నింటి కిషన్ రెడ్డి పై భౌతికంగా దాడికి ప్రయత్నించారని వెంటనే 112 నెంబర్ కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడం అయిందని తెలిపారు. పోలేపల్లి వల్ల మాకు ప్రాణ హాని ఉందని నాకు, నా బిడ్డకు, నా అల్లునికి ఏమి జరిగిన గాని పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి దే పూర్తి బాధ్యత అని అన్నారు. అక్రమ నిర్మాణాన్ని రోడ్డును వెంటనే తొలగించి అతనిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయడం అయిందని విలేకరుల సమావేశంలో తెలిపారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవానికి కల్యాణలక్ష్మి కొండంత భరోసా..

- తెలంగాణలో కేసీఆర్ కళ్యాణ లక్ష్మి ప్రారంభించి నేటికీ 12 ఏళ్లు
- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాజీ చీఫ్ విప్ దాస్యం



**హనుమకొండ, ప్రతినిధి అక్టోబర్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి తల్లిదండ్రుల కష్టాలను తీర్చేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రభుత్వం 2014 అక్టోబర్ 2న ప్రారంభించిన కల్యాణలక్ష్మి పథకం అమల్లోకి వచ్చి నేటికి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హనుమకొండలోని వడ్డేపల్లి జంక్షన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన చారిత్రాత్మక పథకాల్లో కల్యాణలక్ష్మి ఒకటని అన్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఆర్థికంగా పెద్ద సవాలుగా ఉండే పరిస్థితుల్లో, ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలనే ఆలోచనతో కల్యాణలక్ష్మి పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి ,మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దసరా నాటికి అమ్మవారి రథం ప్రారంభం

- తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు..
- మాడవీధుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే...



**హనుమకొండ ప్రతినిధి(జనంసాక్షి) :** దసరా పర్వదినం నాటికి భద్రకాళి అమ్మవారి రథాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులను వేగవంతం చేయాలని.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న మాడవీధుల నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో శుక్రవారం పర్యటించి పరిశీలించారు. తొలుత భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న మాడవీధులు, అమ్మవారి రథం పనులను పరిశీలించారు. దసరా ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అమ్మవారి రథానికి సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయని, కళాకారులు రథానికి తుదిమెరుగులు దిద్దుతున్నారని తెలిపారు. దసరా నాటికి రథాన్ని సిద్ధం చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.భక్తుల సౌకర్యం, ఆలయ ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్,ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కూడా అధికారులు అజిత్ రెడ్డి,భీమ్ రావు,ఆలయ ఈఓ సునీత తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు పారదర్శకత అవసరం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఓటు హక్కు పరిరక్షణకు పారదర్శకత అవసరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఓటర్ జాబితా సవరణలు, ఫామ్-6 మార్పులపై పూర్తి పారదర్శకత పాటించాలని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అఖిలపక్ష ప్రెస్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా ఎన్నికల వ్యవస్థ పనిచేయాలన్నారు. ఫామ్-6 మార్పులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఎన్నికల కమిషన్ లో ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్ ప్రెస్ పేర్కొందని, దానిపై కమిషన్ స్పష్టత ఇవ్వాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగకుండా చూడాలని, ఫామ్-6, 7, 8 ద్వారా జరిగే చేర్పులు, తొలగింపులు, సవరణల సమాచారాన్ని రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల అర్హులై జాబితాలో చోటు కోల్పోయిన వారిని తిరిగి చేర్చేందుకు కమిషన్ చేపట్టిన చర్యలను వారు ప్రస్తావించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, టీజేఎస్ నాయకులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుంకుమేశ్వర ఆలయ అభివృద్ధికి మరింత కృషి

- చైర్మన్‌గా రాజేశ్వరరావు ప్రమాణ స్వీకారం
- ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు



**పరకాల, అక్టోబర్ 2(జనంసాక్షి):** పరకాల పట్టణంలోని కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా కొలుగూరి రాజేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆశీస్సులతో గతంలో చైర్మన్‌గా పనిచేసిన సమయంలో దేవస్థానానికి 4.11 ఎకరాల భూమి సాధించడంతో పాటు హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహా రుద్రయాగం, హిందూ సమ్మేళనం, కార్తీక మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆలయ ఆదాయ వనరులను పెంచేందుకు పెట్రోల్ బంక్, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు దిశగా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆశీస్సులు, కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

### సేవా దృక్పథంతో పనిచేయాలి : ఎమ్మెల్యే రేవూరి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావుతో పాటు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ చైర్మన్ పదవిని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో నిర్వహించాలని సూచించారు. దేవుడి సేవ చేయగలరనే నమ్మకంతోనే కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. రాజేశ్వరరావుకు గతంలో చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, పార్టీలకు అతీతంగా ఆయనను మరోసారి చైర్మన్‌గా కొనసాగించాలని తాను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొలుగూరి భిక్షపతి సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచే ఆలయ భూమి కోసం ప్రయత్నించారని, తన హయాంలో భూమి సమకూరడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

### రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

కుంకుమేశ్వర ఆలయ అభివృద్ధికి రూ. 5 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు రేవూరి తెలిపారు. కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని కలిసి ఆలయ కుంభాభిషేకం నిర్వహించే అంశంపై చర్చించినట్లు చెప్పారు. కుంకుమేశ్వర స్వామి ఆశీస్సులతో పరకాల పట్టణ అభివృద్ధికి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు, ఆలయ వంశాను గత ఆచార్యులు కోమాళ్ళపల్లి నాగభూషణ శర్మ, ధర్మకర్త మండలి సభ్యులు రంగు సరోజన,తోట రవి,గోవింద సత్యనారాయణ,గంగిశెట్టి నవీన్, ప్రజాపత్ సవాల్ రామ్, శ్రీధర్, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



## రామప్పను సందర్శించిన అమెరికా దేశస్తురాలు

**వెంకటాపూర్(రామప్ప )అక్టోబర్ 02 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం లో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం అమెరికా దేశానికి చెందిన స్వెత్లానా అనికీవా సందర్శించారు.ఈ ఆమె రామలింగేశ్వర స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆలయ అర్చకులు హరీష్ శర్మ,ఉమాశంకర్ ఆమెకి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ఆలయ చరిత్ర, శిల్పకళా విశిష్టత, కాకతీయుల నిర్మాణ నైపుణ్యం గురించి టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలోని ప్రతి శిల్పం వెనుక ఉన్న చరిత్రను ఆమె ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట రాష్ట్ర పర్యాటక మార్గదర్శి శశి, పర్యాటక పోలీసులు భద్రు, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్ ఉన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెలరోజులు



**సారంగాపూర్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** సారంగాపూర్ మండలం ఆలూరు సబ్‌స్టేషన్ యక్కర్పల్లి శివార్లో గల చౌరస్తా వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ కాలిపోయి రెండు నెలలు అయినప్పటికీ ఇప్పటివరకు ఎన్నోసార్లు సమాచారం అందజేసిన గ్రామస్తులు అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు మద్దతు తెలుపవలసిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎవరికీ చెప్పుకోవాలని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్ఫార్మ్ మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలని వేడుకున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి అర్హుడినీ ఓటరుగా నమోదు చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై భూపాలపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి తూట్పల్లి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని, ప్రతి మండలంలో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. పట్టభద్రులను నేరుగా కలిసి ఎమ్మెల్సీ ఓటు ప్రాధాన్యతను వివరించాలని,



క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం చురుగ్గా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాద్ రావు, జన్నే మొగిలి, ఎరకల గణపతి, రాష్ట్ర నాయకులు రాయరాకుల మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, తాటికొండ రవికిరణ్, పెండ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి తూట్పల్లి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస, సత్యాగ్రహ మార్గాలతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించారని, ఆయన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబర జీవితం, నిజాయితీ, దేశభక్తికి ప్రతీక అని, వారి ఆశయాలను నేటి తరం ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు గోలేటి విద్యార్థులు

**రెబ్బెన,అక్టోబర్02(జనం సాక్షి):** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భిలాయిలో సెప్టెంబరు 3 నుంచి 7 వరకు నిర్వహించనున్న 45వ సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టులో గోలేటి సింగరేణి పాఠశాల విద్యార్థులు పుదరి సిరి, ఎం. కృష్ణలోకనందు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కార్యదర్శి ఎస్. తిరుపతి, జిల్లా ఒలింపిక్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. నారాయణరెడ్డి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, సింగరేణి పాఠశాల





ప్రధానోపాధ్యాయుడు ఎం. రవితేజ, పీఈటీ కె. భాస్కర్, వి. మహేందర్, ఆర్.వి. రామకృష్ణరెడ్డి, ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, కుమ్మరి మల్లేశ్, కె. నరేష్, జి. శ్రీధర్, వి. సతీష్ తదితరులు విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## విజ్ఞానంతో పాటు జీవితానికి సరైన దిశ

- డాక్టర్ దాశ్యం సేనాధిపతి



**లక్షెట్టిపేట అక్టోబర్ 2 (జనంసాక్షి) :** పుస్తక పఠనం మనిషి ఆలోచనా విధానాన్ని మార్చడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించి, జీవితాన్ని సరైన దిశలో నడిపిస్తుందని ప్రముఖ వైద్యుడు, రచయిత డాక్టర్ దాశ్యం సేనాధిపతి అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లేదల్ల రాజేశ్వర్‌రావు రచించిన 'ఓ ఏకాంత తపస్సు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సేనాధిపతి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్, సోషల్ మీడియా ప్రభావంతో యువత, విద్యార్థులు పుస్తక పఠనానికి దూరమవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తకాలు చదవడానికి కేటాయించాలని సూచించారు. అనంతరం పుస్తక రచయిత లేదల్ల రాజేశ్వర్‌రావును, కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా నూటెంకి రవీందర్, విశిష్ట అతిథులుగా తుమ్మల దేవరావు, వామన్‌రావు, సమన్వయకర్త సూర్యప్రకాశ్, సుమంత్, కందుల తిరుపతి, రాచకొండ శ్రీనివాస్, చక్రవర్తి, రవీందర్, నాగవరపు ముత్యం, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
03 అక్టోబర్ 2026

# కోయ భాష, సంస్కృతికి ప్రాచుర్యం కల్పించాలి

- ప్రాచీన గోండి - కోయ భాషా పదాల మూలాలను గుర్తించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, అక్టోబరు 2 (జనంసాక్షి) :** కోయ భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి వాటికి మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ప్రాచీన గోండి - కోయ భాషా పదాలు, అక్షరాలు, వాటి మూలాలను గుర్తించి భాషను ప్రామాణికీకరించేందుకు ఆదివాసీ ప్రతినిధులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలం గిరిజన భవన్‌లో శుక్రవారం నిర్వహించిన గోండి--కోయ నిఘంటువు వర్క్‌షాప్‌లో ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోండి--కోయ గోత్రాల జెండాను ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. ఆదివాసీ మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించడంతో పాటు గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంతాలు వేరైనా




ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, భాషలో అనేక సారూప్యతలు ఉన్నాయన్నారు. ఉచ్చారణలో తేడాలు ఉన్నప్పటికీ పదాల అర్థాల్లో సామీప్యత ఉంటుందని తెలిపారు. గోండి--కోయ భాషా ప్రామాణికీకరణ కోసం గతంలో హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించి కేంద్రానికి నివేదిక సమర్పించినట్లు వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లోని గోండి-కోయ తెగల భాషా మూలాలను గుర్తించి ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ ఆదివాసీ భాష, సంస్కృతులకు తగిన గుర్తింపు, గౌరవం లభించకపోవడంతో అవి అంతరించే ప్రమాదం ఉందన్నారు. కోయ భాషను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మాతృభాషలో మాట్లాడటంతో పాటు పిల్లలకు కోయ భాషను నేర్పించాలని సూచించారు. భాష, సంస్కృతి పరిరక్షణకు భద్రాచలం ఐటీడీఏ సంపూర్ణ మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు. కోయ భాషలో ప్రాథమిక విద్యకు కోయ భారతి, కోయ వాచకాల వినియోగం, గిరిజన మ్యూజియం పునరుద్ధరణ, కోయ భాషా దినోత్సవం నిర్వహణ, కోయ రేల పాటల ఆల్బమ్ రూపకల్పన వంటి కార్యక్రమాలను పీవో వివరించారు. అనంతరం ఆదివాసీ చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, సర్పంచ్ పూనెం కృష్ణదొర, ఏటీడీవో రాధమ్మ, రిటైర్డ్ ఏసీఎంవో రమణయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ నెహ్రూ, తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి 11 నెలల చిన్నారి మృతి



**గుర్రంపోడు, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి 11 నెలల చిన్నారి మృతి చెందిన విషాద ఘటన కొనాయిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓర్సు శ్రీను, మమత దంపతుల కుమారుడు ఓర్సు స్టాలిన్ (11 నెలలు) ఈరోజు ఉదయం తల్లితో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. చిన్నారి నిద్రలేచి పాకుతూ ఇంటి ముందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న నీటి సంపులో పడిపోయాడు. చిన్నారి నీటిలో పడిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి ఓర్సు మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీకి సిద్ధం

- పట్టభద్రుల ఆశీస్సులతో ముందుకు సాగుతాను
- ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు
- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**సూర్యాపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన పేరును పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించిందని, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ, కాంగ్రెస్ అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.తన అభ్యర్థిత్వంపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.టికెట్ అడగలేదని, ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి సిద్ధంగా లేనని,యూ టర్న్ తీసుకున్నారంటూ ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. తాను ఎప్పుడూ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి తప్పుకుంటానని చెప్పలేదన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగాఎన్నికల్లో పోటీ చేయడం తన స్పష్టమైన నిర్ణయమని తెలిపారు.పార్టీ అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ, ప్రభుత్వం, సంబంధిత వేదికల దృష్టికి తీసుకెళ్లడం నా ప్రధాన లక్ష్యమని అన్నారు.తన దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాల గురించి గతంలో చెప్పిన విషయాలను ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలతో ముడిపెట్టి వక్రీకరించడం సరికాదన్నారు.

## జర్నలిస్టుల భద్రతకు జాతీయ చట్టం తీసుకురావాలి




**భద్రాచలం, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** జర్నలిస్టులపై దాడులను అరికట్టి, వారి భద్రతకు పటిష్టమైన చట్టం తీసుకురావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) భద్రాచలం డివిజన్, పట్టణ కమిటీలు డిమాండ్ చేశాయి. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా శుక్రవారం భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి.వి. రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సోముల గిరిప్రసాద్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి పాత మార్కెట్ వరకు ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.వి. రమణారెడ్డి, భద్రాచలం పట్టణ అధ్యక్షుడు విజ్జిగిరి రాజా కిరణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణ కోసం జాతీయ చట్టం తీసుకురావడంతో పాటు నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కమిటీ సభ్యుడు బి.వి. రమణారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోముల గిరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు రాజా కిరణ్, కోశాధికారి నాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, ఎం.డి. మదర్, నియోజకవర్గ కమిటీ కోశాధికారి రాము, ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ కార్యదర్శి జయరాం, కోశాధికారి బి. బాలకిరణ్, యూనియన్ సీనియర్నాబీవీయకులు జ్ఞానేందర్, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌కుమార్, దిలీప్‌కుమార్, బాబునాయుడు తదితరులతో పాటు దుమ్ముగూడెం, చర్ల ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నామమాత్రంగా భద్రాచలం గ్రామసభ నిర్వహణ

**భద్రాచలం, అక్టోబరు 2 (జనంసాక్షి) :** భద్రాచలం మేజరు గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ గ్రామ పంచాయతీ ప్రత్యేక గ్రామసభ వెలవెలబోయింది. గ్రామసభకు సంబంధించి పట్టణంలో అధికారులు సరైన ప్రచారం నిర్వహించకపోవడంతో గ్రామస్తులెవరు సరిగా హాజరు కాలేదు. కేవలం గ్రామ పంచాయతీకి చెందిన సిబ్బందే కుర్చీల్లో కూర్చొని ఉన్నారు. దీనిని చూసిన వార్డు సభ్యులు ఇదేం గ్రామ సభ నిర్వహణ అంటూ గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను నిలదీశారు. స్వయంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వచ్చినప్పటికీ కొన్ని శాఖల అధికారులు హాజరుకాలేదు. అలాగే గ్రామసభ కోసం వేసిన కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. అలాగే గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు సైతం గ్రామ ప్రజలకు సరైన సమాచారం లేకుండా గ్రామసభ ఎలా నిర్వహిస్తారంటూ నిలదీశారు. ఈ విధంగా గ్రామసభలో హాజరైన వారు వివిధ సమస్యలపై ఎమ్మెల్యే, అధికారులను నిలదీశారు. వారు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మహాత్మాగాంధీ మార్గంలో బుల్లెట్ ట్రైన్ సాధించి తీరుతాం

- మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మౌన దీక్ష

**సూర్యాపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ సాధన కొరకు చేస్తున్న పోరాటంలో భాగంగా 50వ రోజు రిలే నిరాహార దీక్షను శుక్రవారం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్షగా నిర్వహించారు.బుల్లెట్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షకు పట్టణంలోని పలు సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట మీదుగా కొనసాగించాలంటూ బుల్లెట్ ట్రైన్ సాధన కొరకు జరుగుతున్న ఉద్యమం 50 రోజులు పూర్తి చేసుకున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సరికాదన్నారు.ప్రజా ఆకాంక్షలకు ఉద్యమాలకు పుట్టినిల్లు లాంటి సూర్యాపేటకు అన్యాయం చేయవద్దని అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు,పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు ఈ మౌన దీక్షకు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, టీజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, కొల్లు



మధుసూదన్ రావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మంచాల రంగయ్య, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, రమణాచారి,చల్లమళ్ళ నర్సింహా,నెమ్మది వెంకటేశ్వర్లు,బూర వెంకటేశ్వర్లు, మండాది డేవిడ్ కుమార్,కొత్తపల్లి శివకుమార్, వెలుగు వనిత, అనంతుల మధు, భూపతి రాములు, కందుకూరు యాదగిరి, అంగిరేకుల నాగార్జున, బండారు రాజా,తూడి నర్సింహా రావు, పగడాల ఉపేందర్ రెడ్డి,బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్ నేరెళ్ల మధు, సకినాల కృష్ణ,సలికంటి వీరేందర్,సిలివెరి శభారి నాథ్, కిరణ్,సట్టు నాగయ్య,తోట శ్యామ్ కుమార్, కర్ణాటక కిషన్, బెలిదే వెంకటేశ్వర్లు, శ్రీకాకుళం రాము, వినయ్,రాందేని ఆదినారాయణ, బొమ్మిడి లక్ష్మి నారాయణ, వేల్పుల వెంకన్న, బాలస్వామి, యర్కచర్ల శోభారాణి, సునీల్,అమరవాది శ్రవణ్,కటకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

- నిబంధనలు ఉల్లంఘించి ఖనిజాలు కొనుగోలు చేస్తే లైసెన్సుల రద్దు
- అక్రమ మైనింగ్ పై తనిఖీలకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** అక్రమ మైనింగ్ ను సహించేది లేదని, ఉక్కుపాదం మోపి, కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఖమ్మం సమీపంలోని వెలుగుమట్ల ప్రాంతంలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం, రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యుల ఆదేశానుసారం రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులచే ఉమ్మడిగా తనిఖీలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. వెలుగుమట్ల పార్కు సమీపంలోని ప్రైవేట్ వెంచర్ పట్టా భూముల్లో స్థానికంగా కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా బరైటీస్ ఖనిజాన్ని తవ్వుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. చిన్న చిన్న గుంతలు తీసి, లభించిన బోల్డర్లను పగలగొట్టి (చిప్పింగ్ చేసి) ట్రాక్టర్ల ద్వారా పక్కనే ఉన్న మినరల్ డీలర్లకు అమ్ముతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని కలెక్టర్ అన్నారు.మైనింగ్ అధికారులు, ఖమ్మం అర్బన్ మండల తహశీల్దార్ తో కలసి అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, తవ్వకాల కొలతలను నమోదు చేసుకున్నారని, ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న పట్టాదారులను, బాధ్యులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై నోటీసులు జారీ చేసి, భారీగా పెనాల్టీలు విధించనున్నట్లు, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఖనిజాన్ని కొనుగోలు చేసే మినరల్ డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## గురువులే భావితరాలకు దిక్సూచి




**భువనగిరి, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమన్నారు. బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బి-స్మార్ట్) ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడాల జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరిలోని వివేరా హోటల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొండూరి మల్లేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని 97 ప్రైవేట్ పాఠశాలల్లో సేవలందిస్తున్న పలువురు ఉపాధ్యాయులకు 2026-27 సంవత్సరానికి సంబంధించిన 'బెస్ట్ టీచర్ అవార్డులు' అందజేశారు. కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి శాసనసభ్యుడు కుంభ అనిల్‌కుమార్‌రెడ్డి, బి-స్మార్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞానం, విలువలు, క్రమశిక్షణను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. తరగతి గదిలో బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీమతి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ చైర్మన్ అవేస్, పీఏసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, బి-స్మార్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, జీనియస్ స్కూల్ కరస్పాండెంట్, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సూర్యనారాయణరెడ్డి, తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సింగనబోయిన మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, మహిళా ప్రధాన కార్యదర్శి కీర్తి, కోశాధికారి ప్యారీ బేగం, వివిధ మండలాల అధ్యక్షులు, పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య సముదాయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం



**వలిగొండ, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** వలిగొండ వ్యవసాయ మార్కెట్‌లో 40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని వాణిజ్య సముదాయాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్లలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. నూతన వాణిజ్య సముదాయాల ద్వారా వ్యాపారులకు మరింత సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వలిగొండ వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ భూక్యా భీమా నాయక్, సహకార సంఘం చైర్మన్ గరిసే రవి, స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు, ,డైరెక్టర్లు, వలిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్,ఉప సర్పంచ్ మలుగ మాధవి,మార్కెట్ కమిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**అమీన్పూర్, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటన అమీన్పూర్ పోలీస్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం... అమీన్పూర్ పెద్ద చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి చూడగా 25 నుంచి 40 సంవత్సరాల వయసు గల మగ వ్యక్తి మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి మించిన వారు ఎవరైనా ఉంటే అమీన్పూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## మహనీయుల బాటలో పయనిద్దాం




**సూర్యాపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** భారతదేశ సార్వభౌమాధికారానికి, సాంస్కృతిక వైభవానికి మూలస్తంభాలుగా నిలిచిన మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల ఆదర్శాలు ఎప్పటికీ ఆచరణీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాల ద్వారా గాంధీజీ ప్రపంచానికి చాటిచెప్పారని గుర్తు చేశారు.ఉప్పు సత్యాగ్రహం వంటి చిన్న పిలుపుతో దేశ ప్రజలందరినీ ఏకం చేసిన మహాత్ముని మార్గదర్శకత్వం ఎనలేనిదని కొనియాడారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ధైర్యంతో దేశాన్ని నడిపించిన ఆయన జీవితం నవతరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ మహానాయకుల ఆదర్శాలను భావితరాలకు అందిస్తూ, వారు చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ రాగి ఉపేందర్ రావు, ఆడిటర్ ఆఫీసర్ శ్యామ్ సుందర్ ప్రసాద్, డిసిఓ శ్రీరామ్, డిఎం సివిల్ సప్లైస్ శ్రీధర్ రెడ్డి, డిబిసిడిఓ విశాల్, ఏడి ఫిషరీస్ ఆంజనేయ శర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ప్లాన్‌తోనే భర్త హత్య..?

- కారంచల్లి.. సిమెంట్ ఇటుకలతో దాడి
- నలుగురు అదుపులో..?

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 2 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన హత్య ఘటన కలకలం రేపింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిని అతడి భార్య కుటుంబీకులు పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు ప్రత్యక్షసాక్షుల ద్వారా తెలుస్తోంది. మృతుడి కళ్లలో కారం చల్లి కిందపడేసి, సిమెంట్ ఇటుకలతో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మృతుడిని నల్లగొండకు చెందిన బంటు వెంకటేశ్వర్లు (36)గా పోలీసులు గుర్తించారు. గతంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు కొంతకాలంగా సస్పెన్షన్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

### 12 ఏళ్ల క్రితం వివాహం

సుమారు 12 ఏళ్ల క్రితం మాన్యం చెల్కకు చెందిన రేష్మకు అప్పటికే వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, రేష్మ మధ్య పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసినట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం ఆమె భర్తకు తెలియడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి విడాకులు తీసుకున్న అనంతరం వెంకటేశ్వర్లు, రేష్మ వివాహం చేసుకుని నల్లగొండలో కాపురం పెట్టినట్లు తెలుస్తోంది.కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు సమాచారం. వారం రోజుల క్రితం రేష్మ చైతన్యనగర్‌లోని తన తల్లిగారింటికి వెళ్లినట్లు తెలుస్తోంది.



### భార్యను తీసుకెళ్లేందుకు వెళ్లగా..:

గురువారం రాత్రి వెంకటేశ్వర్లు అత్తగారింటికి వెళ్లి భార్యను తిరిగి ఇంటికి రావాలని కోరినట్లు సమాచారం. ఈ సమయంలో అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు అతడిపై దాడి చేసినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ముందుగా కళ్లలో కారం చల్లి కిందపడేసి, అనంతరం సిమెంట్ ఇటుకలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి 12 ఏళ్ల కుమారుడు ఉన్నట్లు సమాచారం.

### నలుగురు అదుపులో..?

హత్య సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ కె. శివరామరెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి క్లూస్ టీంతో కలిసి ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనలో మృతుడి భార్యతో పాటు ఆమె సోదరి, మరో ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం.ఇప్పటికే నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుండగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

### అసలు కారణంపై పోలీసుల దర్యాప్తు

హత్యకు కుటుంబ కలహాలే కారణమా? ఆర్థిక వ్యవహారాలేమైనా ఉన్నాయా? లేక గతంలో ఉన్న వివాహేతర సంబంధం కారణంగానే వివాదం తలెత్తిందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.




# స్టాక్ మార్కెట్‌తో 'బాండ్' బ్యాటింగ్..!

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. క్రూడాయిల్ ధరలు.. గత కొంతకాలంగా దేశీయ స్టాక్ మార్కెట్‌లను కుదిపేస్తున్న అంశాలు. ఈ జాబితాలోకి కొత్తగా మరో అంశం చేరింది. అదే బాండ్ ఈల్డ్స్ అమెరికాలో బాండ్లపై పెరిగిన ప్రతిఫలాలు మన మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇంతకీ అమెరికాలో బాండ్ రాబడులు ఎందుకు పెరుగుతున్నాయ్? మనపై ప్రభావం ఎందుకు పడుతోంది? ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరల రూపంలో మన స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.**




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇటీవల కాలంలో మాత్రం అమెరికాలో బాండ్లపై ప్రతిఫలాలు మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ ప్రభావంతో గడిచిన ఎనిమిది వారాల్లో సెన్సెక్స్ 6,590 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 2,149 పాయింట్లు క్షీణించింది. దాదాపు రూ.26 లక్షల కోట్ల మదుపర్ల సంపద (బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్) ఆవిరైంది. అమెరికాలో 10 ఏళ్ల ట్రెజరీ బాండ్లపై రాబడులు 2007 తర్వాత తొలిసారి 5.31 శాతానికి చేరడం, 30 ఏళ్ల బాండ్లపై రాబడులు 5.65 శాతా నికి పెరగడం ఇందుకు నేపథ్యం.

**ఎందుకు పెరుగుతున్నాయి?**

ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో నిధులను సేకరించడానికి బాండ్లను జారీ చేస్తాయి. సులభంగా చెప్పాలంటే, బాండ్ అనేది ఒక హామీ పత్రం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోకుండా, నేరుగా ప్రజల నుంచి, పెట్టుబడిదారుల నుంచి అప్పు తీసుకోవడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. అమెరికా ప్రభుత్వం కూడా వివిధ కాల వ్యవధులతో బాండ్లను జారీ చేస్తుంటుంది. వీటిని యూఎస్ ట్రెజరీ బాండ్లు అంటారు. వీటిపై వచ్చే రాబడులను ఈల్డ్స్‌గా వ్యవహరిస్తారు. అయితే, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలు ఉన్నాయి. పెరుగుతోన్న చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా.. దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగించొచ్చన్న అంచనాలు బలంగా ఉండటంతో బాండ్ ఈల్డ్స్ పెరుగుతున్నాయి. దీనికితోడు అమెరికా ప్రభుత్వం భారీగా రుణాలు తీసుకుంటుండడం, టెక్ కంపెనీలు సైతం ఏఐపై పెట్టుబడుల కోసం మూలధనం సమీకరణ కోసం పోటీ పడుతుండడం వల్ల కూడా బాండ్లపై రాబడులు పెరుగుతున్నాయి.

**మనపై ప్రభావం ఎందుకు?**

బాండ్లపై రాబడులు పెరిగితే ఈక్విటీ మార్కెట్‌లు సాధారణంగా ఒత్తిడిని ఎదుర్కొంటాయి. బాండ్లపై రాబడులు తగ్గినప్పుడు నిధులు ఈక్విటీ మార్కెట్లలోకి వస్తాయి. ప్రస్తుతం మన మార్కెట్ల విషయంలో జరుగుతున్నది ఇదే. అమెరికా ప్రభుత్వ బాండ్లలో రాబడి ఆకర్షణీయంగా మారినప్పుడు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రిస్క్ ఎక్కువగా ఉండే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకుంటారు. వాటిని అమెరికాలో ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ వైపు మళ్లించే అవకాశం ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మెరుగైన రాబడులు వచ్చినప్పుడు ఎలాగైతే మనం రిస్కు కలిగిన పెట్టుబడి సాధానాల జోలికి పోమో.. అదే తరహాలో అన్నమాట. పైగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తుండడంతో విదేశీ ఇన్వెస్టర్ల రాబడులు తగ్గుతాయి కాబట్టి వారు మార్కెట్లో అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే దేశీయంగా గత కొన్ని రోజులుగా ఎఫ్ఐఐలు పెద్దమొత్తంలో విక్రయాలకు దిగుతున్నారు. ఈ వారంలోనే రూ.34వేల కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు.

## పాతికేళ్లలో నిఫ్టీని ఇలా చూడలే

8 వారాలుగా నష్టాల పరంపర 2000 పాయింట్లు హాంఫట్
ఈ ఏడాదిలోనూ ఇప్పటికే 15% నష్టం
2011 తర్వాత సూచీకి ఇదే అత్యధిక క్షీణత

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ నిఫ్టీ 50 వరసగా ఎనిమిదో వారమూ నష్టాల్లో ముగిసింది. ఈ స్థాయిలో సూచీకి నష్టాలపరంపర కొనసాగడం గత పాతికేళ్లలోనే ఇదే మొదటిసారి. 2001లో నిఫ్టీ వరుసగా తొమ్మిది వారాలను నష్టాల్లో ముగించింది. అంతకుముందు 1993లో వరుసగా పదివారాల పాటు నష్టపోయింది. ఇటీవలి కొన్ని సంవత్సరాలలో, ప్రతి ఏడాదిని లాభాలతో ముగించిన ఎన్ఎస్ఈ నిఫ్టీ సూచీ.. ఈ ఏడాది మదుపర్లకు నష్టాల ఘాటు చూపించేందుకు సిద్ధమవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఈ సూచీ 15% నష్టపోయింది. ఒకవేళ ఈ ధోరణే కొనసాగితే.. 2011 తర్వాత అంటే గత 15 ఏళ్లలోనే నిఫ్టీకి అత్యధిక క్షీణత ఇదే అవుతుంది. 2011లో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) భారత మార్కెట్ నుంచి రూ.2,500 కోట్లు ఉపసంహరించుకోవడంతో ఆ ఏడాది నిఫ్టీ 25% పతనమైంది. అధిక ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు పెరగడం, రూపాయి విలువ క్షీణత, ఐరోపా పరిణామాలు కూడా ఆ సమయంలో సూచీ నష్టాలకు కారణమయ్యాయి. 2011 నుంచి చూస్తే 2015లో మాత్రమే నిఫ్టీ నష్టాల్లో (4%) ముగిసింది. మిగతా సంవత్సరాలన్నింటిలో లాభాలనే పంచింది.

**స్వల్పకాలంలో ప్రతికూలమే..**

కొవిడ్-19 పరిణామాల తర్వాత, మన స్టాక్ మార్కెట్‌కు ఇదే అధ్వాన ప్రదర్శన కానుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సంవత్సరాంతానికి మార్కెట్ స్థిరపడి 23,000- 24,000 పాయింట్ల వద్ద ముగిసే అవకాశం ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్, హెడ్ ఆఫ్ రీసెర్చ్ (రిటెయిల్) సిద్ధార్ధ ఖేమ్కా అంచనా వేస్తున్నారు. 2027 ఆర్థిక సంవత్సరం చివరికి నిఫ్టీ 25,000- 26,000 స్థాయికి కోలుకోవచ్చనీ తెలిపారు. 'పెరుగుతున్న వాల్యూమ్‌తో నిఫ్టీ 23,000 స్థాయి కంటే దిగువకు పడిపోయి లోయర్-హై నెక్ లైన్ దిగువన ముగియడంతో, సాంకేతికంగా స్వల్పకాలానికి ప్రతికూలంగా మారింది. ఇది చార్ట్‌లో ఒక పెద్ద పతనాన్ని సూచిస్తోంది. ప్రస్తుత టెక్నికల్ సెటప్ ఆధారంగా రాబోయే సెషన్లలో ఈ సూచీ మరింత అమ్మకాల ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంద'ని ఛాయిస్ బ్రోకింగ్‌లో టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ హితేశ్ టైలర్ చెబుతున్నారు. అమెరికా బాండ్ల ప్రతిఫలాలు, ముడి చమురు ధరలు పెరగడం లాంటివి సూచీ ప్రతికూల ధోరణికి తోడుకావడంతో, సెంటిమెంట్ అత్యంత బలహీనంగా మారిందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ దే విశ్లేషిస్తున్నారు. నిఫ్టీ 22,400 స్థాయిని నిలబెట్టుకోకపోతే.. 22,200- 22,000కు పడిపోవచ్చని హెచ్‌ఎస్‌టీ వెల్త్ సీఈఓ హరిసెల్వన్ రాధాకృష్ణన్ చెబుతున్నారు. ప్రస్తుతం 22,600-22,800 సూచీకి తక్షణ నిరోధ స్థాయిగా మారిందని అంటున్నారు. బ్యాంక్ నిఫ్టీకి 54,000ను తక్షణ మద్దతు స్థాయిగా అంచనా వేస్తున్నారు.

## ఇంధన విక్రయాలపై పరిమితులు వద్దు

**ప్రైవేటు రిటెయిలర్లకు సూచించనున్న కేంద్రం**



**దిల్లీ:** పెట్రోలు లేదా డీజిల్ విక్రయాలపై పరిమితులు పెట్టరాదని ప్రైవేటు ఇంధన రిటెయిల్ సంస్థలకు ప్రభుత్వం సూచించనున్నట్లు చమురు కార్యదర్శి నీరజ్ మిత్తల్ పేర్కొన్నారు. జియో-బీపీ, నయారా ఎనర్జీ తమకు చెందిన కొన్ని అవుట్‌లెట్లలో ఇంధన కొనుగోళ్లపై పరిమితులు విధించడం ఇందుకు నేపథ్యం. బల్క్-రిటెయిల్ ధరల మధ్య అంతరం కారణంగా, తక్కువ ధరకు డీజిల్‌ను నిల్వ చేసుకోవడానికి పారిశ్రామిక వినియోగదార్లు పెట్రోలు బంకులకు చేరుకోవడంతో ఆయా సంస్థలు ఈ ఆంక్షలు విధించాయి. ఇంధన విక్రయాలపై పరిమితికి ఎవరినీ అనుమతించమని, అది ఆమోదయోగ్యం కాదని నీరజ్ తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిలో మార్పులేదన్నారు. రిటెయిల్ డీజిల్ - బల్క్ వినియోగదార్లకు విక్రయించే డీజిల్ ధర మధ్య అంతరం లీటరుకు రూ.50 వరకు ఉండడంతో పారిశ్రామిక వినియోగదార్లు పెట్రోల్ బంకుల్లో భారీ ఎత్తున కొనుగోళ్లు చేపట్టారు. దీంతో జియో-బీపీ రోజుకు ఒక వినియోగదారుకు 50 లీటర్లు పరిమితి పెట్టింది. నయారా తన బంకుల్లో 70-200 లీటర్ల పరిమితి విధించింది.

## స్వదేశీ 'గ్యాన్' సెమీకండక్టర్ల తయారీ



**హైదరాబాద్(జనంసాక్షి):** గాలియం నైట్రైడ్ (గ్యాన్) సెమీ కండక్టర్ సాంకేతికత అభివృద్ధి కోసం ప్రభుత్వ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్-సీఈ ఈఆర్ ఐతో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్పింట్రానిక్స్ ఏఐ వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. స్వదేశీ గ్యాన్ సాంకేతికతను అభివృద్ధి చేయడంతో పాటు, ఫ్యాబ్రికేషన్ ప్లాంటు ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను ఈ భాగస్వామ్యం ద్వారా అంచనా వేస్తారు. రక్షణ, రోదసి, టెలికాం, ఈవీ రంగాల్లో గ్యాన్ చిప్‌లు అవసరం. దేశీయ గ్యాన్ మార్కెట్ ప్రస్తుతం రూ.2154 కోట్లుగా ఉండగా, 2033 నాటికి రూ.18,000 కోట్లకు చేరుకుంటుందని స్పింట్రానిక్స్ ఏఐ సీఈఓ రఘు వర్మ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకూ ఎగుమతి చేసే అవకాశాలూ లభిస్తాయని వివరించారు. రెండు దశాబ్దాల సీఈఈఆర్ఐ పరిశోధనా అనుభవం, స్పింట్రానిక్స్ ఏఐ పారిశ్రామిక నైపుణ్యం వల్ల స్వదేశీ సెమీకండక్టర్ ఉత్పత్తుల తయారీ వేగవంతం అవుతుందని సీఎస్ఐఆర్-సీఈఈఆర్ఐ డైమండ్ రీసెర్చ్ గ్రూప్ హెడ్ మనీష్ మాథుర్ తెలిపారు.

## సింగిల్ వేరియంట్‌లో శాంసంగ్ ఏ08..

**ధర, ఫీచర్లు ఇవే!**

**దిల్లీ:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ శాంసంగ్ దేశీయంగా గెలాక్సీ ఏ08 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఎంట్రీలెవల్ స్మార్ట్‌ఫోన్ కోరుకునే వారి కోసం ఏ సిరీస్‌లో ఏటా కొత్త ఫోన్లను లాంచ్ చేస్తున్న శాంసంగ్.. ఏ07కు కొనసాగింపుగా దీన్ని తీసుకొచ్చింది. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ప్రధాన కెమెరా వంటి ఫీచర్లతో తీసుకొచ్చారు. ఇది కేవలం 4జీకి మాత్రమే సపోర్ట్ చేస్తుంది. పైగా కేవలం 4జీబీ+ 64జీబీ వేరియంట్‌లోనే లభ్యమవుతుంది. దీని ధరను రూ.18,499గా నిర్ణయించింది. డార్క్‌బ్లూ, గ్రీన్, సిల్వర్ రంగుల్లో లభిస్తుంది. శాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ రిటెయిల్ స్టోర్లతో పాటు, శాంసంగ్.కామ్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో కొనుగోలు చేయొచ్చు. ఆరేళ్లపాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది.







# సుద్దవాగు వంతెనకు మోక్షమెప్పుడో..?

**నిధులు వచ్చేదెప్పుడో.. నిర్మించే దెన్నడో..**



**నిర్మల్ బ్యూరో, లోకేశ్వరం (జనంసాక్షి)** మండల ప్రజలు జిల్లా కేంద్రం నిర్మల్‌కు వెళ్లాలంటే అర్లి మార్గమే ప్రధాన ఆధారం.ఈ మార్గంలోని సుద్దవాగుపై 1980లో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో పలుమార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.ప్రస్తుతం వంతెనపై భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు.గత పదేళ్లుగా కొత్త వంతెన నిర్మాణానికి అడుగులు పడకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే గత ఆరు నెలలుగా మండలానికి వచ్చిన ప్రతిసారి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్.. అర్లి నుంచి లోకేశ్వరం వరకు రహదారి నిర్మాణంతో పాటు సుద్దవాగుపై వంతెన నిర్మాణానికి హామ్ పద్ధతిలో రూ.84 కోట్లు మంజూరయ్యాయని పేర్కొంటూ వచ్చారు. అయితే తొలి దశలో ఆర్అండ్‌బీ పరిధిలో అర్లి నుంచి లోకేశ్వరం వరకు రహదారి నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. దీంతో సుద్దవాగుపై వంతెన నిర్మాణానికి నిధుల విషయం మరోసారి ప్రశ్నార్థకంగా మారింది.వంతెన నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు కాకపోవడంతో స్థానికుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.వెంటనే నిధులు మంజూరు చేసి,పనులు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వంతెన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఆర్అండ్‌బీ డీఈఈ తెలిపారు.

## ఆర్‌టిఐ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి(జనంసాక్షి):** సమాచార హక్కు చట్టం-2005ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించి జిల్లా స్థాయిలో సమన్వ యం, పర్యవేక్షణ, అమలు ప్రక్రియను మ రింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో ఇద్దరు ఆర్‌టిఐ కార్యకర్తలను నామినేషన్ రొటేషన్ పద్ధతిలో సభ్యులుగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఆసక్తి, అర్హత కలిగిన ఆర్‌టిఐ కార్యకర్తలు జిల్లా స్థాయి సమన్వయ కమిటీలో సభ్యులుగా సేవలందించేందుకు తమ దరఖాస్తులను ప్రజా సమాచార అధికారి / జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంచిర్యాలలో ఈ నెల 6వ తేదీ లోగా వ్యక్తిగతంగా సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ఇద్దరు ఆర్‌టిఐ కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నామినేట్ చేయడం జరుగుతుందని, జిల్లాలోని ఆర్‌టిఐ కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

## దళిత మహిళా సర్పంచ్‌పై దాడి

**ఖండించిన ఎమ్మార్పీఎస్**



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో దళిత మహిళా సర్పంచ్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, సర్పంచ్ కుటుంబ సభ్యులపై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గాదె శ్రీధర్ మాదిగ, మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ మాదిగ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని బెల్ట్‌షాపులను మూసివేయాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేసి, దాని అమలులో భాగంగా చర్యలు చేపడుతున్న సమ యంలో కొంతమంది బెల్ట్‌షాపుల నిర్వాహకులు, వారికి అండగా ఉన్న వ్యక్తులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి సిబ్బందిపై, సర్పంచ్ కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడటం, అడ్డువ చ్చిన సర్పంచ్‌పై కూడా దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. డ్రగ్స్, బెల్ట్ షాపుల వల్ల ప్రజలు, ముఖ్యంగా యువత కుటుం బాలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రజల ప్రయోజనాల కోసం గ్రామపంచాయతీ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడాని కి సర్పంచ్, సిబ్బంది ప్రయత్నిస్తుంటే వారిపై దాడులు చేయడం వెనుక ఉన్న వ్యక్తులను కూడా గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయా లని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవిందు ఇసాక్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు ఆరూరు శ్రీనివాస్ మాదిగ, నలిమే ల నాగరాజు మాదిగ, మంద శ్రీనివాస్ మాదిగ, కలకోలా రాజశేఖర్ మాదిగ, అనిల్ మాదిగ, విశ్వ నాధపురం ఉపసర్పంచ్ దాసి శ్రీకాంత్ తదితరు లు పాల్గొన్నారు.

## అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి



**బెల్లంపల్లి, అక్టోబర్ 2,(జనంసాక్షి):** అతిగా మద్యం సేవించి గుంటూరుకు చెందిన చెట్ల ఏడుకొండలు ( 55 ) మృతి చెందినట్లు బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏడుకొండలు సుమారు రెండు నెలల క్రితం బెల్లంపల్లికి కబోర్డ్ వర్క్ నిమిత్తం వచ్చి ఇక్కడే ఉంటున్నాడని, సంపాదించిన డబ్బులతో అతిగా మద్యం సేవిస్తూ, సకాలంలో భోజనం చేయక ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ పడుకునేవాడని తెలిపారు. మధ్య మధ్యలో స్వగ్రామం వెళ్లి వస్తుండేవాడని, ఈ క్రమంలో నిన్నటి నుండి అతిగా మద్యం సేవించి, ఆహారం లేకపోవడం వల్ల డీహైడ్రేషన్ కు గురై మృతి చెంది ఉండవచ్చని స్థానికులు తెలిపినట్లు వివరించారు. విషయం తెలుసుకొని మృతుని బంధువులకు సమాచారం అందించి, కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

## మహాత్మునికి అవమానం..!

- చెప్పులు వేసుకుని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసిన కార్యదర్శి
- గురజాల గ్రామంలో రైతు వేదిక వద్ద సంఘటన



**నర్సంపేట, అక్టోబర్ 02 (జనంసాక్షి):** భారతదేశ స్వాతంత్ర సముపార్జన లో అలుపెరగని కృషిచేసి స్వాతంత్ర్యం సిద్ధించేలా శాంతియుత పోరాటం చేసిన మహాత్మా గాంధీ జన్మదినం సందర్భంగా ఆయనకు అవమానం జరిగింది. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గురిజాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదిక వద్ద శుక్రవారం నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడి చిత్ర పటానికి పూలమాల వేసే కార్యక్రమం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్వేత పాదరక్షలు ధరించి పూలమాల వేయడం కనిపించింది. అంతటి మహాత్ముని జన్మదినం సందర్భంగా ఆయనకు అవమానం కలిగే విధంగా వ్యవహరించిన కార్యదర్శి శ్వేత తీరుపై స్థానికులు గ్రామస్తులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒక ప్రభుత్వ ఉద్యోగి అయ్యి ఉండి ఇలా వ్యవహరించడాని నిరసిస్తూ గ్రామంలోని మూడో వార్డు మెంబర్ సిరిపురపు మహేష్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా భవిష్యత్తులో స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకులు మరియు జాతీయ పర్వదినాలకు సంబంధించిన కార్యక్రమాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు స్పష్టమైన ప్రోటోకాల్, మార్గదర్శకాలు మరియు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## '108' అంబులెన్స్‌లో ప్రసవం

**తాండూర్, అక్టోబర్ 02(జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కత్తెర్ల గ్రామానికి చెందిన పూదరి శ్రీమతి అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఆమెను చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు కాన్పు కష్టమవుతుందని, తక్షణమే మంచిర్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు.కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో శ్రీమతికి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. పరిస్థితిని గమనించిన అంబులెన్స్ సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యుల ఫోన్ సూచనలతో అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో ఈఎంటీ సురేశ్ సమయస్ఫూర్తితో అంబులెన్స్ లోనే సురక్షితంగా ప్రసవం చేశారు.శ్రీమతి ఆరోగ్యకరమైన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం మెరుగైన వైద్యం కోసం తల్లీబిడ్డలను మంచిర్యాల ఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ పైలట్ పూర్ణచందర్ తెలిపారు. సమయానికి స్పందించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది సురేశ్, పూర్ణచందర్‌లను కత్తెర్ల గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

## హర్ ఘర్ జల్ - జల్ జీవన్ మిషన్ లక్ష్యం

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత.**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):** గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గోవింద్ పూర్ గ్రామపంచాయతీలోని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వంద శాతం మంచినీటి కనెక్షన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. హర్ ఘర్ జల్ ? జల్ జీవన్ మిషన్ లక్ష్యంలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రతి కుటుంబానికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని ఇంటి వద్దకే అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ అన్నారు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీటి సరఫరా కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోందన్నారు. గోవింద్‌పూర్ గ్రామంలో వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడం గ్రామస్థుల సహకారం, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సాధ్యమైందని అని అన్నారు ప్రతి ఇంటికి అందుబాటులోకి వచ్చిన మంచినీటి కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవడంతో పాటు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని తెలిపారు నీటి పైపులైన్లు, నల్లాలు తదితర వాటిలో చిన్నచిన్న మరమ్మతులు ఏర్పడినప్పుడు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. గ్రామంలో నీటి వనరులను సంరక్షించడంతో పాటు ప్రజా వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు.గాంధీ జయంతి సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచడం, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలపై ప్రజలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత, సామాజిక బాధ్యత విషయంలో గాంధీజీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ అన్నారు . హర్ ఘర్ జల్ ? జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్య సాధనలో గోవింద్‌పూర్ గ్రామం వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు .

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
3 అక్టోబర్ 2026

# కార్మికుల సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ లక్ష్యం

**8వ కాలనీలో సింగరేణి ఏఐటీయూసీ సమావేశం**




**యైటింక్లైన్ కాలనీ, అక్టోబర్ 2 (జనం సాక్షి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేస్తూ, వారి హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు పిలుపునిచ్చారు. 8వ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏఐటీయూసీ సెంట్రల్ ఆఫీస్ బేరర్స్, వివిధ బ్రాంచ్ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ హాజరై కార్మిక సమస్యలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణిలో కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. గతంలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న ఆరు సంవత్సరాల కాలంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆశించిన స్థాయిలో కృషి జరగలేదని సీతారామయ్య, రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీల అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై యూనియన్ తరఫున నిరంతరం ప్రశ్నిస్తామని తెలిపారు. అన్ని ఏరియాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను బ్రాంచ్ స్థాయిలో గుర్తించి, వాటిని కేంద్ర యూనియన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీలు మడ్డి ఎల్లాగౌడ్, ముష్కి సమ్మయ్య, వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శులు కందుకూరి రాజరత్నం, వీరస్వామి, వంగ వెంకట్, కవంపల్లి స్వామి, రాజగోపాల్, అక్బర్ అలీతో పాటు వివిధ ఏరియాల బ్రాంచ్ కార్యదర్శులు మోటపాలకుల రమేష్, వెంకటరమణ మూర్తి, గంధం సాంబశివరావు, ఎంఆర్‌సీ రెడ్డి, బాజీ సైదా, రంగు శ్రీనివాస్, సుధాకర్, గట్టయ్య, నజీర్, తిరుపతి, సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యూనియన్ నాయకులు అన్నారావు, రవికుమార్, కిషన్‌రావు, బుర్ర తిరుపతి, కొమురయ్య తదితరులు సమావేశంలో పాల్గొని కార్మిక సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోతున్న వారికి పునరావాసం కల్పించి,నష్టపరిహారం ఇవ్వాలి

- బాధితులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తా..
- సిపిఐ జాతీయ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**చిగురుమామిడి అక్టోబర్ 02(జనంసాక్షి):** కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా ఇండ్లు,భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి,నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. చిగురుమామిడిలో రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోతున్న బాధితులు రెండు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం చాడ వెంకటరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులు చాడ వెంకటరెడ్డితో తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నాలుగు లైన్ల రోడ్డు కు వ్యతిరేకం కాదని కానీ వెడల్పు కోసం ప్రజల నివాసాలు కూల్చి వారికి ఎలాంటి న్యాయం చేయకపోవడం,నష్టపరిహారం ఇవ్వకపోవడం దుర్మార్గమని,70ఏండ్ల నుండి ఇండ్లు ఉన్నవారు,ఇటీవల నూతనంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ఇండ్లు నిర్మించుకున్న వారు ఇండ్లను కూల్చడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని,వారి కుటుంబాలు వీధినపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్మించుకొని ఉన్న ఇంటిని కోల్పోతే వారి బాధ వర్ణాతీతమని,కంటి తుడుపు చర్యగా ఏదో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మాటల వరకు చెప్పడం వల్ల వారి నష్టాన్ని భర్తీ చేయలేమని అన్నారు.

బై పాస్ ద్వారా రోడ్డు మార్గం వేయడానికి అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు ఆలోచించడం లేదో అర్థం కావడం లేదన్నారు. సాగు నీటి ప్రాజెక్ట్ ప్రాజెక్టుల నిర్మాణంలో, కాలువల నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించినట్లుగా ఈ ఇండ్లు కోల్పోతున్న బాధితులకు కూడా నష్టపరిహారం చెల్లించాలని,గతంలో కొన్ని చోట్ల ప్రాజెక్టులలో భూములు కోల్పోతే భూములు,ఇండ్లు కోల్పోతే ఇండ్లు ఇచ్చినట్లుగా ఇక్కడ కూడా ఎంత ఇంటి జాగా పోతే అంత ఇంటి జాగా,కోల్పోయిన ఇంటి నిర్మాణ వ్యయం లెక్కేసి బాధితులకు నష్టపరిహారం అందించాలని అందు కోసం ఈ మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యేగా,సిపిఐ తరపున రాష్ట్ర ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్వయంగా కలిసి వివరిస్తామని బాధితులకు న్యాయం జరిగేవిధంగా చూస్తానని వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,జిల్లా ల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి,తేరాల సత్యనారాయణ,సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలీ బాపురెడ్డి,సిపిఐ నాయకులు కయ్యం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తులతో ప్రాణ భయం, న్యాయం చేయండి

- భయాందోళనకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- గాగిరెడ్డిపల్లెలో అధికారుల ముందు ఎరుకల కులస్తుల ఆవేదన



**చిగురుమామిడి అక్టోబర్ 02(జనంసాక్షి):** ఎరుకల కులానికి చెందిన తమను గ్రామస్తులు నానా భయభ్రాంతులకు గురిచేస్తూ,గ్రామ బహిష్కరణ చేస్తున్నారని వెంటనే తమ కుటుంబాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తూ,వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గాగిరెడ్డిపల్లె ఎరుకల కులస్తులు అధికారులను వేడుకున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బండి మైసయ్య,బండి శ్రీనివాస్,బండి గోపాలకృష్ణ, నరేష్,ఎల్లవ్వ,కొమరవ్వ,లావణ్య తమ తాతల కాలం నుండి అక్కడే నివసిస్తూ జీవిస్తున్నామని గ్రామస్తులంతా కలిసి తమను గ్రామ బహిష్కరణ చేసేందుకు పరోక్షంగా వేధిస్తున్నారని మండల స్పెషల్ ఆఫీసర్ శత్రు నాయక్,ఎంపీడీవో రామ్మోహన్ చారి,ఎస్సై జగదీశ్వర్ ల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తాము కొన్ని సంవత్సరాలుగా పెంచుకున్న చెట్లను, తమకోసం ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంకును,పశుగ్రాసాన్ని గ్రామస్తులంతా కలిసి ధ్వంసం చేశారని తెలిపారు. తమకు జరుగుతున్న అన్యాయంపై బాధితులు ఎస్సై జగదీశ్వర్, తాహాసిల్దార్ కనకయ్యకు, ఎంపీడీవో రామ్మోహన్ చారికి న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. శుక్రవారం మొక పైకి వచ్చిన అధికారులకు తమ బాధను వివరించినట్లు చెప్పారు. ఇట్టి విషయమై గ్రామస్తులను వివరణ కోరగా చెరువు శిఖం భూమిని,నక్ష తొవ్వలను అక్రమంగా ఆక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. సర్పంచ్ సన్నీళ్ల కవిత మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు అక్కడ ఉన్న చెరువు శిఖం భూమిని మహిళా సంఘాల మహిళలు చదును చేశారని,ఎవరి భూములను కబ్జా చేయలేదని,ఎవరిని ఇబ్బందులకు గురి చేయడం లేదని వివరించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ హాస్పిటల్

**మల్యాల (జనంసాక్షి) :** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బిజెపి మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం "స్వచ్ఛ హాస్పిటల్" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రపరిచి పరిశుభ్రమైన వాతావరణం ఉండటం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని,ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రాచర్ల రమేష్, నులుగొండ సురేష్ పాల్గొన్నారు.



# సీఐ బదిలీపై వెళ్లడంతో హుసేల్లిలో సంబరాలు

- సీఐపై ఇష్టారీతిగా అక్రమ దందాలకు సహకరించారంటూ ఆరోపణలు
- జిల్లా పోలీసు అధికారికి ఫిర్యాదు చేసినట్లు వెల్లడి



**న్యాల్ కల్, అక్టోబర్ 02, (జనం సాక్షి) :** తెలంగాణ – కర్ణాటక రాష్ట్ర సరిహద్దు, సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, హుసేల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ అరుదైన ఘటన చోటు చేసుకుంది. సీఐ బదిలీపై వెళ్లడంతో టపాకులు కాల్చి, మిఠాయిలను పంచి సంబురాన్ని జరుపుకున్నా రు. సాధారణంగా మండల, తాలూకా స్థాయి ఉన్నతాధికారులు బదిలీపై వెళితే.. ప్రత్యేకంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించి, సత్కరించడం చూస్తూ ఉంటాం. విధి నిర్వహణలో వారు చేసిన సేవలను గుర్తుచేస్తూ అభినందిస్తుంటారు. అయితే అందుకు పూర్తిగా భిన్నంగా.. సీఐ బదిలీ కావడంతో టపాకులు కాల్చి, మిఠాయిలను పంచుతూ సంబరాలను జరుపుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని హుసేల్లి గ్రామ సర్పంచ్ రేవంత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంబేద్కర్ ప్రధాన కూడలి వద్ద పలువురు యువకులు, స్థానికులతో కలిసి సంబురాన్ని జరుపుకున్నారు. జహీరాబాద్ రూరల్ (హద్నూర్) సీఐ జక్కుల హనుమంతు, రాజకీయ నాయకులను అడ్డుపెట్టుకొని.. పోలీస్ చట్టాన్ని ఉల్లంఘించి మండలంలో ఇష్టా రీతిగా వ్యవహరించాడని, మండలంలో పలుచోట్ల కొనసాగుతున్న మాఫియా మూకలకు పూర్తిగా సహాయ, సహకారాలు అందించి దందాను యదేచ్చగా కొనసాగించేందుకు సహకరించాడని యువ సర్పంచ్ , కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రేవంత్ తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. మండలంలో మైనింగ్ మాఫియా, ఇతరత్రా అక్రమ దందాలకు జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు ప్రత్యక్షంగా, పరోక్షంగా పూర్తిగా సహకరించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి, అక్రమార్జనకు పాల్పడ్డాడని.. ఇటీవలే జిల్లా పోలీస్ బాస్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎట్టకేలకు జిల్లా పోలీసు ఉన్నతాధికారి సిఐని బదిలీ చేయడం పట్ల సర్పంచ్, యువకులు, పలువురు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



## అక్రమ మద్యం పట్టివేత

**5 కేసులు నమోదు.. 8 లీటర్ల ఐడీ మద్యం స్వాధీనం**

**యైటింక్లైన్ కాలనీ, అక్టోబర్ 2 (జనంసాక్షి):** 8వ కాలనీలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కరీంనగర్ బృందంతో కలిసి శుక్రవారం అల్లూరు తండా, కేకే నగర్ ప్రాంతాల్లో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ మద్యం తయారీకి వినియోగిస్తున్న పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు కేసులు నమోదు చేసి, 8 లీటర్ల ఐడీ మద్యం, 10 కిలోల బెల్లం, 5 కిలోల పటిక, 150 లీటర్ల ఫెర్మెంటెడ్ వాష్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాష్‌ను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ వ్యవహారంలో ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై నిఘా కొనసాగుతుందని తెలిపారు.

# రేవంత్‌రెడ్డిది అబద్ధాల పాలన : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

- సిరిసిల్ల పర్యటనలో అరెస్టులు సరికాదు
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- నేతన్నలు, రైతులను పట్టించుకోవడం లేదు
- సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 2 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం, సభ అనంతరం సెక్షన్ 30 అమలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 35 నెలలు గడిచినా ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రైతులు సాగునీరు, యూరియా, ధాన్యం కొనుగోళ్ల సమస్యలను ఎదుర్కొంటున్నారని, రైతుబంధు, రుణమాఫీలోనూ ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు, ప్రమాద బీమా, దళితులకు రూ.12 లక్షల సాయం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పవర్‌లూమ్ రంగానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, యూనిఫాంల ఆర్డర్లు, నూలు సబ్సిడీ, నేతన్నకు చేయూత, బీమా వంటి పథకాలతో అండగా నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు, పాత బకాయిలు చెల్లించకపోవడంతో నేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సిరిసిల్ల జిల్లా ఏర్పాటు, మిడ్‌మానేరు ప్రాజెక్టు, వేములవాడ ఆలయ అభివృద్ధి వంటి పనులు బీఆర్ఎస్ హయాంలో చేపట్టామని పేర్కొన్నారు. అభివృద్ధిపై మాట్లాడకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ప్రభుత్వం పేర్కొంటున్న భూకబ్జాలు, ఆక్రమణలు, హైడ్రా చర్యలు, ప్రాజెక్టుల రీడిజైన్లపై పూర్తి వివరాలతో శ్వేతపత్రాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌ను 'వలసవాది'గా విమర్శించడం సిరిసిల్ల ప్రజల తీర్పును అవమానించడమేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 2 (జనంసాక్షి) :** గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వేములవాడలో గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు అయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా అహింస,శాంతియుత మార్గాలను అనుసరిస్తూ దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారన్నారు. ఉప్పు సత్యాగ్రహం,విదేశీ వస్త్రాల బహిష్కరణ,క్విట్ ఇండియా ఉద్యమం వంటి పోరాటాల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి నూతన ఉత్తేజాన్ని అందించారని గుర్తు చేశారు. గాంధీజీ జీవితం ఆయన అనుసరించిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి,ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహనీయులు చూపిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ పుల్కం రాజు వైస్ చైర్మన్ నరాల శేఖర్ కౌన్సిలర్లు తూము మధు, కొండ శేఖర్,తోట రాజు,వైశ్య సంఘం నాయకులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాణం పోయే వరకు వీడని బంధం..

**పంట కాపలాకు వెళ్లి విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి**



**గంభీరావుపేట, అక్టోబర్ 2, జనం సాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌కు గురై దంపతులు మృతి చెందారు. గంభీరావుపేటకు చెందిన గంట దేవయ్య (65), ఆయన భార్య గంట లక్ష్మి (58) కౌలుకు తీసుకున్న భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. పంటను అడవి జంతువుల నుంచి రక్షించేందుకు పొలం వద్ద విద్యుత్ వైరు ఏర్పాటు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అక్టోబర్ 1 సాయంత్రం పొలానికి వెళ్లిన దంపతులు అక్కడే ఉండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 2న పొలం వైపు వెళ్లిన గొల్ల నిశాంత్ ఇద్దరూ మృతి చెంది ఉండటాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుల కుమార్తె గంధపు భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు గంభీరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతోనే మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొనగా, పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సిరిసిల్ల గడ్డపై మూడు రంగుల జెండా ఎగరడం ఖాయం

- కేటీఆర్, హరీశ్‌రావు ఆస్తులపై స్పష్టత ఇవ్వాలి : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- అభివృద్ధి పనుల్లో గత ప్రభుత్వ వైఫల్యాలు
- బైపాస్, ఆలయాల అభివృద్ధికి చర్యలు




**సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 2 (జనం సాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న ర్యాలీ, బహిరంగ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నాయకులు అసహనంతో విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు లక్ష మందికిపైగా ప్రజలు హాజరయ్యారని, విజయవంతం చేసిన ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు ఆస్తుల పెరుగుదలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2009 నుంచి 2026 వరకు వారి ఆస్తుల పెరుగుదలపై తాను పేర్కొన్న గణాంకాలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నిధుల మూలాలు, సిరిసిల్లకు జిల్లా హోదా, నీటి సరఫరా అంశాలపై కూడా ఆ పార్టీ నేతలు ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.

గుడి చెరువు, బద్ది పోచమ్మ ఆలయం, బ్రిడ్జి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల్లో గత ప్రభుత్వం భూసేకరణ, నిధుల విషయంలో తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ట్యాంక్‌బండ్ పార్కును రూ.12 కోట్లతో పూర్తి చేసిందని, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి, సిరిసిల్ల బైపాస్ రోడ్డు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతోందన్నారు. బీఆర్ఎస్ నేతల విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారని, రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగరడం ఖాయమని ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాగుల సత్యనారాయణ గౌడ్, స్వరూపారెడ్డి, దేవరాజు, కౌన్సిలర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

- మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సత్యం, అహింస, శాంతి, సహనం, సమానత్వం వంటి గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ఐక్యతను పెంపొందించాలని, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, మహాత్మా గాంధీ ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలో శాంతి, సోదరభావం, సమానత్వం వెల్లివిరిసేలా ముందుకు సాగాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జీవితం, ఆయన త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, మార్కెట్ కమిటీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేగా పోటీ చేసిన పురుమళ్ల శ్రీను, మహిళా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్న రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి సయ్యద్ హమీద్ అలీ, పట్టణ కాంగ్రెస్ నాయకురాలు రాజితా రెడ్డి, మాజీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్లు మీసాల శంకర్, ఖాజా, కార్పొరేటర్లు మల్లికార్జున్, రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌కు ఇక రిటైర్మెంటేనా?

**అందుకే కేసీఆర్ ఫాంహౌస్ నుండి బయటకు రావడం లేదా బీఆర్ఎస్ నాయకులే సిరిసిల్లలో ప్రకటించారు : సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ భారీ సక్సెస్ కావడంతో బిఆర్ఎస్ నాయకులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ముఖరంపురలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం రాబోయే రోజుల్లో సిరిసిల్లను కాంగ్రెస్ గెలుచుకోవడం ఖాయం ఇక్కడి నుండి మంత్రి పదవి ఇస్తామని ప్రకటిస్తే బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించారని మొత్తం మీద భవిష్యత్తులో బిఆర్ఎస్ గెలిచే అవకాశం లేకున్నా ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులంతా కలిసి కేసీఆర్ ఇక రటైర్మెంటే అని చెప్పకనే చెప్పారని నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ అందుకే ఫాంహౌస్ లో నుండి బయటకు రావడం లేదని అన్నారు. ఒకవైపు బీఆర్ఎస్ నాయకుల భూదోపిడి పై విచారణ జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల మీటింగులో ఆధారాలు చూపించలేదని బిఆర్ఎస్ నాయకులు బాద పడుతున్నారని అన్నీ ఆధారాలు ప్రజల ముందు ఉంచుతారని ముందున్నది మొసళ్ల పండుగ బిఆర్ఎస్ నాయకులకు ఎందుకంత తొందర అని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఈ విలేఖరుల సమావేశంలో జీడి రమేష్, ఎండి చాంద్, ముక్క భాస్కర్, మహమ్మద్ భారీ, కుర్ర పోచయ్య, షబానా మహమ్మద్, అస్తపురం రమేష్, బషీర్, సాయిరాం, మాసుం ఖాన్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు షాపుల మూసివేతకు గ్రామసభలో తీర్మానం




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 02 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపులను తక్షణమే పూర్తిగా మూసివేయాలని సర్పంచ్ రాగుల రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించడమైనది.తేదీ 02-10-2026 శుక్రవారం రోజున గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో గ్రామ పాలకవర్గం మరియు గ్రామ పెద్దల సమక్షంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.గ్రామంలో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా లేదా అక్రమంగా మద్యం విక్రయాలు జరిపినా,ఈ తీర్మానాన్ని అతిక్రమించిన వారికి రూ. 10,000/-రూపాయలు జరిమానా విధిస్తామని సర్పంచ్ హెచ్చరించారు. బెల్టు షాపులు మూసివేయడం వల్ల గ్రామానికి కలిగే ప్రయోజనాలు గ్రామంలో మద్యం లభ్యతకు అడ్డుకట్ట,గల్లీ గల్లీలో మద్యం దొరకడం ఆగిపోవడంతో గ్రామంలో తాగుడు సమస్య గణనీయంగా తగ్గుతుందని,ఆడపడుచులకు మనశ్శాంతి,రక్షణ,ఇళ్ల మధ్యలో బెల్టు షాపుల వల్ల జరిగే తాగుబోతుల వీధి గొడవలు, మహిళలపై జరిగే అసభ్య ప్రవర్తనలకు పూర్తిగ తెరపడుతుందని,కుటుంబాల్లో ఆర్థిక పొదుపు, గ్రామంలోనే మద్యం అందుబాటులో లేకపోవడం వల్ల కూలీనాలి చేసుకునే పేదల కష్టార్జితం వృథా కాకుండా కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగపడుతుందని, యువత భవిష్యత్తు పరిరక్షణ,ఊర్లోనే సులువుగా మద్యం దొరికే అవకాశం లేకపోవడం వల్ల యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా వారి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని,గ్రామంలో శాంతియుత వాతావరణం బెల్టు షాపుల వద్ద నిత్యం జరిగే ఘర్షణలు ఆగిపోయి ఊరంతా ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుందని అంకిరెడ్డిపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ఎక్కడా బెల్టు షాపులు నడవకుండా ప్రజలు, యువకులు మరియు మహిళా సంఘాలు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ సలీం, పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో భారీ ఇంటి దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్టు.. రూ.56 లక్షల సొత్తు స్వాధీనం
- తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ.. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో ఛేదింపు
- 31.2 తులాల బంగారం, 3 కిలోల వెండి స్వాధీనం
- నిందితుల్లో ఒకరిపై గతంలో ఆరు కేసులు






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (జనం సాక్షి):** బాన్సువాడ పట్టణంలోని గౌలిగూడ కాలనీలో జరిగిన భారీ ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.56 లక్షల విలువైన 31.2 తులాల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి, రూ.9,700 నగదుతో పాటు చోరీకి ఉపయోగించిన ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర శుక్రవారం వెల్లడించారు. గౌలిగూడకు చెందిన చింతల భాస్కర్ సెప్టెంబర్ 27న మధ్యాహ్నం భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని బెడ్‌రూమ్ లాకర్ నుంచి బంగారం, వెండి, నగదు, ఇన్వర్టర్ చోరీ అయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు అక్టోబర్ 2న బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద దండుగుల మైసయ్య అలియాస్ మణికంఠ (25), దండుగుల ఎల్లయ్య అలియాస్ రాజు (20)ను అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన ఆభరణాలను హైదరాబాద్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఇంటి పక్కనే నివసించే మైసయ్యకు కుటుంబ సభ్యుల రాకపోకలపై అవగాహన ఉండటంతో బంధువు ఎల్లయ్యతో కలిసి చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. మైసయ్యపై గతంలో ఆరు ఇంటి దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి బిచ్కుంద కోర్టులో రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన బాన్సువాడ డీఎస్పీ పి.విఠల్‌రెడ్డి, టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శ్రీధర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ శిరీషతో పాటు క్రైమ్, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# వేములవాడలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- జ్యోతి ప్రజ్వలన చేసి కబడ్డీ పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి,గితే






**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/వేములవాడ అక్టోబర్ 2 (జనం సాక్షి) :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52 వ రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలు,36 వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలను వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి, గీతే, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా వేడుకలను ప్రారంభించారు. ఆనంతరం ప్రభుత్వ విప్ రాష్ట్రంలోని 34 జిల్లాల నుంచి విచ్చేసిన బాలురు, బాలికల కబడ్డీ క్రీడాకారులను ముఖ్య అతిథులు పరిచయం చేసుకుని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువు దీరిన వేములవాడ పుణ్యక్షేత్రంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 68 జట్లకు చెందిన 1300 మందికి పైగా క్రీడాకారులు,కోచులు, మేనేజర్లు, పీటీలు, పీడీలు ఈ పోటీలో పాల్గొంటున్నారని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు హాజరైన క్రీడాకారులకు వసతి భోజన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి, సహోద్యోగ స్ఫూర్తికి ఎంతో తోడ్పడతాయన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ జాతీయ స్థాయికి ఎదగాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చేర్మెన్ పుల్కం రాజు, వైస్ చేర్మెన్ శేఖర్, బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికీ ఆచరణీయం
- ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 2 (జనం సాక్షి):** జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆచరణీయమని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతిని పురస్కరించు కుని శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. సత్యం, అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాల ఆధారంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి శాంతియుత పోరాటంతో స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. హింసకు తావులేకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, శాంతియుత మార్గాల ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, సత్యనిష్ఠ, నిరాడంబర జీవనం, దేశభక్తి, సేవాభావం వంటి విలువలను ఆయన ఆచరించి చూపారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్న అధికారులు, సిబ్బంది ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నిజాయితీ, కర్తవ్యనిబద్ధత, పారదర్శకతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను సానుభూతితో విని నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందుతుందని అన్నారు.సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం బలోపేతం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్వచ్ఛతను కార్యక్రమాలకే పరిమితం చేయకుండా రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ అన్నారు. దేశ అభివృద్ధి, సమాజ సంక్షేమం కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే గాంధీజీ కలలు కన్న సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# అదనపు కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య



**చేవెళ్ల, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధించడంతో మనస్తాపానికి గురైన వివాహిత ముడిమ్యాల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నందిగామ మండలం చేగూరు గ్రామానికి చెందిన దొర నరసింహ, హంసమ్మ దంపతుల మూడో కుమార్తె రాధిక (30)కు సుమారు ఐదేళ్ల క్రితం ముడిమ్యాల్ గ్రామానికి చెందిన యంజల మధుతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో 12 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు కట్నంగా ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త మధు, అత్తమామలు లక్ష్మయ్య, పద్మమ్మ, బావ మహేందర్, తోటి కోడలు శిరీష వేధించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయాన్ని రాధిక తల్లిదండ్రులకు చెప్పడంతో గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు నచ్చజెప్పినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల వేధింపులతో మనస్తాపానికి గురైన రాధిక శుక్రవారం ఉదయం ముడిమ్యాల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి శరీరంపై గాయాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. సమాచారం అందుకున్న చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వరకట్న వేధింపుల కారణంగానే తన కుమార్తె మృతి చెందిందని మృతురాలి తల్లి హంసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో వైద్యురాలు మృతి



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** అనుమానాస్పద స్థితిలో ఓ వైద్యురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... హనుమకొండలోని ఓ వైద్య కళాశాలలో పిజి( పీడియాట్రిషన్ డిపార్ట్మెంట్) లో మొదటి సంవత్సరం చదువుతున్న కోమటి సృజన సెప్టెంబర్ 30న అనుమకొండ నుండి హైదరాబాద్ కు వచ్చింది. కొద్దిసేపటికే ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడం, తల్లిదండ్రులకు కూడా ఆమె సమాచారం లేకపోవడంతో అనుమానం వచ్చి మియాపూర్ పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఉన్న ప్రాంతాన్ని సిగ్నల్స్ ద్వారా గుర్తించి వెతికి చూడగా మియాపూర్ పరిధిలోని హోటల్ గ్రాండ్ బ్రోచిల్ వద్ద చూపిస్తుండడంతో పోలీసులు హోటల్లో తనిఖీ చేసి రూమ్ నెంబర్ 502 లో సృజన ఉన్నట్లు గుర్తించి హోటల్ సిబ్బంది సహకారంతో రూమ్ గదిని తెరవగా అప్పటికే ఆమె బెడ్ పై పడి ఉండడం, వైద్యులు పరిశీలించి ఆమె మృతి చెందిందని తెలపడంతో. ఏం జరిగి ఉంటుంది అనే కోణంలో సృజన తండ్రి కె. భూమయ్య ను విచారించగా గతంలో రవికుమార్ అనే వ్యక్తితో సృజనకు పరిచయం ఉందని, ఈ నేపథ్యంలోనే అతను ఆమెకు సంబంధించిన బంగారు గొలుసును తీసుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా వారి మధ్యలో ఏదైనా పేదాభిప్రాయం వచ్చి తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందేమో అన్న అనుమానాన్ని వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ కోణంలో కేసును నమోదు చేసుకుని దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# బాలికపై అత్యాచారయత్నం

## మంచాలలో పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

**రంగారెడ్డి, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామంలో సభ్య సమాజం తలదించుకునే ఘటన వెలుగు చూసింది. నాలుగేళ్ల బాలికపై 40 సంవత్సరాల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఇంటిముందు ఆడుకుంటున్న ఆ బాలికపై సదరు వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. లోయపల్లి గ్రామానికి చెందిన బి. నరేందర్ అలియాస్ నాని (40) సెప్టెంబరు 30న తన ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలిక(4)ను లోపలికి పిలిచాడు. సెల్‌ఫోన్ చూపిస్తానని ఆశ చూపించి చిన్నారిపై లైంగిక దాడికి యత్నించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆ రోజు రాత్రి చిన్నారి నొప్పితో బాధపడుతూ తల్లికి విషయం చెప్పింది. తొలుత సాధారణ నొప్పిగా భావించిన తల్లి ఆమెను సర్దిచెప్పారు. మరుసటి రోజు నొప్పి తీవ్రం కావడంతో చిన్నారి మళ్లీ ఏడవడంతో తల్లికి అనుమానం వచ్చింది. బాలికను పరిశీలించగా గాయాలు కనిపించడంతో తల్లిదండ్రులు ఆరా తీశారు. దీంతో తనకు ఎదురైన ఘటనను చిన్నారి తల్లిదండ్రులకు వివరించింది. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో డయల్-100కు సమాచారం అందించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం అర్ధరాత్రి 1 గంట సమయంలో నరేందర్‌పై కేసు నమోదు చేశారు. ఘటన అనంతరం నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతని కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. చిన్నారిపై దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన సంఘటనపై కండిస్తున్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం

- అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'సేవ్ డెమోక్రసీ వీక్'
- ఓటు హక్కు పరిరక్షణపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు
- ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో భారీ మార్చ్‌లు
- ఆర్టికల్ 326పై ప్రజలకు అవగాహన కల్పిస్తాం



**గోదావరిఖని, అక్టోబర్ 2 (జనం సాక్షి):** భారత ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. ఏఐసీసీ పిలుపు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'సేవ్ డెమోక్రసీ వీక్-ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం వారం' నిర్వహించనున్నట్లు తెలిపారు. గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ. ముస్తఫా అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికల సంఘం సంస్థాగత స్వతంత్రత, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇండియా కూటమి నిర్ణయం మేరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'ఓటును కాపాడండి--దేశాన్ని కాపాడండి' నినాదంతో భారీ మార్చ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మొదటి రోజు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో జిల్లా స్థాయి సంయుక్త సమావేశం నిర్వహించి, అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండో రోజు బ్లాక్ స్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను కార్యక్రమాలకు సమీకరిస్తామన్నారు. మూడో రోజు కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి భారీ జిల్లా స్థాయి మార్చ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ మార్చ్‌ను డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం, మహాత్మాగాంధీ విగ్రహం లేదా జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం వద్ద ముగించేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు.

మార్చ్ ముగింపు సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించడంతో పాటు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను ప్రజల సమక్షంలో చదివి, సార్వత్రిక వయోజన ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించనున్నట్లు రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఓటు హక్కు కేవలం ఒక హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి అది ప్రాథమిక ఆధారమని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకత్వం, సీనియర్ నాయకులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్లు, వివిధ విభాగాలు, సెల్స్, క్షేత్రస్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ. ముస్తఫా, నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు మాదరబోయిన రవికుమార్, బొంతల రాజేష్, నెలికంటి రాము, మారెల్లి రాజిరెడ్డి, దీటి బాలరాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బంగారు గొలుసు చోరీ కేసులో మహిళ అరెస్ట్

**యాచారం, అక్టోబర్ 2(జనంసాక్షి) :** లేడి చైన్ స్నాకర్ ను 24 గంటల్లో పోలీసులు పట్టుకొని రిమాండ్ కు తరలించారు.. సిఐ నందీశ్వర్ రెడ్డి, తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చౌదర్ పల్లి, గ్రామానికి చెందిన మారోజు వజ్రమ్మ, (65) వృద్ధురాలు ఇంటి ఆరు బయట ఉండగా పోచారం గ్రామానికి చెందిన జయ, చైన్ స్నాకర్ వృద్ధురాలితో మాటలు కలిపి మంచినీళ్లు కావాలని అడిగి వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని స్కూటీపై పరారు అయ్యింది. సిసి కెమెరాల ఆధారంగా స్కూటీ నెంబర్ను గుర్తించి చైను స్నాకర్ ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్టు ఒప్పుకోవడంతో అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# రైతాంగానికి కొత్త టెక్నాలజీలు అందించాలి : మంత్రి తుమ్మల



**రాజేంద్రనగర్, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహాత్మాగాంధీ 157వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచి, కొత్త సాంకేతికతలను అందించి అధిక దిగుబడులు, స్థిర ఆదాయం సాధించేలా కృషి చేయాలని అన్నారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. ఉపకులపతి ప్రొపెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట చరిత్రపై యువతకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నం వెంకయ్య,జి.నర్సయ్య, వెంకటేశ్వరరావు గాంధీయన్ స్కాలర్, హైకోర్టు న్యాయవాది డాక్టర్ ఏం.రఘుకుమార్ లను మంత్రి సత్కరించారు. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్నేహంపై మందలించడంతో మేనమామ హత్య

- స్నేహితుడితో కలిసి దాడి చేసిన మేనల్లుడు.. 24 గంటల్లో నిందితుల అరెస్టు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** నియోపోలిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో జరిగిన హత్య కేసును నార్సింగి పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మృతుడిని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఈటూ హాస్టల్‌లో ఉంటున్న ఖమ్మం జిల్లాకు చెందిన కంపాటి వెంకన్న (50)గా గుర్తించారు. మృతుడి మేనల్లుడు తల్ల వంశీగౌడ్ అలియాస్ సన్నీ (23), అతని స్నేహితుడు నాగన్నగారి రంజిత్‌రెడ్డి (21) ఈ కేసులో నిందితులుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరూ మియాపూర్‌లోని ఓ విద్యాసంస్థలో డిగ్రీ చదువుతున్నారు. రంజిత్‌తో స్నేహం, వంశీ ప్రవర్తనపై వెంకన్న తరచూ మందలించడంతో మేనమామపై వంశీ ఆగ్రహం పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. గతంలో వెంకన్నకు చెందిన స్విఫ్ట్ కారును వంశీ తీసుకెళ్లి ప్రమాదానికి గురిచేయడంతోనూ ఇద్దరి మధ్య వివాదం జరిగినట్లు తెలిపారు.సెప్టెంబర్ 30న కారు మరమ్మతు చేయించాల్సి ఉందని వెంకన్నను వంశీ నమ్మించాడు. రంజిత్‌తో కలిసి కారులో తీసుకెళ్లి నియోపోలిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ముందస్తు పథకం ప్రకారం క్రికెట్ బ్యాట్‌తో వెంకన్నపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా నార్సింగి పోలీసులు, ఎస్‌ఓటీ సైబరాబాద్ బృందాలు భౌతిక, సాంకేతిక, ఎలక్ట్రానిక్ ఆధారాలను సేకరించాయి. ప్రత్యేక బృందాల దర్యాప్తుతో నేరం జరిగిన 24 గంటల్లోనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు ఛేదించిన పోలీసు బృందాలను ఉన్నతాధికారులు అభినందించారు.



# టైక్వాండోలో రజత పతకం సాధించిన ఫాహాద్‌కు తలసాని అభినందనలు

## అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలుడికి సన్మానం

**అమీర్పేట్ :** అంతర్జాతీయ స్థాయి టైక్వాండో పోటీల్లో రజత పతకం సాధించిన అబ్దుల్ ఫాహాద్‌ను మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించి సన్మానించారు. బన్సీలాల్‌పేట డివిజన్‌లోని అరుణ్ జ్యోతి కాలనీకి చెందిన మహ్మద్ జావీద్ కుమారుడైన ఫాహాద్.. గత నెల 18 నుంచి 20వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన అండర్-17 అంతర్జాతీయ టైక్వాండో పోటీల్లో రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో సుమారు 10 దేశాలకు చెందిన 100 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఫాహాద్ ఎమ్మెల్యేకు వివరించాడు. రజత పతకం సాధించిన సందర్భంగా ఫాహాద్ శుక్రవారం తన తండ్రి జావీద్‌తో కలిసి వెస్ట్ మారేడ్‌పల్లి లోని తలసాని శ్రీనివాస్ యాదవ్ క్యాంపు కార్యాలయానికి వెళ్లాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాహాద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మోండా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రమోద్, దేవానంద్, సుధాకర్, భరత్, రంజిత్, రాజశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

# 510 గ్రాముల గంజాయి స్వాధీనం



**ధారూర్,అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ధారూర్ మండల కేంద్రంలోని సోమేశ్వ ర దేవాలయం సమీపంలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు.ఈ దాడిలో ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 510 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధారూర్ ఇన్చార్జ్ ఎస్ఐ సంగమేష్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రెడ్యా నాయక్,ఎల్లయ్య గౌడ్, సిబ్బంది శ్రీశైలం సంయుక్తంగా రైడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వికారాబాద్ అనంతగిరిపల్లికి చెందిన వంగూరు సంతోష్ (24), తండ్రి వంగూరు కిష్టయ్యను పోలీసులు పట్టుకున్నారు. విచారణలో నిందితుడు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి ధారూర్, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ధారూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘురాం తెలిపారు.

# యాచారం తహసీల్దార్, డీటీ సహా 10 మందిపై క్రిమినల్ కేసు






**యాచారం, అక్టోబర్ 2(జనం సాక్షి) :** రూ. 20 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ భూమి వివాదంలో నకిలీ పత్రాలు సృష్టించి కోర్టును తప్పుదోవ పట్టించేందుకు యత్నించారనే ఆరోపణలపై యాచారం తహసీల్దార్ అయ్యప్ప, ఉప తహసీల్దార్ (డీటీ) కీర్తిసాగర్, భూభారతి సిస్టమ్ ఆపరేటర్ నర్సింహాచారితో పాటు మరో 10 మందిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాచారం మండలం నందివనపర్తి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 361లో ఉన్న 8.29 ఎకరాల భూమికి సంబంధించి స్థానిక బాధితుడు ఎండీ నజీర్‌కు, ఆయన (దాయిదులకు) మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు, భూభారతి ఆపరేటర్ నర్సింహాచారి బాధితుడి ప్రత్యర్థులతో కుమ్మక్కై, అధికార దుర్వినియోగానికి పాల్పడి నకిలీ రెవెన్యూ పత్రాలను సృష్టించారు. వాటిని ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో తప్పుడు సాక్ష్యాలుగా సమర్పించి తనకు తీవ్ర అన్యాయం చేయాలని కుట్ర పన్నినట్లు బాధితుడు ఎండీ నజీర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఇబ్రహీంపట్నం పోలీసులు తహసీల్దార్ అయ్యప్ప, డీటీ కీర్తిసాగర్, సిస్టమ్ ఆపరేటర్ నర్సింహాచారి పాటు ఈ కుట్రతో సంబంధం ఉన్న మరో 10 మందిపై పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# హెల్త్ కార్డుల కోసం పోస్టుకార్డ్ ఉద్యమం

- జర్నలిస్టులకు వెంటనే క్యాష్ లెస్ హెల్త్ కార్డ్ ఇవ్వాలి
- వారం రోజుల పోస్టు కార్డ్ ఉద్యమానికి శ్రీకారం
- ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం
- టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అల్లం నారాయణ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ హోదాల్లో పని చేస్తున్న జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వం వెంటనే క్యాష్ లెస్ హెల్త్ కార్డులను ఇవ్వాలని టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చాలా హామీలు ఇచ్చిందని, అందులో ఇళ్ల స్థలాలు, వంద కోట్ల రూపాయల సంక్షేమ నిధి, హెల్త్ కార్డ్స్, అక్రెడిటేషన్ కార్డ్స్, పెన్షన్ వంటివి ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నా... జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇక గత ప్రభుత్వంలో అమలు అయిన హెల్త్ కార్డును ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది అత్యంత బాధాకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జర్నలిస్టులకు ఉన్న సౌకర్యాన్ని తొలగించారని, దానిని తిరిగి పునరుద్ధరించడం కోసం అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు గాంధేయ మార్గంలో శాంతి యుతంగా జర్నలిస్టులం నిరసన తెలుపుతున్నామని ఆయన చెప్పారు. హెల్త్ కార్డుల కోసం టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్ రాంగోపాల్ పేట గాంధీ చౌక్ నుంచి పోస్టు కార్డు ఉద్యమాన్ని అల్లం నారాయణ ప్రారంభించారు. కొత్తగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా, గతంలో జేఎన్ జే హౌసింగ్ సొసైటీకి ఇచ్చి పేట్ బషీరాబాద్ స్థలాన్ని తిరిగి తీసుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉన్న హెల్త్ కార్డును కూడా రద్దు చేశారని, నిత్యం పని వత్తిడితో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు ప్రభుత్వ ఉచిత హెల్త్ కార్డు అవసరం ఉందని అల్లం నారాయణ అన్నారు. గాంధీ అనుసరించిన మార్గంలో మొదటగా శాంతి యుత పోరాటాన్ని చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరోరూపంలో ఉధృతం చేస్తామని అల్లం నారాయణ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని పార్టీలు, సంఘాలు, సంస్థలను ఏకం చేసి ఉద్యమాలు చేసిన జర్నలిస్టులం, ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వకపోతే మరో సారి ఉద్యమిస్తామన్నారు.

ఈ సందర్భంగా టీ యూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం జర్నలిస్టులకు కొత్తగా ఏమీ ఇవ్వకపోయినా, ఉన్న హెల్త్ కార్డులను తొలగించిందని అన్నరు. హెల్త్ కార్డుల కోసం పోస్టు కార్డ్ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూ డబ్ల్యూ జే ఉపాధ్యక్షులు రమేష్ హజారీ, టెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్,టీయూ డబ్ల్యూ జే కోశాధికారి పి.యోగనంద్, హైదరాబాద్ నగర ఇంచార్జ్ యార నవీన్ కుమార్, హైదరాబాద్ నగర అధ్యక్షుడు రాకేశ్ రెడ్డి, కోశాధికారి బాపు రావు, ఐజేయు నాయకుడు తిరుపతి నాయక్, కల్యారి రాజు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఫోటో జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కొరత లేదు.. ఉండదు

- 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా



**హైదరాబాద్, అక్టోబర్ 02 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## కొడంగల్‌లో సభ పెడతాం

**హైదరాబాద్, అక్టోబర్ 02(జనంసాక్షి) :** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు.

# 'బాపు బాట'లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ నిర్వహించిన 'బాపు బాట – గాంధేయం... జగజ్జేయం...' కార్యక్రమంలో ముఖ్య అతిథిగాలుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారుడు వి.హనుమంత్ రావు ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, వేణుగోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పరిగి ఎమ్మెల్యే రాం మోహన్ రెడ్డి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి (ఎల్.బి.) స్టేడియం వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధేయ విలువలు, స్వదేశీ ఆలోచన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, స్వావలంబన, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 1157 చరఖాల ప్రదర్శన, మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, స్వదేశీ మేళా–2026 వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహాత్మా గాంధీ ఆచరించిన సత్యం, అహింస, స్వదేశీ, స్వావలంబన వంటి సిద్ధాంతాలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాసంగికమని కార్యక్రమంలో పాల్గొన్నటీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, స్వదేశీ, గ్రామ స్వరాజ్యం వంటి మార్గాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆలోచనలను కేవలం జయంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, యువతలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులు మరియు చేతివృత్తుల వారికి అండగా నిలవడం, పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర అభివృద్ధి సాధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. చరఖా, ఖాదీ, స్వదేశీ భావనల ద్వారా గాంధీజీ దేశ ప్రజల్లో స్వావలంబన స్ఫూర్తిని నింపారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహించిన స్వదేశీ మేళాలో వివిధ స్వదేశీ ఉత్పత్తులు, చేతివృత్తులు, సంప్రదాయ కళలు, స్థానిక ఉత్పత్తులను ప్రదర్శించారు. గాంధేయ సిద్ధాంతాలపై అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త, గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రజా పాలన దిశగా అడుగులు వేస్తున్నారని ఆయన అన్నారు. 153 మంది టీచర్లు కి సన్మానం చేయడం జరిగింది. వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతులకు 45 మంది కి వ్యవసాయ కార్పోరేషన్ ఛైర్మెన్ కోదండ రామ్ రెడ్డి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పోరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, ప్రోగ్రాం కన్వీనర్ లు ప్రభాకర్ గాంధారి, ప్రభాకర్ రెడ్డి రాజేందర్ రెడ్డి , శ్రీనివాస్‌రెడ్డి, అల్లం భాస్కర్, జగదీశ్వర్ కాంగ్రెస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్-2027లో ఓబీసీ కాలమ్ చేర్చాలి

- నేడు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గన్‌పార్క్‌లో ధర్నా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సెన్సస్–2027లో ఓబీసీల జనాభా వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసేందుకు ఓబీసీ కాలమ్‌ను చేర్చకపోవడంపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్, ఆల్ ఇండియా ఓబీసీ పొలిటికల్ రిప్రజెంటీవ్స్ ఫోరమ్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నేడు నిరసన ధర్నా నిర్వహించనున్నారు. దేశ జనాభాలో ఓబీసీల సంఖ్య, సామాజిక–ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలపై సమగ్ర విధాన నిర్ణయాలు తీసుకోవాలంటే కులాల వారీగా జనాభా గణన అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. సెన్సస్‌లో ప్రతి కులానికి సంబంధించిన జనాభా వివరాలు శాస్త్రీయంగా నమోదు చేయడంతో పాటు, భవిష్యత్ సంక్షేమ, అభివృద్ధి, ప్రాతినిధ్య విధానాలకు ఉపయోగపడే విధంగా ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి బీసీ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, బీసీ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# విషాదంలోనూ మరో జీవితానికి వెలుగు



- బోయిన అనీషా అవయవదానం
- పలువురికి ప్రాణదానం



**అల్వాల్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** కుటుంబంలో తీరని విషాదం నెలకొన్న వేళ.. మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయం పలువురికి ప్రాణదానం చేయనుంది. అల్వాల్ సర్కిల్ శ్రీనగర్ కాలనీకి చెందిన బోయిన అనీషా (32) అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌స్టెమ్ డెత్‌కు గురయ్యారు. ఆమె అవయవాలను దానం చేసేందుకు భర్త ఆదిత్య ముందుకు రావడంతో జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవదాన ప్రక్రియ చేపట్టారు.

కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఆరు నెలల గర్భిణిగా ఉన్న అనీషాకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో సిజేరియన్ చేసి శిశువును బయటకు తీశారు. అనంతరం ఆమె ఆరోగ్యం మెరుగు పడక, రక్తపోటు అధికమై పరిస్థితి విషమించిందని తెలిపారు.

అనీషా, ఆమె భర్త ఆదిత్య సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగులు. వీరికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. అనీషా మామ లక్ష్మీనారాయణ మాజీ సైనికుడు. కుటుంబానికి తీరని విషాదం ఎదురైనప్పటికీ.. అనీషా అవయవాలను దానం చేయాలన్న కుటుంబ నిర్ణయాన్ని పలువురు ప్రశంసించారు. అవయవదానం ద్వారా అవసరమైన వారికి కొత్త జీవితాన్ని అందించే అవకాశం కల్పించిన కుటుంబం మానవతా దృక్పథాన్ని పలువురు అభినందించారు.

# అన్నదాన సత్రంలో మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన



- ఖాసీంపేట శ్రీ మానసా దేవి ఆలయంలో భక్తుల రద్దీ

**గన్నేరువరం, అక్టోబర్ 02 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం, ఖాసీంపేటలోని శ్రీ మానసా దేవి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. గాంధీ జయంతి సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుండి దాదాపు 5 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుండే క్యూ లైన్లు బారులు తీరాయి.

## అన్నదాన సత్రంలో మహిళల ఆగ్రహం

అయితే అన్నదాన సత్రం వద్ద అపశృతి చోటుచేసుకుంది. భోజనం కోసం క్యూ లైన్ లో నిల్చున్న మహిళలను అక్కడి మగ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని, ఒంటిపై చెయ్యేసి నెట్టేశారని మహిళా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాన సత్రంలో భోజన హాల్ పెద్దగా ఉన్నప్పటికీ, గేటు ముందు ఇరుకు ప్రదేశంలో గంటల తరబడి నిలబెట్టడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అన్నదాన సత్రంలో తక్షణమే మహిళా సిబ్బందిని నియమించాలని, ప్రస్తుతం ఉన్న సిబ్బందిని తొలగించాలని మహిళా భక్తులు డిమాండ్ చేశారు. ఆలయ కమిటీ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



# అతివేగంతో మున్సిపల్ కార్మికున్ని ఢీకొట్టిన కారు



**నాచారం (జనంసాక్షి) :** నిర్లక్ష్యంగా,అతి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో జిహెచ్ఎంసి కార్మికునికి తీవ్ర గాయాల పాలైన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో హబ్సిగూడ ప్రధాన మార్గం సీసీఎంబి గేటు వద్ద ఉదయం రోడ్డును శుభ్రపరుస్తున్న కార్మికుడు నరసింహను వెనక నుండి వచ్చిన కారు ఒక్కసారిగా ఢీకొనడంతో అక్కడికక్కడే నరసింహకు రెండు కాళ్లు విరిగిపోయిన సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదాన్ని చూసిన తోటి కార్మికులు వెంటనే అప్రమత్తమై నరసింహను ఢీకొట్టిన కారు నంబరును గుర్తించుకొని పోలీసులకు సమాచారం అందించినట్లు కార్మికులు తెలిపారు. అనంతరం తీవ్ర గాయాలతో పడి ఉన్న కార్మికుడు నాగారం నరసింహులు (47) వెంటనే నాచారంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో నరసింహను అతని గాయాలను పరిశీలించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం సనత్ నగర్ లోని ఈఎస్ఐకి తరలించినట్లు తోటి కార్మికులు తెలిపారు. అతివేగం వల్ల నిర్లక్ష్యమైన డ్రైవింగ్ వల్ల తనకు రెండు కాళ్లు విరిగిపోయిన విషయమై నాచారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగారం నరసింహ కార్మికుని ఢీ కొట్టిన కారు యజమాని డ్రైవర్ సర్దార్ సిమర్జిత్ సింగ్ (33) పై కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు నాచారం పోలీసులు తెలిపారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370